

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



సంపుటి11 | సంచిక 93

ఆదివారం | 28 జనవరి 2018 | విజయవాడ | పేజీలు 12+12+16 | వెల: రూ. 6.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్ష తిథి : ద్వాదశి రా.2.56, మృగశిర రా.11.34, వర్జ్యం ఉ.7.58 వరకు
రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు; దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు, సూర్యోదయం : ఉ.6.53 గం; సూర్యాస్తమయం: సా. 6.05 గం.

కాబూల్‌లో భారీ పేలుడు

● 105 మంది మృతి ● 200 మందికి గాయాలు ● భారత ఎంబసీ సమీపంలో ఘటన

మూడుసార్లు జరిగిన పేలుళ్లు

- ఇది తమ పనేనని ప్రకటించిన తాలిబన్లు
- దాడి జరిగిన సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలు
- భారత రాయబార 'సిబ్బంది' సురక్షితం
- పోలీసు చెక్ పాయింట్ వద్ద పేలిన అంబులెన్స్
- కదిలిపోయిన సమీపంలోని భవనాల కిటికీలు
- సోషల్ మీడియాలో పేలుడు దృశ్యాలు
- ఉగ్రదాడిని ఖండించిన భారత్
- ముష్కరులను మట్టుపెట్టాలని వినతి



కాబూల్ : అఫ్గానిస్తాన్ రాజధాని కాబుల్ లో శనివారం భారీ పేలుడు చోటు చేసుకుంది. భారత రాయభార కార్యాలయానికి 400 మీటర్ల దూరంలో ఈ పేలుడు సంభవించింది. ఈ దాడిలో 102 మంది మృతిచెందగా, 200 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మూడుసార్లు భారీ పేలుడు శబ్ధం వినిపించిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ దాడి తమ పనేనని తాలిబన్లు ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఆఫీసులు, స్వీడిష్ మిషన్స్, హై పీస్ కౌన్సిల్‌లు కూడా దాడి జరిగిన స్థలానికి సమీపంలో ఉన్నాయి. ఆత్మాహుతి దాడికి ఓ అంబులెన్స్‌ను వాడినట్టు అఫ్గాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి వహీద్ మజ్రూహ్ తెలిపారు. భారత రాయభార

మిగతా 6లో



నదిలో పడిన బస్సు

● 13 మంది మృతి మరికొందరు గల్లంతు ● మరణించినవారిలో మహిళలు, చిన్నారులు ● మృతదేహాలను వెలికితీన రెస్క్యూటీం ● ఘటన సమయంలో బస్సులో 17 మంది ప్రయాణికులు ● డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం

ముంబై: మహారాష్ట్రలోని కొల్హాపూర్ సమీపంలో ఒక బస్సు పంచగంగ నదిలో పడిపోవడంతో 13 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. మరణించినవారిలో మహిళలు, చిన్నారులు ఉన్నారు. రెస్క్యూటీం నదిలోని మృతదేహాలను వెలికితీసింది. మీడియాకు అందిన సమాచారం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటలకు పంచగంగ నదిపై నున్న శివాజీ బ్రిడ్జి నుంచి ఒక బస్సు

మిగతా 6లో



12లో

ఐపీఎల్ తొలి రోజు వేలం పూర్తి

అంచనాలు తారుమారు

● యువతకు ఫ్రాంచైజీల పెద్దపీట ● గతం ఖరీదైన ఆటగాళ్లకు నిరాశ ● కనీస ధరకే ఒకప్పటి మ్యాచ్ విన్నర్లు ● గేల్, గప్టిల్ వంటి స్టార్లకు చుక్కెదురు ● వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఫ్రాంచైజీలు ● అత్యధిక ధర బెన్ స్టోక్‌కు రూ.12.5 కోట్లు

ఏపీలో సృజనాత్మక కేంద్రం

● శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు అభివృద్ధి ● ప్రకృతికి కుల మతాలతో సంబంధం లేదు ● మిత్రధర్మం గురించి బీజేపీ ఆలోచించుకోవాలి ● గవర్నర్‌పై బహిరంగ వ్యాఖ్యలు చేయలేను ● ఇప్పటి వరకు నేను 14 సార్లు ఈ సదస్సుకు వెళ్లాను ● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



(వెలగపూడి–సూర్య ప్రధాన ప్రతినిధి) : టెక్నాలజీలో, రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్టీజీ)లో ముందున్న ఏపీలో ఇన్నోవేషన్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. దావోస్ పర్యటన ముగించుకొని వచ్చిన సందర్భంగా శనివారం వెలగపూడి సచివాలయం 1వ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు ఇన్నోకేషన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) కూడా సహకరిస్తుందన్నారు. దావోస్ పర్యటన విజయవంతంగా జరిగినట్లు తెలిపారు. ప్రపంచంలోని మేథావులు, పారిశ్రామికవేత్తలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ప్రపంచ ఆర్థిక వేదిక

మిగతా 6లో

పొత్తు పొడిచేనా!

● పోలవరం ప్రాజెక్టు మెలికలపై బాబు అసంతృప్తి ● కేంద్రం హామీలను నెరవేర్చకపోవడంపై ఆగ్రహం ● మంత్రి పదవులపైనా బీజేపీ నేతల ఘాటు విమర్శలు ● బీజేపీపై చంద్రబాబు ఆగ్రహానికి కారణాలివేనా? ● ఏపీలో కొత్త రాజకీయ సమీకరణాలు షురూ ● పొత్తు కోసం ఢిల్లీలో వైసీపీ నేతల లాబీయింగ్ ● మిత్రధర్మంపై వాళ్లే ఆలోచించుకోవాలన్న బాబు ● ప్రెస్‌మీట్‌లో సీఎం వ్యాఖ్యలు



(అమరావతి–సూర్య ప్రధాన ప్రతినిధి) : 'నవ్యాంధ్రలో గత ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీతో కలిసి పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ ఈ సారి అదే రీతిలో ముందుకు పోతుందా ? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆగ్రహంతో ఉన్నారు. అధికార పార్టీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వడంపై బీజేపీ నేతలు ధిక్కార స్వరం వినిపించారు. మరోవైపు బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు మిన్నకుంటున్నారు. తాజాగా ఆయన పొత్తుపై మిత్ర ధర్మం పాటిస్తానని, వారి పార్టీ నేతల వ్యాఖ్యలపై వారే ఆలోచించాలని వ్యాఖ్యానించడం చర్చనీయాం శంగా మారింది. గతంలోనూ ఎమ్మెల్సీలు అధికార పార్టీపై వ్యాఖ్యలు చేసిన సందర్భంలోనూ చంద్రబాబు మిత్ర పక్షాన్ని విమర్శించవద్దని, టీడీపీ క్రమశిక్షణ పాటించాలని సున్నితంగా మందలించిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికలకు ఏడాది ఉన్న సమ యంలో ఆయన మిత్రధర్మం గురించి మాట్లాడడం

మిగతా 6లో

ఎట్టకేలకు ఒక విజయం



వివరాలు 12లో

● మూడో టెస్టులో కోహ్లీ సేనకు ఊరట ● ఒకరోజు మ్యాచ్ ఉండగానే గెలుపు ● 63 పరుగుల తేడాతో సౌతాఫ్రికా చిత్తు ● సీరీస్ చేజారినా పరువు దక్కింది ● ఆఖరు వరకు పోరాడిన ఎల్గర్, ఆమ్లా ● ఐదు వికెట్లతో షమి విజృంభణ ● సఫారీల ఆధిక్యం 2-1కి తగ్గింపు

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

ప్రజల గోడు వింటూ ముందుకుసాగుతున్న జగన్



- సూళ్లూరుపేట నియోజకవర్గం ఓజిలిలో ఘనస్వాగతం
- గుర్రంకొండలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ
- ఆర్మేనుపాడులో పార్టీ జెండాను ఆవిష్కరించిన జగన్
- గూడూరు నియోజకవర్గంలోకి చేరుకున్న పాదయాత్ర
- నేడు కొండగుంట నుంచి పాదయాత్ర ప్రారంభం
- గూడూరు కోర్టు సెంటర్‌లో బహిరంగ సభ
- 980.5 కిలోమీటర్ల దూరం పూర్తిచేసుకున పాదయాత్ర

6లో

అంతే ఇంతే!



వ్యతిరేకిస్తోంది వర్మ జీఎస్టీనా, మోడీ జీఎస్టీనా?

నేను రైతు పక్షం



● నేను ఎవరికీ తొత్తును కాను ● సిద్ధాంతాలకు ప్రాధాన్యత ఇస్తా అంశాలను బట్టే మద్దతు ఇస్తా ● అనంత సభలో జనసేనాని పవన్ కళ్యాణ్ ● సమస్యలపై అధ్యయనం చేస్తా పరిష్కారం కోసం కేసీఆర్ బాబులను కలుస్తా ● వచ్చే ఎన్నికల గురించి ఆలోచించడం లేదు ● సీమ కరవును ప్రధాని దృష్టికి తీసుకెళ్తా? ● రైతుకు అండగా ఉన్న వారికే నా మద్దతు ఇస్తా ● పోరాడితేనే కరవు పోతుంది ● నా చివరి శ్వాస వరకు సీమ కోసం ఉంటా

6లో

సోషల్ మీడియాపై ఆంక్షలు హక్కుల ఉల్లంఘనే

టీ-పీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: సోషల్ మీడియాపై ఆంక్షలు విధించాలని చూడడం హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని టీ-పీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ అన్నారు. సోషల్ మీడియా వల్లే తెలంగాణ ఉద్యమం పతాకస్థాయికు చేరుకున్నదని, స్వరాష్ట్ర సాధనలో సోషల్‌మీడియా కీలకపాత్ర పోషించిన విషయాన్ని మరువరాదని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యవ్యవస్థలో చర్చించడం, వ్యతిరేకించడం ద్వారానే సమస్యలను పరిష్కరించొచ్చని అలాంటిది ప్రజాస్వామ్య మూల స్థంభాలను ను విరిచేయాలని చూడడం ప్రభుత్వానికి తగదని అన్నారు. సెక్షన్ 506, 507 లను కాగ్నిజబుల్ చట్టంగామార్పు చేయడాన్నికాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్న ఆయన, ముఖ్యమంత్రి కేసీఆర్ అణిచివేత చర్యకు ఇది పరాకాష్టగా భావిస్తున్నమని చెప్పారు. శనివారం గాంధీ భవన్ లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాము ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రతిపక్షంగా వ్యతిరేకించాలన్న భావనతో కాకుండా ప్రజా వ్యతిరేక చర్యలను అడ్డుకునేందుకే ప్రయత్నిస్తున్నామన్నారు.

ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసి, ప్రశ్నించే గొంతును నులిమేయాలని చూస్తుందన్నారు. దీన్ని అడ్డుకు ని తీరుతామని, అవసరమైతే న్యాయ పరంగా పోరాడుతామన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు ప్రశ్నిస్తే సహించలేక పోవడం దారుణమని ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టు లాంటిదని శ్రవణ్ అన్నారు. ప్రజావ్యతిరేక చర్యల వెలికి రాకుండా అడ్డుకోవాలని చూడడం తగదన్న ఆయన, పాలకులు తమ వైపల్యాలను కప్పిపుచ్చుకోవాలనుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే విఘాతం కలుగుతుందన్నారు.

సెక్షన్ 506, 507 లను నాన్ కాగ్నిజబుల్ చట్టాలుగా మార్పుచేసే అధికారం రాష్ట్రప్రభుత్వానికి లేదని ఆయన అన్నారు. హక్కులేకున్నా, చట్టం చేయాలని చూడడం, అవి కోర్టుల్లో నిలవక పోవడం , కోర్టుల్లో మొట్టికాయలు వేయించుకోవడం కేసీఆర్ ప్రభుత్వానికి షరా మామూలయ్యిందని ఎద్దేవా చేశారు.

పదోన్నతుల పంచాయతీ

- పీఆర్ ఇంజనీర్ల సంఘం అత్యవసర సమావేశం
- ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల మౌన దీక్ష
- మాకు తీవ్ర అన్యాయం జరిగింది : పీఆర్ ఇంజనీర్లు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: పంచాయితీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజనీర్ల పదోన్నతుల పంచాయితీ చిలికి..చిలికి గాలివానలా మారింది. పదోన్నతుల కల్పనకోసం టి.ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల సంఘం మౌనదీక్షకు దిగగా, పదోన్నతుల కల్పణలో పీఆర్ ఇఎన్‌సీని టార్గెట్ చేయడాన్ని తెలంగాణ పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించి తీవ్రంగా ఖండించింది. గురువారంనాడు కార్యాలయంలో గణతంత్రదినోత్సవం సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఇఎన్‌సీ పదోన్నతుల కల్పణకు సీనియారిటీ జాబితా రూపొందించడంలో పీఆర్ ఇఎన్‌సీ సత్యనారాయణరెడ్డి తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, దీంతోనే ఇంచార్జీ పదోన్నతులు కల్పించినా రెగ్యులర్ పదోన్నతుల్లో జాప్యం జరుగుతున్నదని ఆరోపించారు. అయితే ఈ విషయంపై రెండు విభాగాల ఇంజనీర్లు పదోన్నతుల కల్పణలో తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయంపై ఏకరువు పెట్టారు.



ఇరవైఏళ్లు అయినా సింగిల్ ప్రమోషన్ లేదు : పీఆర్

పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 1997లో పబ్లిక్‌సర్వీస్ కమీషన్ ద్వారా ఎంపికైన ఏఇలు, అలాగే 1994లో తాత్కాలిక ప్రాతిపదికన ఏఇలుగా ఉద్యోగంలో చేరి తర్వాత రెగ్యులర్ అయిన వారికి నేటికి కూడా పదోన్నలు కల్పించలేదని తెలంగాణ పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ ముజీబ్, ప్రధానకార్యదర్శి మర్రి రమేశ్, రజిత, విద్యాసాగర్, అనీల్, జవహార్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారంనాడు అత్యవసర అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి, సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వివరించారు. పదోన్నతుల కల్పణపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇఎన్‌సీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారట్లు తెలిపారు. గతంలో పంచాయితీరాజ్‌లోనే ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ఉండేదని, అయితే రెండు విభాగాలుగా విభజించిన తర్వాత పీఆర్‌లో పనిచేసేందుకు ఉద్యోగులు మక్కువ చూపారని, ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేసేందుకు ఎవరు కూడా ముందుకురాలేదన్నారు. దీంతో ఉన్న ఉద్యోగుల్లో 80శాతం మంది పీఆర్‌లో ఉండేందుకు కేవలం 20శాతం మంది మాత్రమే ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేసేందుకు ముందుకువచ్చారన్నారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్‌లో తక్కువ మంది ఉద్యోగులు ఉండడంతో పదోన్నతుల జాతర కొనసాగిందని, దీంతో పీఆర్‌లో పనిచేస్తున్న ఇంజనీర్లకు పదోన్నలు రాక ఇకే పోస్టులో గత 20ఏళ్లుగా కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భగీరథ ప్రాజెక్టును ప్రారంభించడం, ఆర్‌డబ్ల్యూఎస్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో కొత్తగా ఉద్యోగాల నియామకం, పాతవారికి పదోన్నలు వచ్చాయన్నారు. తమ కంటే పదేళ్ల తర్వాత ఏఇగా విధుల్లో చేరిన వారు నేడు ఇఇలు, ఎస్‌ఇలుగా పదోన్నలు పొందారని, పీఆర్‌లో మాత్రం ఏఇ, డీఇకే పరిమితమయ్యామని, రిటైర్మెంట్ వరకు కూడా డీఇ పదోన్నతి దక్కుతుందా? లేదా? ఎదురుచూస్తున్నామని తెలిపారు. 2008లో పీఆర్ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ వేరుపడ్డ తర్వాత మూడేళ్లు ఉమ్మడి సినియారిటీ నమోదు చేయాలన్న నిబంధనలన్నింటిని ఆర్‌డబ్ల్యూఎస్ తుంగలో తొక్కిందని ఆరోపించారు. డిప్యూటేషన్‌పై తమను డీఇగా తీసుకోవాలని పలుమార్లు



ఆర్‌డబ్ల్యూఎస్ ఇఎన్‌సీకి విజ్ఞప్తి చేశామని, అయితే అందుకు సరేనన్నారని, తర్వాత తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకంగా పనిచేశామని, అయితే ప్రతీ ఉద్యోగికి పదోన్నతులు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అని అయితే పీఆర్‌లో 1997లో నియామకం అయిన ఏఇలకు ప్రమోషన్ కల్పించే విషయాన్ని సీఎం, మంత్రి జూపల్లి పరిశీలించి న్యాయం చేయాలని వారు ధీనంగా వేడుకున్నారు. పదోన్నతుల అంశంపై ఇద్దరు ఇఎన్‌సీలు కూర్చొని చర్చించాలని, ఇచ్చి, పుచ్చుకొనే ధోరణి ఉంటే సమస్య పరిష్కారం అవుతుందని ముజీబ్ పేర్కొన్నారు. అద్దాల మేడపై ఉన్నోడు నేలపై కూర్చున్నవారిపై రాళ్లతో కొట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ఇంజనీర్ల పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఒకే శాఖ నుంచి వేరుపడ్డ ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ విభాగాల్లో పదోన్నతుల్లో జరుగుతున్న వ్యత్యాసాన్ని, అన్యాయంపై ప్రభుత్వ పాలకులు దృష్టిసారించాలని వారు విజ్ఞప్తి చేశారు. 2013లో ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఏఇగా జాయిన్ అయిన వారు నేడు డిఇ, ఇఇపోస్టుల్లో ఉన్నారని, అదే పీఆర్‌లో 1997లో జాయిన్ అయినా ఇంకా ఏఇగా పనిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రెగ్యులరైజేషన్‌లో ఇఎన్‌సీ నిర్లక్ష్యం : ఆర్‌డబ్ల్యూఎస్

గ్రామీణ తాగునీటి సరఫరా విభాగంలో 2000 సంవత్సరం నుంచి డీఇకి మించిన పదోన్నతులు లేవని టీఆర్‌డబ్ల్యూఎస్ఇంజనీర్ల అసోసియేషన్ ఆరోపించింది. ఇందుకు రకరకాల కారణాలున్నాయని, ముఖ్యంగా ఇఎన్‌సీల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని వారు విమర్శించారు. ఇంచార్జీ పదోన్నతులపై కొనసాగుతున్న ఇంజనీర్లందరిని రెగ్యులరైజ్ చేయాలంటూ శనివారంనాడు కార్యాలయం గేటు ముందు ఉద్యోగులు రెండు గంటలపాటు 'మౌనదీక్ష' చేపట్టారు. ఈ సందర్భంగా ఆసోషియేషన్ అధ్యక్షుడు కె.ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.నరేందరర్, సదానందం, ప్రవీన్‌కుమార్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ ఇంచార్జీ డీఇ, ఇఇ, ఎస్ఇ పదోన్నతులు పొందిన వారిని రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను పక్కదోవపట్టించే ందుకు ఇఎన్‌సీ యత్నిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ అధికారులు సినియారిటీ జాబితా తయారు చేయలేదని, చేస్తే తెలగాణ వారికి పదోన్నతులు వస్తాయని తొక్కిపెట్టారన్నారు. పీఆర్ నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ విడిపోయి పదేళ్లు కావస్తున్నా పదోన్నతులు కల్పనలో జాప్యం జరుగుతున్నదన్నారు. పదోన్నతులు కల్పనకు విభజన నిబంధనల ప్రకారం 58శాతం, తెలంగాణ 42శాతం పోస్టుల అంగీకారం కుదిరినా చేయటంలేదని ఆరోపించారు. పీఆర్‌లో నాలుగు నెలల క్రితం పదోన్నతులు పొందిన వారు రెగ్యులరైజ్ అయ్యారని, అయితే ఆర్‌డబ్ల్యూఎస్‌లో పదేళ్లుగా ఇంచార్జి పదోన్నతులపైనే పనిచేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఎస్ఇ, ఇఇ, సీఇలు 78మంది పనిచేస్తున్నారని ఇందులో కేవలం అయిదుమంది మాత్రమే రెగ్యులర్ అయ్యారని ఎల్లారెడ్డి తెలిపారు. రెగ్యులర్ చేయకపోవడంతో డీఇ పదోన్నతులు పొందినా ఏఇజీతం మాత్రమే తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ డిమాండ్ల సాధనకు సోమవారంనాడు అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి తదుపరి పోరాటాన్ని ప్రకటిస్తామని ఎల్లారెడ్డి, నరేందర్ హెచ్చరించారు.

సింహపురిలో సత్తా ఎవరిదో ?

- ఫ్యాన్ ధాటికి సైకిల్ పయనమెటు?
- పది నియోజకవర్గాల్లో మూడే టీడీపీవి
- రెండు ఎంపీ స్థానాల్లోనూ వైసీపీ పాగా
- జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్సీలకు మంత్రి పదవులు
- సామాన్య కార్యకర్తలకు అందుబాటులోకి రాని నేతలు
- ఆనం సోదరులకు అచ్చిరాని వైనం
- నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయని అధిష్ఠానం

(అమరావతి-సూర్య ప్రధాన ప్రతినిధి): సింహపురి...రాజకీయాలకు పెట్టింది పేరు...అనాదిగా ఈ ప్రాంతానికి రాజకీయంగా ఎంతో పేరుంది. సింహపురి క్రమేణా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారినా ఇన్నేళ్లలో ఎంతోమంది రాజకీయ ఉద్దండులు ఇక్కడి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ ధాటికి టీడీపీ ఎక్కువ స్థానాలను పొందలేకపోయింది. పది నియోజకవర్గాలకు గాను కేవలం మూడింటిని మాత్రమే సొంతం చేసుకోగలిగింది. అలాగే రెండు పార్లమెంట్ స్థానాలు కూడా వైసీపీ ఖాతాలో పడ్డాయి. అనూహ్యంగా వైసీపీ ఎక్కువ నియోజకవర్గాల్లో పాగా వేయడంతో ప్రస్తుతం ఇద్దరు ఎమ్మెల్సీలకు ఇక్కడి నుంచి మంత్రివర్గంలో ప్రాధాన్యత కల్పించాల్సి వచ్చింది. ప్రస్తుతం పురపాలక శాఖ మంత్రిగా పొంగూరు నారాయణ, వ్యవసాయశాఖ మంత్రిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేబినెట్‌లో ఉన్నారు. నెల్లూరు జిల్లానుంచి బీద రవిచంద్ర సైతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇంతమంది సీనియర్ నేతలు ఉన్నా పార్టీలో కిందిస్థాయి కార్యకర్తలను దూరం పెడుతున్నారన్న విమర్శలు పెరుగుతున్నాయి. మరోవైపు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఆనం సోదరులకు ఎంతో పేరున్నా అధికార పార్టీలో మాత్రం వారికి ఆశించిన ప్రాతినిధ్యం లేదన్నది బహిరంగ రహస్యం. ఎమ్మెల్సీ పదవిని ఆశించినప్పటికీ చివరి నిముషంలో ఆ పదవి వేరేవారికి ఇవ్వాల్సి రావడంతో మాజీ మంత్ర ఆనం రామనారాయణరెడ్డికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పదవిలో అధికార పార్టీ సరిపెట్టాల్సిన పరిస్థితి వచ్చింది.

నారాయణ సొంత జిల్లాలో టాక్ ఇదీ: ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణకు రాజకీయాలు కలిసొచ్చాయా..? నారాయణ గురించి ఆయన సొంత జిల్లాలో జనం ఏమనుకుంటున్నారు? ఆయన చేసిన మంచి పనులేమిటి..? ఎందుకని ఆయనపై ఆరోపణలు వస్తున్నాయి..? వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు..? గత ఎన్నికలకు ముందు వరకు డాక్టర్ పొంగూరు నారాయణ ఓ విద్యావేత్త... విద్యాసంస్థల అధినేత... చీకూచింతా లేని జీవితం.. రాజకీయాలకు చాలా దూరంగా ఉండేవారు. 2014 సాధారణ ఎన్నికలకు ముందు తెలుగుదేశంపార్టీకి మద్దతు పలికారు. ఆ ఎన్నికలలో నాలుగు జిల్లాలలో కార్పొరేట్ తరహా రాజకీయాలు నడిపి... పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేశారు. నారాయణ పార్టీకి చేసిన సేవలను గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్యాబినెట్‌లో ఆయనకు స్థానం కల్పించారు. మంత్రి పదవి వచ్చిన తర్వాత నారాయణ పూర్తిగా ప్రజాసేవలో మునిగిపోయారు. నెల్లూరు జిల్లాలో అభివృద్ధి పనులపై సీరియస్‌గా దృష్టి పెట్టారు. పేదలకు ఇచ్చే ఇళ్ల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తాగునీటి పథకాలు తెచ్చారు. నెల్లూరు పెన్నా సంగం బ్యారేజీ నిర్మాణాల బాధ్యతను తీసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీగా మార్చడంలో సక్సెస్ అయ్యారు. మునిసిపల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయించి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఎన్ని మంచిపనులు చేస్తున్నా.. సామాన్య కార్యకర్తలను కలుపుకుపోవడంలో మాత్రం కాసింత వెనుకబడే ఉన్నారు. మంత్రి అయిన మొదట్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నలుగురిని పార్టీలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేశారు. అయితే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను మాత్రమే టీడీపీలోకి తీసుకురాగలిగారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ విజయం కోసం ఎంతో శ్రమించారు కానీ అందులో విజయం సాధించలేకపోయారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కాలేజీలో బోధన మెరుగుపర్చడానికి ఆసుపత్రిలో వైద్య విధానంలో మార్పులు తీసుకురావడానికి నారాయణ ప్రయత్నిస్తున్నారు కానీ ఫలితం రావడం లేదు. ఇక విక్రమ సింహపురి యూనివర్సిటీ సంగతి సరేసరి. కాంట్రాక్టు ఉద్యోగుల కంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకే జీతాలు ఎక్కువ ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం అందిరికీ సమానవేతనం ఇవ్వాలని సూచించినా పట్టించుకునే దిక్కులేదు. మౌలిక వసతులూ అంతంత మాత్రమే. చిన్నపాటి సమస్యలను కూడా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అయినా యూనివర్సిటీకి నారాయణ ఒక్కసారంటే ఒక్కసారి కూడా వెళ్లలేదు. జిల్లా విద్యాశాఖ అధికారిగా గతంలో పనిచేసిన మువ్వా రామలింగంపై ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. గతంలో ఆరోపణల మీదే ఇక్కడి నుంచి వెళితే మళ్లీ ఆయననే డీఈవోగా తీసుకొచ్చారు. మరోసారి ఆరోపణలు రుజువుకావడంతో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అయినా ఆయనను బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్‌ను చేయడంపై నారాయణ తీవ్రస్థాయిలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. కలిగిరిలో ఓపెన్ స్కూల్ పరీక్షల్లో పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్ జరిగింది. అందుకు కారకులైన వారిపై ఉన్నతాధికారులు వేటు వేసేందుకు సిద్ధమయ్యారు. మంత్రి నారాయణ వారిని కాపాడారనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఆ విషయం అలా ఉంచితే మునిసిపల్ శాఖ మంత్రి అయి ఉండీ కూడా నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌ను గాడిలో పెట్టలేక పోతున్నారనే విమర్శ వినిపిస్తోంది.. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అస్సలు పడటం లేదని సమాచారం. మరోవైపు అవినీతి పెరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాసమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇలాంటివాటివల్ల నారాయణ చేస్తున్న మంచి పనులను జనం గుర్తించడం లేదు.

ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సన్నాహాలు: రాబోయే ఎన్నికల సమయానికి ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తవుతుంది. అందుకే జిల్లాలోని ఏదో ఒక



నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు నారాయణ. ప్రధానంగా నెల్లూరు సిటీ అయితే బాగుంటుందనేది నారాయణ ఆలోచన అని సమాచారం. ఇప్పటికే ఆయన మనుషులు డివిజన్‌లలో తిరుగుతూ ప్రజా సమస్యలను కంప్యూటర్‌లకు ఎక్కిస్తున్నారు. ఈ మధ్యన నారాయణ సిటీ నియోజకవర్గంలోని ప్రాంతాలలోనే ఎక్కువగా పర్యటిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతున్నారు. మొత్తంమీద నారాయణలో ప్రజలకు సేవ చేయాలనే తపన ఎక్కువగా ఉంది. ఆయనపై ప్రజలలో ఉన్న చిన్నపాటి అపోహలను తొలగించుకోగలిగితే నారాయణకు తిరుగుండదనేది ప్రజల భావన. మరి రానున్న ఎన్నికల నాటికి నారాయణ పూర్తిస్థాయి రాజకీయనాయకుడవుతారా.. ఎన్నికలలో విజయం సాధిస్తారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

పదవులు లేని ఆనం బ్రదర్స్

80 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన నేతలు. ముఖ్యమంత్రి పదవి తప్ప క్యాబినెట్‌లోని అన్ని శాఖలనూ నిర్వర్తించిన ఆ కుటుంబం ఇప్పుడు పదవిలేక కళ తప్పింది. సింహపురిలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతవడంతో ఆనం బ్రదర్స్ అధికార టీడీపీలోకి వచ్చారు. అధికార పార్టీలో ఉంటే తమ జిల్లాను అభివృద్ధి చేసుకోవచ్చని వాళ్లు భావించారు. టీడీపీలోకి వస్తే ఆనం వివేకానందరెడ్డికి ఎమ్మెల్సీ, రామనారాయణరెడ్డికి మంత్రి పదవి ఇస్తామని అప్పట్లో అధిష్ఠానం హామీ ఇచ్చిందని ఆనం అనుచరులు చెబుతుండడం వాళ్ల అభివృద్ధి పథకానికి బలం చేకూర్చింది. తెలుగుదేశం పార్టీలో చేరిన తొలినాళ్లలో ఆనం వివేకానందరెడ్డి ప్రతిపక్ష పార్టీపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. వైసీపీ ఎమ్మెల్యే రోజాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచిన ఆనం మూడు నెలలుగా మౌనంగా ఉన్నారు. దీనికి కారణం ఆయన అనారోగ్యానికి గురికావడమేనని తెలుస్తోంది. వివేకానందరెడ్డి ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారని, అందుకే పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనలేకపోతున్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వివేకాకు ఎలాగో పదవి ఇవ్వలేరు కాబట్టి రామనారాయణరెడ్డికైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే అధిష్ఠానంతో సంప్రదింపులు కూడా జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న రామ నారాయణరెడ్డికి మంత్రి పదవి అప్పగించి, సీనియర్ మంత్రి అయిన ఓ నేతను రాజ్యసభకు పంపిస్తారనే



ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ప్రతిపక్షానికి సమాధానమిచ్చే నేతలేరీ: ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ప్రతిపక్షానికి సరైన కౌంటర్ ఇచ్చే అధికార పక్ష నేతలు ఎవరూ లేరు. పైగా బీజేపీలో కూడా రెండు వర్గాలు ఏర్పడ్డాయి. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్ టీడీపీ కార్యక్రమాలను వ్యతిరేకిస్తున్నారన్న భావం ఆ పార్టీ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డికి, సన్నపరెడ్డికి మధ్య కూడా సఖ్యత లేదని, బీజేపీ-టీడీపీ కలిసికట్టుగా వ్యవహరించడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వైసీపీ నేతలను ధీటుగా ఎదుర్కోలేకపోతున్నారని, అధిష్ఠానం సూచన మేరకో లేక ఇతర కారణలవల్లో బీజేపీ నేతల వ్యాఖ్యలను కూడా పట్టించుకోవడం లేదని టీడీపీ కార్యకర్తలు అంటున్నారు. ఇక మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఎలాంటి వివాదాలు లేకుండా ఎవరినీ పల్లెత్తుమాట కూడా అనకుండా తన పని తాను చేసుకుపోతున్నారని, ఈ నేపథ్యంలో వైసీపీ నేతల విమర్శలను తిప్పికొట్టే నేతలు కరువయ్యారని, ఈ నేపథ్యంలో తమ నాయకుడికి పదవి ఇస్తే ప్రతిపక్షాన్ని బలంగా ఎదుర్కొంటారని ఆనం వర్గం అభిప్రాయపడుతోంది. ఆనం రామనారాయణ రెడ్డికి నెల్లూరు జిల్లాలో బలమైన క్యాడర్ ఉంది. జిల్లాలో అందరినీ కలుపుకుపోయి పార్టీని ముందుకు నడిపించగల శక్తి కూడా రామనారాయణ రెడ్డిలో ఉందని చాలా మంది అభిప్రాయం. ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా ఆ నియోజకవర్గంలో మండల కమిటీల నుంచి బూత్‌లెవెల్ కమిటీల వరకూ క్యాడర్‌ను నిర్మించుకున్నారు. రాత్రికి రాత్రి రాజకీయం మార్చేయగల శక్తి రామనారాయణ రెడ్డికి ఉందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లినవాళ్లను మళ్లీ సొంతగూటికి తీసుకురావాలని ఆనం బ్రదర్‌కు ఉన్నా పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవని వారు అభిప్రాయపడుతున్నారు. తమ నేతకు పదవి ఇస్తే పార్టీ అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అయితే తనకు మంత్రి పదవి ఇవ్వాలని అనుచరులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తుండడంపై రామనారాయణరెడ్డి వారిని వారిస్తున్నారు. మనకు పదవులు కొత్తకాదు కదా అంటూ మంత్రి పదవిపై బయటపడలేకపోతున్నారు. టీడీపీలో చేరే ముందు అధిష్ఠానం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూనే మౌనం పాటిస్తున్నారు. పదవి వచ్చినా రాకపోయినా టీడీపీలోనే ఉందామని తన క్యాడర్‌కు బలమైన సంకేతాలిస్తున్నారు. వైసీపీలో మనిషిని మనిషిగా పలుకరించరని, గౌరవం లేకుండా రాజకీయాల్లో ఉండలేమని ఆనం రామనారాయణరెడ్డి తన అనుచరుల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆనం రామనారాయణరెడ్డి పార్టీపై ఉంచిన నమ్మకాన్ని టీడీపీ అధిష్ఠానం గుర్తించి ఆయనకు మంత్రి పదవి కట్టబెడుతుందో లేదో వేచి చూడాలి.

టీడీపీలో పాతపగలు రెచ్చగొడుతోంది ఎవరు: నెల్లూరు తెలుగుదేశం పార్టీలో పాతపగలు రెచ్చగొడుతోంది ఎవరు? నేతల మధ్య మనస్పర్థలకి కారణాలేంటి ? వివాదాస్పదంగా మారిన కటౌట్ కథేమిటి? క్యాడర్‌లో అసహనం ఎందుకొస్తోంది? ముగ్గురు మంత్రుల గురించి కార్యకర్తలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంపార్టీ అధికారం చేపట్టింది.. ఇప్పటి వరకు అంతా సవ్యంగా సాగుతోంది. అయితే నెల్లూరు జిల్లాలోనే ఆ పరిస్థితి లేకుండా పోతోంది.. జిల్లాలో చాలామంది ముఖ్య నేతలు ఉన్నారు. నేతలే కాదు ఈ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. అయితే గత కొంతకాలంగా టీడీపీకి ఈ జిల్లాలో వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. గత ఎన్నికలలో పది నియోజకవర్గాలలో టీడీపీ కేవలం మూడు స్థానాలను మాత్రమే గెల్చుకోగలిగింది. ఉన్న రెండు ఎంపీ స్థానాలను ప్రత్యర్థి పార్టీ గెల్చుకుంది. అంతకు ముందు జరిగిన కోవూరు, ఉదయగిరి, నెల్లూరు పార్లమెంట్ ఉప ఎన్నికల్లోనూ టీడీపీకి ఆశించిన ఫలితాలు రాలేదు. గ్రౌండ్ లెవల్ నుంచి పైస్థాయి వరకూ క్యాడర్‌ను బలోపేతం చేయడంలో ఎక్కడో ఏదో లోపం జరుగుతుందనే అనిపిస్తోంది. ఇప్పుడూ అంతే. ఎందుకో క్యాడర్ అంత సంతృప్తిగా లేదు. మంత్రి నారాయణ జిల్లా వాసులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు, విద్యావ్యవస్థలో మార్పులు వంటివాటిపై దృష్టి పెట్టారు తప్పితే పార్టీ కార్యకర్తల కష్టనష్టాలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యనే మంత్రి పదవి చేపట్టిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా అంతేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. తన సర్వేపల్లి నియోజకవర్గానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారని కార్యకర్తలు అంటున్నారు.

టీఆర్ఎస్‌లో చేరని వారికి వేధింపులు తప్పడం లేదు

కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : పోలీసులను అడ్డు పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్‌నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి ఆరోపించారు. నల్గొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్ టీఆర్ఎస్‌లో చేరలేదన్న అక్కసుతోనే ఆయన్ని హత్య చేశారని అన్నారు. టీఆర్ఎస్ పార్టీలో చేరని నాయకులను ఎన్నో రకాలుగా వేధిస్తున్నారని ఆయన అన్నారు. అలాగే టీఆర్ఎస్ పార్టీలో చేరలేదనే కక్షతోనే తెలుగు రైతు అధ్యక్షుడు వంటేరు ప్రతాప్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా జిల్లాలోని రామాయంపేటకు చెందిన పలువురు శనివారం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను ఎవరైన ప్రశ్నిస్తే వారిని అన్యాయంగా నిర్భందిస్తున్నారని విమర్శిం చారు. మాదిగ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం శాంతియుత పద్ధతిలో పోరాడు తున్న మందకృష్ణ మాదిగపై అక్రమ కేసులు బనాయించి జైలులో వేశారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రజ్యాతిరేక పాలనపై ప్రతిఒక్కరూ పోరాటా నికి నడుం బిగించాలని కోరారు. పాలకులు తమ పరిపాలనను ప్రజా ఆమో దం మేరకు నడపాలన్నారు. అంతేకానీ, విలాసవంతమైన జీవితం, దోపిడి కోసం చట్టాలను కాలరాసే విధంగా పాలన సాగించవద్దని హితవు పలికారు.

శ్రీనివాస్ హత్యతో టీఆర్ఎస్‌కు సంబంధం లేదు

ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: నల్గొండ మున్సినల్ చైర్మన్ భర్త, కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యతో టీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని శాసనమండలి సభ్యుడు కర్నె ప్రభాకర్ అన్నారు. శనివారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యే కిషోర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఘటన జరిగినా దాన్ని టీఆర్ఎస్‌కు ఆపాదించడం కాంగ్రెస్‌కు అలవాటైందని విమర్శించారు. అలాగే ఈ హత్యకు జిల్లా మంత్రి, ఎమ్మెల్యే వీరేశం బాధ్యత వహించాలనడంలో అర్థం లేదని కొట్టిపారేశారు. నిజాలు నిగ్గు తేల్చేందుకు ఏ విచారణ జరిపినా తమకు అభ్యంతరం లేదని ప్రభాకర్ పేర్కొన్నారు. శ్రీనివాస్ ను హత్య చేసినవారంతా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలంగా ఉన్నారని, ఫోటోలే విచారణకు ప్రామాణికమైతే నిందితులందరూ కోమటిరెడ్డి వెంకటరెడ్డితోనూ ఫోటోలు దిగారని ఆయన అన్నారు. అలాగే ఎమ్మెల్యే వీరేశం కాల్స్ లిస్ట్ బయట పెట్టేందుకు తమకు అభ్యంతరం లేదన్న ఆయన, కోమటిరెడ్డి ఫోన్‌కాల్స్ లిస్ట్ కూడా బయట పెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ హత్యపై న్యాయ విచారణ జరగాలన్న ఆయన, హంతకులకు కఠినంగా శిక్ష పడాలన్నారు. నిందితులు మాంద్ర మల్లేష్, రాంబాబు, శరత్ కాంగ్రెస్ కార్యకర్తలే అని కర్నె ప్రభాకర్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నేతలు బురదజల్లడం సరికాదన్నారు. కాంగ్రెస్ నేతలు తమ నీచబుద్ధిని బయటపెట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు.

దావోస్ నుంచి అమెరికా బయల్దేరిన మంత్రి లోకేష్



అమరావతి, సూర్య బ్యూరో : రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటన ముగించుకుని అమెరికాకు బయలుదేరారు. అమెరికాలో మంత్రి ఇన్వెస్ట్‌మెంట్ రోడ్‌షో నిర్వహించనున్నారు. మొత్తం 9 రోజులపాటు అమెరి కాలో ఆయన పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలు, కంపెనీల అధిపతులతో భేటీలు కానున్నారు. లాస్‌ఏంజిల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో, సియాటెల్, అట్లాంటా, న్యూయార్క్, బోస్టన్ రాష్ట్రాల్లో లోకేష్ పర్యటించనున్నారు.

వచ్చే వానాకాలానికి పెండింగ్ పనులు పూర్తి

- అవసరమైతే ఏజెన్సీని మార్చాలి
- కల్వకుర్తి పై మంత్రి హరీశ్ రావు సమీక్ష



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: కల్వకుర్తి ప్రాజెక్టు కింద పెండింగ్ లో ఉన్న పనులన్నింటినీ వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. శనివారం ఇక్కడ జలసౌధ లో నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న కల్వకుర్తి పనులను మంత్రి సమీక్షించారు.నాగర్ కర్నూల్ శాసన సభ్యుడు మర్రి జనార్ధన రెడ్డి ఇటీవల జరిపిన జలవిజయ యాత్ర సందర్భంగా వచ్చిన విజ్ఞప్తులను మంత్రి పరిశీలించారు. దాదాపు 60 కి పైగా వచ్చిన వివిధ విజ్ఞప్తులపై వెంటనే స్పందించి వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు కోరారు. తెల్కపల్లి మండలం లక్నారమ్ గ్రామం నుంచి ఏం.ఎల్.ఏ పాదయాత్ర జరిపారు.నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నాగర్ కర్నూల్, బిజినేపల్లి, తిమ్మాజిపేట, తాడూరు,తెల్కపల్లి మండలాల్లో కల్వకుర్తి ప్యాకేజీ 29, 30 ల పనుల పురోగతి మంత్రి సమీక్షించారు. 2016-2017 లో మొత్తం కల్వకుర్తి కింద 280 చెరువులు నింపగా, ఈ ఏడాది 350 చెరువులు నింపినట్టు అధికారులు మంత్రికి తెలిపారు. ఇందులో నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో 120 చెరువులు నింపినట్టు వారు చెప్పారు.కల్వకుర్తి కింద మొత్తం ఆయకట్టు 4.25 లక్షల ఎకరాలు కాగా గత ఏడాది 1.25 లక్షల ఏకరాలకు సాగు నీరు అందించామని, ఈ ఏడాది యాసంగి లో 2 లక్షల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేసినట్టు ఇరిగేషన్ అధికారులు చెప్పారు.29,30 ప్యాకేజీ లలో మిగిలిపోయిన డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ పనులు వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. ఒప్పందం ప్రకారం గడువులోపు ఈ పనులు చేయని పక్షంలో నిబంధనల ప్రకారం సమబంధిత ఏజన్సీ ని తొలగించి వేరే ఏజన్సీ తో పనులు చేయించాలని ఆయన ఆదేశించారు. వెంటనే ఏజన్సీ ని పిలిపించి మాట్లాడాలని కోరారు. కల్వకుర్తి మెయిన్ కెనాల్ సహా డిస్ట్రి బ్యూటరీల కింద మిగిలిన పనులన్నింటినీ ఖరీఫ్ కల్లా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మహబూబ్ నగర్ సి.ఈ. ఖగేందర్ రావు, ఎస్.ఈ.భద్రయ్య,జడ్.పి.టి.సి,ఎం.పి.టి.సి.లు, సర్పంచులు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం

వైసీపీ నేత జోగి రమేష్

విజయవాడ, మేజర్‌న్యూస్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు వింటుంటే సూర్యుడిని ఎప్పుడూ చూడనట్లు దావోస్‌లో సూర్యుడిని కనుగొని వచ్చి ఇక్కడ జనానికి చెబుతున్నట్లు ఉందని వైసీపీ అధికార ప్రతినిధి జోగి రమేష్ ఎద్దేవా చేశారు. ఆయన శనివారమిక్కడ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ "సీఎం చంద్రబాబు దావోస్ వెళ్లి వచ్చి సూర్యుడు ప్రాధాన్యతలు చెబుతున్నారు. అనాదిగా సూర్య నమస్కారం చేయడం మన సాంప్రదాయం. అది మన సనాతన ధర్మం. అలాంటిది చంద్రబాబు దావోస్ వెళ్లివచ్చి, ప్రతి ఒక్కరూ సూర్య ఆరాధన చేయాలని కొత్తగా చెప్పడం హాస్యాస్పదం. చంద్రబాబు వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనకు మానసిక స్థితి లోపించిందా లేక మైండ్ దావోస్‌లో ఏమైనా వదిలి వచ్చారా అనే అనుమానం కలుగుతోంది. దావోస్ మోజులో పడి గణతంత్ర వేడుకలకు కూడా హాజరు కాలేదు. ఈ దేశంలో గణతంత్ర వేడుకలకు హాజరు కానీ ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారా. దావోస్ పర్యటన సందర్భంగా ఎన్ని పెట్టుబడులు వచ్చాయి చంద్రబాబు. లోకేశ్ దావోస్ నుంచి అమెరికా ఎందుకు వెళ్లాడు. దావోస్‌లో వచ్చిన సూట్‌కేసులు దాచుకోడానికా. తల్లికి వందనం అని చెబుతున్న చంద్రబాబు, మరి తల్లిదండ్రులు లాంటి ఎన్టీఆర్, లక్ష్మీపార్వతికి చేసిన ద్రోహం అందరికీ తెలుసు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి మానసికంగా హింసించి చంపిన వైనం చరిత్రలో ఎవరూ మరచిపోరు. జలహారతి అంటున్న చంద్రబాబు గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో 22మందిని, పర్మిట్లు లేని బోట్లను తప్పి ఇబ్రహీంపట్నంలో మరో 20మందిని పొట్టన పెట్టుకున్నావు. ఇక చంద్రబాబు వ్యవసాయమే దండగ అంటే మంత్రి దేవినేని ఉమ మరో అడుగు ముందుకు వేసి వరి పండించే రైతుల్ని సోమరిపోతులంటున్నారు. దేవినేని చినప్పటి నుంచి ఏంతిని పెరిగాడు. రైతులను ఇష్టమెచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోం." అని హెచ్చరించారు

సాగునీటి పథకాలకు అంతర్జాతీయ ప్రశంసలు

- ఇరిగేషన్ ప్రగతిపై దిగ్భ్రాంతి
- 19 దేశాలకు చెందిన ప్రతినిధులకు జోషి ప్రజంటేషన్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలంగాణలో చేపడుతున్న మిషన్ కాకతీయ ,కాళేశ్వరం వంటి తదితర భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి అంతర్జాతీయంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నీటిపారుదల రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు,చేపట్టిన పథకాలపై ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎస్.కే. జోషి శనివారం ఇక్కడ జలసౌధలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో 19 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం నాలుగు వారాల పర్యటనకు వారు హైదరాబాద్ చేరుకు న్నారు. ఇందులో భాగంగా ఇరిగేషన్ రంగంలో ప్రగతిని తెలుసుకునేందుకు అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియా విదేశీ ప్రతినిధుల పర్యటనను సమన్వయపరుస్తున్నది. సాగునీటిపారుదల పథకాలపై ప్రభుత్వం ఇచ్చిన ప్రజంటేషన్ పట్ల విదేశీ ప్రతినిధులంతా నివ్వెరపోయారు.కొత్తగా మూడున్నర సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం ఇరిగేషన్ రంగంలో సాధించిన ప్రగతి పై ప్రభుత్వస్పెషల్ సి.ఎస్. సోదాహరణంగా వివరించారు.తెలంగాణ ఏర్పడకముందు దాదాపు 80,000 చిన్న నీటి పారుదల వనరులు ఉండగా అర్బనైజేషన్, తదితర కారణాల వల్ల అందులో సగం కనుమరుగయ్యాయని జోషి చెప్పారు.గొలుసు కట్టు చెరువులతో పాటు మొత్తం చిన్న నీటి వనరులను పరిరక్షించేందుకు,వాటిని పునరుద్ధరణకు, పునర్నిర్మించడానికిగాను చేపట్టిన 'మిషన్ కాకతీయ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని అన్నారు. 46,000 చెరువులను దశలవారీగా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.మిషన్ కాకతీయ కార్యక్రమం అమలుతో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని, తెలంగాణ గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితి గతులలో అనూహ్య మైన మార్పులు వస్తున్నాయని జోషి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న



చెరువును నిండుకుండగా మార్చేందుకు చేప్టిన ఓ బ్రహ్మయజ్ఞం అని ఆయన అన్నారు. ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు ఈ స్కీం విజయవంతానికి ప్రతి వారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్నారని, నిరంతరం పర్యవేక్షిస్తున్న కారణంగా సానుకూల ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చెరువు మీద ఆధారపడి వ్యవసాయం చేసే రైతు తో పాటు, ఆ చెరువును నమ్ముకున్న రైతు, బెస్త, ముదిరాజ్ కులస్తులకు జీవన బృతి దొర్కుతున్నదని జోషి వివరించారు. తెలంగాణలో జలవనరులు, నీటి లభ్యత పెంచడమే మిషన్ కాకతీయ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ స్పెషల్ సి.ఎస్. తెలియజేశారు. దేశంలోనే అత్యధిక చెరువులున్న రాష్ట్రంగా తెలంగాణకు చరిత్ర ఉందని చెప్పారు. ఏడాదికి 25 శాతం చెరువుల చొప్పున మిషన్‌కాకతీయ కింద అభివృద్ధిపరుస్తూ, నాలుగేళ్లో మొత్తం చెరువులను పూర్వవైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అంతర్జాతీయ సమాజం కూడా మిషన్‌కాకతీయ పథకాన్ని గ్రేట్ అంటూ అధ్యయనాలు చేస్తోందని, మిచిగాన్ యూనివర్శిటీ విద్యార్థులు కొందరు రీసెర్చ్ కూడా చేశారని జోషి వివరించారు.కాళేశ్వరం ప్రాజెక్టు గురించి విదేశీ ప్రతినిధులకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వివరించినప్పుడు ఆయా ప్రతినిధులు విస్తుబోయారు. రూ 80వేల కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మేడిగడ్డ, సుందిళ్ళ, అన్నారం దగ్గర మూడు చోట్ల నిర్మిస్తున్న భారీ బ్యారేజీలు, మూడు పంపు హౌజ్‌లు, పొడవైన సొరంగాలు,భూగర్భంలో అబ్బురపరిచే సర్జ్ పూల్స్ గురించి జోషి వివరించారు.90 రోజుల పాటు రోజుకు 2 టీఎంసీల ఎత్తిపోయడానికి ఈ భారీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. 18.26 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకు రావడం,మరో 18. 82 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యమని అన్నారు. మొత్తంగా 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు.తాగునీటి అవసరాలకు 36, పారిశ్రామిక అవసరాలకు 10 టీఎంసీల నీరు వాడుతున్నట్టు తెలిపారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా మార్చేందుకు దీర్ఘకాలిక వ్యూహంతో ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టారని విదేశీ ప్రతినిధులకు వివరించారు.కాళేశ్వరం ప్రాజెక్టు లో వాడుతున్న అత్యాధునిక సాంకేతిక విధానాలు, ప్రయోగాలను తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి దాని ప్రయోజనాల గురించి కూడా జోషి వివరించారు.దక్షిణాఫ్రికా ,ఇథియోపియా, శ్రీ లంక తదితర దేశాల ప్రతినిధులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టుకు ఆర్థిక వనరులు సమకూర్చుకున్న విధానాలు,ఇలాంటి ప్రాజెక్టు వల్ల విశాల ప్రాతిపదికన రైతులు,ఇతర రంగాల వారికి ఒనగూరుతున్న ప్రయోజనాలు,వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసే తీరు వంటి అంశాలపై ప్రభుత్వ సి.ఎస్.ను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న కారణంగా వార్షిక బడ్జెట్ లో 2 5 శాతాన్ని ఈ రంగానికే కేటాయిస్తున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ స్పెషల్ సి.ఎస్.తో పాటు కాడా కమిషనర్ డాక్టర్ మల్సూర్,మైనర్ ఇరిగేషన్ సి.ఇ.లు సురేష్, శ్యాం సుందర్ ,ఆస్కీ ' ప్రోగ్రాం డైరెక్టర్లు డాక్టర్ పి.సుభాషిణి, రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో వెయ్యి విజయ డెయిరీ ఔట్‌లెట్లు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో మరో వెయ్యి విజయ డెయిరీ అవుట్ లెట్లు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గొర్రెల పంపిణీ పెద్ద కార్యక్రమం అని, దీనివల్ల ఏర్పడ్డ లోపాలను సరిదిద్దుతున్నామన్నారు. అలాగే అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా స్వేచ్ఛ ఉంది కదా అని ఇష్టమొచ్చినట్టు తిడితే ఎవరూ సహించరని, దూషిస్తే కేసులు పెట్టే చట్టం అందరికీ వర్తిస్తుందన్నారు.

జగన్ అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలి



అమరావతి, సూర్య బ్యూరో : విపక్ష నేత జగన్ అబద్దాలు ఆడడం మానుకోవాలని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ చూసే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అలాగే రాష్ట్రానికి కంపెనీలు ఎన్ని వచ్చాయో చర్చించేందుకు సిద్ధమన్నారు. హైదరాబాద్‌కు ఎన్నో కంపెనీలు తెచ్చిన చరిత్ర చంద్రబాబుది అని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.

'బీజేపీతో పొత్తు వద్దనుకొంటే మా అధ్యక్షుడితో చెప్పండి'

విజయవాడ, మేజర్‌న్యూస్: తమ పార్టీతో టీడీపీకి ఉండాలనే ఉద్దేశం లేకుంటా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుతో మాట్లాడాలని బీజేపీ సీనియర్ నాయకురాలు పురందేశ్వరీ పేర్కొన్నారు. పొత్తుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మాజీమంత్రి, బీజేపీ నేత పురందేశ్వరి స్పందించారు. బీజేపీ మిత్రధర్మం పాటించడం లేదని చంద్రబాబు అనడం సమంజసం కాదని అన్నారు. తమతో కలిసి ఉంటారో, ఉండరో టీడీపీనే తేల్చుకోవాలని ఆమె శనివారమిక్కడ అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను బీజేపీ అధిష్టానం చూసుకుంటుందని పురందేశ్వరి అన్నారు.

'రాష్ట్రంలో రాక్షస పాలన'

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో రాక్షస పానల కొనసాగుతుం దని టీ-పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. శనివారం గాంధీ భవన్‌లో సిద్దిపేటకు చెందిన జాక్ నాయకులు సింబుల భూపతి రెడ్డితోపాటు, ఖమ్మం జిల్లాలోని వివిద పార్టీల నాయకులు మాజీ కేంద్ర మంత్రి బలరామ్ నాయక్ ఆధ్వర్యంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా కార్యకర్తల నుద్దేశించి ఉత్తమ్ మాట్లాడుతూ కేసిఆర్ అన్ని వర్గాలను మోసం చేశార న్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చిన ఆయన ఇప్పుడు ఏ ఒక్క వర్గాన్ని న్యాయం చేయడం లేదని విమర్శించారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కేసిఆర్ తెలంగాణలోని అన్ని వర్గాలను మోసగించడమేకాకుండా, పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ విలాసాలు చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో దళితులకు, గిరిజనులకు, రైతులకు, బడుగు, బలహీన వర్గాలకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందన్న ఉత్తమ్, నేరేళ్ళలో దళితులు, బిసీలు ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే వారిని పోలీసులు చేత చిత్ర హింసలకు గురి చేసి కేసులు పెట్టి జైళ్ళో పెట్టారన్నారు.

నిజాయతీతో కూడిన సమాజమే లక్ష్యం

ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నెల్లూరు, సూర్య బ్యూరో : నెల్లూరు మూలాపేటలోని బట్వాడిపాళెంలో నూతనంగా నిర్మించిన ఏసీబీ కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రివర్యులు వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఎన్.అమర్నాథ్ రెడ్డి, పొంగూరు నారాయణ, ఏసీబీ డీజీ ఆర్పీ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఠాకూర్ అవినీతిపరుల పాలిట సింహస్వప్నంలా నిలుస్తున్నారన్న మంత్రి సోమిరెడ్డి గారు ఠాగూర్ సినిమాలో అవినీతిపై పోరాటం చేస్తూ చిరంజీవి నటిస్తే ఠాకూర్ నిజజీవితంలో జీవిస్తున్నారని కొనియాడారు. అధికార, రాజకీయ అవినీతి తగ్గిపోయి నిజాయతీతో కూడిన సమాజం ఏర్పడటమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా మన ఏసీబీ పనిచేస్తోందన్నారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం మహ్మదాపురంలో దొడ్ల కుటుంబీకులు పునర్నిర్మించిన దొడ్ల శేషారెడ్డి మెమోరియల్ జెడ్పీ హైస్కూలు భవనాన్ని రాష్ట్ర మంత్రి ఎన్.అమర్నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బీద రవిచంద్ర, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ వారి భవితను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధికి దొడ్ల కుటుంబం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

అనంతలో జనసేనాని ప్రజావేదిక పేరుతో చర్చాగోష్ఠి





అనంతపురం, మేజర్‌న్యూస్: జనసేన ఆధ్వర్యంలో అనంతపురంలో ప్రజావేదిక పేరుతో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ చర్చాగోష్టిలో రైతులు, వ్యవసాయ, నీటిపారుదల శాఖ నిఫుణులు పాల్గొన్నారు. రైతులు తమ భాదలను పవన్‌కు వివరించారు. రైతులు చెప్పిన ప్రతి సమస్యను జనసేనాని నోట్ చేసుకున్నారు. కరువు పరిష్కారాలపై సమాలోచనలు చేస్తామన్నారు. కరువు నివారణకు పోరాడుతామని పవన్ తెలపారు.

వైఎస్ జగన్ పాదయాత్రలో అపశ్రుతి



నెల్లూరు, మేజర్‌న్యూస్: విపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న పాదయాత్రలో శనివారం అపశృతి చోటుచేసుకుంది. పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన రంగారెడ్డి అనే వైసీపీ కార్యకర్త గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు అనంతపురం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం జగన్ పాదయాత్ర నెల్లూరు జిల్లా సూళ్ళూరుపేటలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం కావాలి

- యాసంగి ప్రోత్సాహకరంగా ఉంది
- సాధారణ విస్తీర్ణాన్ని దాటిన సాగు
- వాస్తవ సాగు విస్తీర్ణాన్ని సేకరించాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రానున్నా ఖరీఫ్‌సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని క్షేత్ర స్థాయిలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. వ్యవసాయ ఉత్పాదకాల విషయంలో తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆయన కోరారు. శనివారం వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో వ్యవసాయ కమిషనర్ డా. ఎం. జగన్ మోహన్, అధ్యక్షతన జిల్లా వ్యవసాయ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. 2017-18 యాసంగి కూడా చాలా ప్రోత్సాహకరంగా ఉందని ప్రాజెక్టుల కింద నీళ్ళ సదుపాయం ఉన్నచోటల్లా సెంటు భూమి వృథా పోకుండా రైతులు సాగు చేపట్టాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో సాధారణ విస్తీర్ణాన్ని ఈ సారి దాటిపోయిందన్న ఆయన, నిజామాబాద్, కామారెడ్డి లను ఉదాహరణగా వివరించారు. గత సారి వానాకాలం కన్నా యాసంగిలోనే సాగు ఎక్కువైందని మంత్రి అన్నారు. వాస్తవ విస్తీర్ణాన్ని సేకరించాలని వ్యవసాయ కార్యదర్శిని, కమిషనర్ ను మంత్రి కోరారు. పత్తి, కంది, మిరప, పసుపు పంటలు కొనసాగుతున్న చోట కాకుండా, మిగతా చోటల్లా యాసంగిలో పంటలు వేశారని చెప్పారు. మార్చి 11 న రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వబోతున్నామన్న ఆయన, అప్పటికల్లా రైతుకున్న మొత్తం విస్తీర్ణంలో సాగుకు యోగ్యం కాని భూమి వివరాలు పక్కాగా సేకరించాలని అన్నారు. సాగుకు యోగ్యమైన భూమికే పంటకు పెట్టుబడి అందిస్తామని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు ఈ అంశాన్ని దృష్టిలో పెట్టాలని మంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి మొదటి వారంలోభర్తీ చేయనున్న 851 ఎ.ఇ.ఓ. పోస్టులతో కలువుకొని మొత్తం 2638 ఎ.ఇ.ఓ. లతో జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి తగిన దిశానిర్దేశం చేస్తామని అన్నారు. రైతు సమన్వయ సమితులతో కూడా సమావేశాలు నిర్వహించి తగిన దిశానిర్దేశం చేయడానికి స్వయంగా ముఖ్యమంత్రి పాల్గొంటారని అన్నారు. పచ్చిరొట్ట వేసుకునేలా రైతును ప్రోత్సహించాలని దీనివల్ల పురుగు మందుల వాడకం తగ్గుతుందని తద్వారా రైతాంగ ఆరోగ్యంతో పాటు అందరి ఆరోగ్యాలు బాగుపడతాయని అన్నారు. యాసంగి పంట అయిన వెంటనే పచ్చిరొట్ట పైరుకు కావలసిన విత్తనాల అంచనా చెప్పాలని కోరారు. నిధుల సహకారంతో ఎక్కడికక్కడ గ్రామాలలో భూగర్భ జలాలు పెంపొందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరంపరాగత్ కృషి వికాస యోజన ఉద్దేశ్యం రైతులను సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్ళించడమే. గాలి, నీరు, ఆహారం బాగుంటేనే ఆరోగ్యం సాధ్యమౌతుందన్నారు. ఫసల్ బీమా యోజన గడువు తేదీల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణపై మాట్లాడుతూ కేజ్ వీల్స్ వలన రోడ్లు పాడౌతున్నాయని, వాటికి బదులు రోటవేటర్స్ ప్రోత్సహించమని సూచించారు. యాసంగి పంటలు మార్చిలో కోతకొస్తాయని ఆలోపు పంటకోత యంత్రాలను అందజేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 17న ఒకే రోజు ఖమ్మం, కొత్తగూడెంలలో 1000 ట్రాక్టర్ల పంపిణీ చేయబోతున్నట్లు తెలిపారు. అదే తరహాలో మిగతా జిల్లాల్లోను ట్రాక్టర్ మేళాలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయం, సాగునీరు ఈ రెండు అంశాలపైననే ముఖ్యమంత్రి దృష్టి సారించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వ్యవసాయ శాఖ మరింత కృషి చేయాలని, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారథి పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను హత్య చేయించింది ఎమ్మెల్యే వీరశమే

హైదరాబాద్, మేజర్‌న్యూస్: టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే వీరేశం గ్యాంగ్‌స్టర్ నయీంకంటే ప్రమాదకరమైన వ్యక్తి అని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) ఉపనేత కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తన ప్రధాన అనుచరుడు శ్రీనివాస్ ను హత్య చేయించింది ముమ్మాటికి ఎమ్మెల్యే వీరేశమేనన్న కోమటిరెడ్డి, ఆయన కాల్ డేటా, ఆయన కిరాయి హంతకుల కాల్ డేటా చూస్తే ఆ విషయం తెలిసిపోతుందని చెప్పారు. హంతకులు హత్య చేసి నేరుగా నకిరేకల్ వెళ్లి ఆగినట్లు స్వయంగా డీజీపీ కూడా చెప్పారని, వీరేశం చెబితేనే తాము హత్య చేసినట్లు నిందితులు కూడా ఇప్పటికే డీజీపీ వద్ద ఒప్పుకున్నారని, ఆ వార్తలు రేపు విన్న తరువాత ప్రజలంతా షాక్‌కు గురవుతారని కోమటిరెడ్డి చెప్పారు. వీరేశం అనే వ్యక్తిని ఎమ్మెల్యే అనడానికి తనకు సిగ్గుగా ఉందన్న కోమటి రెడ్డి, సినీ ఫక్కీలో శ్రీనివాస్‌ను హత్య చేయించారని చెప్పారు. ఒక మున్సిపల్ చైర్మన్ భర్తను చంపడం మాములు విషయం కాదని, కోట్లు ఖర్చు చేసి శ్రీనివాస్‌ను హత్య చేయించారని ఆరోపించారు. గత మూడేళ్ల నుంచే శ్రీనివాస్ హత్య కుట్రకు పథకరచన చేశారని చెప్పారు. శ్రీనివాస్‌కు ప్రాణపాయం ఉందని గతంలోనే భార్యభర్తలను అసెంబ్లీలో ముఖ్యమంత్రి చాంబర్‌కు తీసుకెళ్లి కాళ్లు పట్టుకున్నంత పనిచేసినా ఆయన కనికరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో పార్టీ మారాలని శ్రీనివాస్‌పై అధికారపార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారన్నారు. శ్రీనివాస్ తనకు కుటుంబ సభ్యుడిలాంటివాడని, 25 ఏళ్లుగా తనతోనే ఉన్నారని కోమటిరెడ్డి చెప్పారు. 'వీరేశం అనే వాడు బడా నయీమన్న కోమటి రెడ్డి, ఆ నయీంను ఎన్‌కౌంటర్ చేసినప్పుడు వీరేశంను ఎందుకు ఎన్ కౌంటర్ చేయరని ప్రశ్నించారు.

సంపాదకీయం

editpage@suryaa.com

“నూతన పన్ను వ్యవస్థకు దేశం పరివర్తన చెందడంలో ఆదిలో ఎదురైన సమస్యలు క్రమంగా పరిష్కారం అవుతున్నాయనే సంకేతాన్ని ఇది ఇస్తోంది. కొత్త పన్ను వ్యవస్థలో మరింత స్థిరత్వానికి ఇది దారి తీస్తోంది. ఈ వృద్ధి క్రమం కొనసాగినట్లయితే మధ్య కాలికంగా జిఎస్‌టి నుంచి లాభాలు దక్కుతాయని భావించవచ్చు. పేర్లు నమోదు చేసుకున్న కోటి మందికి పైగా పన్ను చెల్లింపుదారులలో సగం మందికి పైగా – 56.30 లక్షల మంది డిసెం బర్‌లో రిటర్న్‌లు దాఖలు చేశారు. పేర్లు నమోదు చేసుకున్న డీలర్లు అయితే ప్రతి నెల స్వయం ప్రకటిత పత్రం దాఖలు చేయవలసిన అవసరం ఉన్నది. తమకు వచ్చిన, తాము పంపిన సప్లయిల వివరాలను వారు అందులో పొందుపరచలసి ఉంటుంది. సమ్మిశ్రిత పథకానికి సుముఖత చూపిన మరి 17 లక్షల మంది డీలర్లు త్రైమాసిక రిటర్న్‌లు దాఖలు చేయవలసి ఉంటుంది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించిన రిటర్న్‌లను వారు దాఖలు చేయడానికి గడువు డిసెంబర్‌లో ముగిసింది. దీనితో నామమాత్రపు పన్ను రేటు కారణంగా వసూళ్లు పెరిగాయి. అది స్వల్ప మాత్రమేనన్నది వేరే విష యం. ఈ పథకం కింద వసూళ్లు జనవరిలో పెరిగే అవకాశం ఉన్నది. పర్యాటక రంగం ద్వారా ఇప్పటికే 4 కోట్ల మంది ఉపాధి పొందుతుండగా రానున్న దశాబ్దంలో అదనంగా కోటి ఉద్యోగాల సృష్టికి అవకాశం ఉంది. చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి అందాలు, అపార చారిత్రక సంపద, విభిన్న సంప్రదాయాలకు నెలవైన భారత్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందని గుర్తించిన మోడీ ప్రభుత్వం ఆ దిశగా విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నది.”

జిఎస్‌టి మరింత మెరుగు కావాలి

దేశమంతటా ఒకే పన్ను విధానం ఉండడం కోసం ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)పై ఇటీవల ఒక శుభ వార్త వినిపించింది. డిసెంబర్‌లో జిఎస్‌టి రెవెన్యూలు పెరిగాయన్నది ఆ శుభ వార్త. అంతకు ముందు రెండు నెలలలో జిఎస్‌టి వసూళ్లు తగ్గాయి. నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు 7.3 శాతం మేర పెరిగాయి. డిసెంబర్ నెలలో జిఎస్‌టి కింద రూ. 86703 కోట్లు వసూలయ్యాయి. నూతన పన్ను వ్యవస్థకు దేశం పరివర్తన చెందడంలో ఆదిలో ఎదురైన సమస్యలు క్రమంగా పరిష్కారం అవుతున్నాయనే సంకేతాన్ని ఇది ఇస్తోంది. కొత్త పన్ను వ్యవస్థలో మరింత స్థిరత్వానికి ఇది దారి తీస్తోంది. ఈ వృద్ధి క్రమం కొనసాగినట్లయితే మధ్య కాలికంగా జిఎస్‌టి నుంచి లాభాలు దక్కుతాయని భావించవచ్చు. పేర్లు నమోదు చేసుకున్న కోటి మందికి పైగా పన్ను చెల్లింపుదారులలో సగం మందికి పైగా – 56.30 లక్షల మంది డిసెం బర్‌లో రిటర్న్‌లు దాఖలు చేశారు. పేర్లు నమోదు చేసుకున్న డీలర్లు అయితే ప్రతి నెల స్వయం ప్రకటిత పత్రం దాఖలు చేయవలసిన అవసరం ఉన్నది. తమకు వచ్చిన, తాము పంపిన సప్లయిల వివరాలను వారు అందులో పొందుపరచలసి ఉంటుంది. సమ్మిశ్రిత పథకానికి సుముఖత చూపిన మరి 17 లక్షల మంది డీలర్లు త్రైమాసిక రిటర్న్‌లు దాఖలు చేయవలసి ఉంటుంది. జూలై–సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించిన రిటర్న్‌లను వారు దాఖలు చేయడానికి గడువు డిసెంబర్‌లో ముగిసింది. దీనితో నామమాత్రపు పన్ను రేటు కారణంగా వసూళ్లు పెరిగాయి. అది స్వల్ప మాత్రమేనన్నది వేరే విష యం. ఈ పథకం కింద వసూళ్లు జనవరిలో పెరిగే అవకాశం ఉన్నది. అక్టోబర్– డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన రిటర్న్‌లను జనవరిలో దాఖలు చేయవలసి ఉండడం ఇందుకు కారణం. అయితే, జనవరి 18న జరి పిన సమావేశంలో జిఎస్‌టి మండలి 80 పైచిలుకు సరకులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించిన విషయం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం.రేట్ల తగ్గింపు ప్రభావం రెవెన్యూ వసూళ్లపై పడుతుందని ప్రభుత్వం భావించడం లేదు. కాని ఆ తగ్గింపు పూర్తి ప్రభావం జనవరి గణాంకాలలో కనిపిస్తుంది. అయితే, తక్కువ రేట్ల వల్ల పన్ను చెల్లింపులో మరింత నిబద్ధతకు, తద్వారా రెవెన్యూ వసూళ్లపెరుగుదలకు కూడా దారి తీస్తుంది. కాగా, జిఎస్ టి మండలి రియల్ ఎస్టేట్ రంగాన్ని వెంటనే జిఎస్‌టి వ్యవస్థ పరిధిలోకి తీసుకు రావాలి. దీని వల్ల అనేక విధాలుగా ఆడిట్ జరిగి ఈ రంగంలో పాతుకు పోయిన పన్ను ఎగవేత దురలవాటును అరికట్టడానికి వీలు కలుగుతుంది. మరొక వైపు పెట్రోలియం రంగాన్ని జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ పెరుగుతోంది. దీని వల్ల ఈ రంగానికి కావలసిన ఇన్‌పుట్ పన్ను పరపతి సదుపాయం లభించి, ఖర్చులు తగ్గడానికి వీలు కల్పిస్తుంది. ఇప్పటి వరకు ఆదాయం కోసం పన్ను విధించని విభాగాల నుంచి ఆదాయం రాబట్టడానికి జిఎస్‌టి పరిధిలో భాగంగా జరిగే బహుళ ఆడిట్‌ల వల్ల ప్రభుత్వానికి వీలవుతుంది. అదే సమయంలో ప్రభుత్వం మరొక జాగ్రత్త తీసుకోవలసి ఉం టుంది. ఇ–వే బిల్లు ఇన్‌స్పెక్టర్ రాజ్‌కు దారి తీయకుండా ప్రభుత్వం చూడాలి. రిటర్న్‌ల దాఖలు, ఇన్‌వాయిస్ సరిపోలే ప్రక్రియను సరళం చేయాలి. భారీ కొనుగోలుదారులు అందరి నుంచి పన్ను వసూలుకు మరింత మంది అధి కారులను నియోగించడం వల్ల పరిస్థితులు సులభతరం అవుతాయి. ఆ కొను గోలుదారులు జరిపే ఇన్‌పుట్ కొనుగోళ్లపై ఆ అధికారులు పన్ను వసూలు చేయడానికి దీని వల్ల వీలు కలుగుతుంది. అంతే కాదు. చిన్న సప్లయిర్ల బాధ్య త రిటర్న్‌ల దాఖలుకు పరిమితం అవుతుంది. పకడ్బందీగా జిఎస్‌టి అమలు కావడానికి మరింత వ్యవధి పట్టే అవకాశం ఉన్నది. కాగా, జిఎస్‌టి విధానం విజయవంతంగా అమలు అవుతుం డడం పట్ల ప్రభు త్వం హర్షం వ్యక్తం చేసింది. జిఎస్‌టి విజయవంత మైందని దాని పరి ధిని మరింత విస్తృతం చేసేందుకు అవకాశం కల్పించినట్లయిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు.అంతే కాదు. భవిష్యత్‌లో పన్ను రేట్లను హేతుబద్ధం చేసేందుకు ఇది సూచకంగా ఉందని జైట్లీ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన సందర్భంలో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని పరోక్ష పన్ను వ్యవస్థలో జిఎస్‌టి చాలా మార్పులు తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో జిఎస్‌టి వ్యవస్థ చాలా కొద్ది కాలంలోనే స్థిరపడిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిఎస్‌టి కింద నాలుగు శ్లాబుల ప్రకారం పన్నులు విధిస్తున్నారు. 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం పన్నులను విధిస్తున్నారు. వినియోగదారుడిపై పడుతున్న పన్ను భారాన్ని తగ్గించేందుకు జిఎస్‌టి మండలి ఎప్పటికప్పుడు సమావేశమై పన్ను విధానాలను సవరిస్తూ వస్తోంది. నవంబర్‌లో సమావేశమైన జిఎస్‌టి మండలి 28 శాతం పన్ను కింద ఉన్న 178 వస్తువులను ఆ శ్లాబు నుంచి తొలగించి తక్కువ పన్ను శ్లాబులోకి మార్చిన విషయాన్ని జైట్లీ గుర్తు చేశారు. స్టార్ హోటళ్లు కాని అన్ని రెస్టారెంట్‌లపై పన్ను 5 శాతానికి తగ్గించిన సంగతి కూడా విదితమే. రెండు నెలల క్షీణత నుంచి కోలుకుని డిసెంబర్ నెలలో జిఎస్‌టి వసూళ్లు పెరగడంపై జైట్లీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా, జిఎస్‌టి భారం తగ్గించాలని సేవా రంగంలోని వేర్వేరు పరిశ్రమలు డిమాండ్ చేస్తున్నాయి. ఆ పరిశ్రమల వారు రానున్న సార్వత్రిక బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశను రానున్న సార్వత్రిక బడ్జెట్ నెరవేరుస్తుందా? పర్యాటకం, రవాణా, టెలికమ్, టెక్ రంగాలకు ఊతమిచ్చేలా కేంద్రం కీలక నిర్ణయాలు ప్రకటిస్తుందా? దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో సేవా రంగానిదే సింహభాగం. జిడిపిలో దాదాపు 54 శాతం వాటా కలిపి దేశంలోకి పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సేవా రంగం ఆకర్షిస్తోంది. ఇలా దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్న సేవా రంగ పరిశ్రమలో పర్యాటక రంగం ప్రధానమైనది. పర్యాటక రంగం ద్వారా ఇప్పటికే 4 కోట్ల మంది ఉపాధి పొందుతుండగా రానున్న దశాబ్దంలో అదనంగా కోటి ఉద్యోగాల సృష్టికి అవకాశం ఉంది. చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి అందాలు, అపార చారిత్రక సంపద, విభిన్న సంప్రదాయాలకు నెలవైన భారత్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందని గుర్తించిన మోడీ ప్రభుత్వం ఆ దిశగా విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నది.

దేశం పురోగతి మనువాదం వైపా?



ముహమ్మద్ ముజాహిద్

- మైనారిటీ, దళితులపై పెరుగుతున్న దాడులు
- దక్షిణాది రాష్ట్రాలకూ పాకుతున్న విష సంస్కృతి
- నోట్ల రద్దుతో జీవితాలు కోల్పోయిన అభాగ్యులు
- కేంద్రంలో కీలక పదవులన్నీ ఓ వర్గానికే పరిమితం
- కాషాయికరణతో దేశవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి



ముస్లిం, దళితులపై దాడులతో దేశం వణికిపోతోంది. చనిపోయిన పశువు చర్మం ఒలిచినందుకు దళితులపై జరిగిన దాడులు, ముస్లిములపై ఆవు పేరుతో దాడులు, లవ్ జిహాద్ పేరుతో కర్కశంగా ఒక ముస్లిమ్ కూలీవాడిని అత్యంత పాశవికంగా చంపిన వీడియో చూసి ఈ భూమిలో అంతర్భగమైనా దళిత, ముస్లిం వర్గాలు నేటికీ ఎన్నో నిద్రలేని రాతలు గడుపుతున్నాయి. ఈ దేశంలో మెజార్టీ సంఖ్యలో కాకపోయినా అక్కడక్కడా, అప్పుడప్పుడు మతాంతర వివాహాలు జరిగిన సందర్భాలున్నాయి. కానీ లవ్ జిహాద్ పేరుతో హాదియా అనే నవ ముస్లిమ్ అమ్మాయిని మానసికంగా వేధించిన దుర్మార్గులు మత వైషమ్యాలను రగిల్చాయి. యూపీలో ఆక్సిజన్ అందక ముక్కుపచ్చలారని వందల పసికందుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే అక్కడి సీఎం గోవుల కోసం అంబులెన్సును ప్రారంభించడం మనం ఎక్కడికి పోతున్నామో అంతుపటల్లేదు. జీఎస్టీ పేరుతో పన్నుపోటుతో ధరల పెరుగుదలతో ఆమ్ ఆద్మీ బ్రతుకు నరకకూపంగా మారిపోయింది. ఇలా చెప్పు కుంటూ పోతే ఎన్నో సవాళ్లు, సమస్యలు ఈ దేశాన్ని పీడిస్తున్నాయి. దీనిని బట్టి ఈ దేశం పురోగతి వైపు పరుగులు తీయడంలేదని, మనువాద అజెండా అమలు, సామాన్య ప్రజానికాన్ని పీడనకు గురిచేయడం తరహా పాలన సాగిస్తోందని ఎవరైనా ఇట్టే చెప్పేస్తారు. కానీ ఈ దేశంలోని కార్పొరేట్ మీడియా, కాషాయ నేతలు మాత్రం దేశం అభివృద్ధివైపు పరుగులు తీస్తోందని జబ్బలు చార్చుతున్నాయి. మోడీ ప్రభుత్వ వచ్చిన నాటినుంచి హామీలు, వాగ్దానాలే చూశాము కానీ వాటి అమలు మాత్రం చేతలు చూడలేకపోయాము.

నోట్ల రద్దు ఫలితం

దేశంలోని బడా నేతల నల్ల ధనం వెలికితీత కోసమే పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అని మోడీ సర్కార్ ప్రకటించింది. ఆచరణలో ఇంతవరకు ఆ నల్లధనం వెలికితీతలో ఎంతవరకు విజయం సాధించారో తెలియదు గానీ ఈ నోట్ల రద్దు వల్ల ఎంతో మంది అమాయకుల ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. మన దేశ రైతన్న, బక్కచిక్కిన కూలీ, తోపుడు బండ్ల వ్యాపారులు, కూలీలు, కుటీర పరిశ్రమల వ్యాపారులు, చిన్న, సన్నకారు రైతులు, ప్రతీ ఒక్కరినీ నోట్ల రద్దు సమస్య వెంటాడింది. ఎన్నో కుటీర పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. దేశంలో ఉపాధి అవకాశాలు పెరగాల్సింది పోయి, ఉన్నవి కాస్త కుచించుకొని పోయాయి. దీనిని బట్టే ఈ మోడీ సర్కార్ పెద్ద నోట్ల రద్దుతో సాధించిన విజయం ఏమిటో సామాన్య ప్రజలకు అర్థమైనా, వాటిని పట్టించుకోకుండా కమలం నేతలు గొప్పలు చెప్పుకోవడం వింతగా ఉంది. ఎన్నికలకు ముందు నరేంద్రమోఈ తాము అధికారంలోకివ వస్తే ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున్న పెంపొందిస్తామని పేర్కొన్నారు. వాస్తవంగా ఆయన వచ్చాక ఎంత మేర ఉపాధి అవకాశలు పెరిగాయి అన్నది మాత్రం స్వయంగా ఆయన వెల్లడించే ధైర్యం చేయడంలేదు. దీంతోనే మోడీ సర్కార్ సాధించిన విజయం ఏమిటో అర్థమైపోతోంది.

అమలవుతోంది ముమ్మాటికీ మనువాద అజెండాయే?

దేశంలో సబ్‌కా సాత్ సబ్ కా వికాస్ అన్నది ఏ మాత్రం కనిపించడంలేదు. దేశంలో ఒకప్పటి బలమైన మనువాద అజెండా అమలుకు బీజాలు ఇప్పటినుంచి బలంగా పడుతున్నాయన్న భావన దేశంలోని పరిస్థితులను గమనిస్తే కలుగుతుంది. ముస్లిం పర్సనల్ లాపై దుష్ప్రచారం చేయించిన ఈ బీజేపీ సర్కార్ మెజార్టీ ముస్లింల మనోభావాలకు భిన్నంగా త్రిపుల్ తలాక్‌పై కొత్త బిల్లును తీసుకొస్తోంది. ఏప్రభు త్వమైనా ఓ మెజార్టీ వర్గం విషయంలో ఓ నిర్ణయం తీసుకొంటుందంటే ఆ వర్గంలోని మెజార్టీ ప్రజల నిర్ణయం తీసుకొంటోంది. కానీ బీజేపీ సర్కార్ మాత్రం త్రిపుల్ తలాక్ విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఇక దళిత, గిరిజన, బీసీలు మన హిందువులే అని చెప్పే ఈ సర్కార్ ప్రభుత్వ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోగా అవు చర్మం వలిచారని దళితులపైనా, ఇతర కారణాలు చెప్పి ఎస్టీలపైనా, ఏ మాత్రం అభివృద్ధిని పట్టించుకోకుండా బీసీలను విస్మరించడం ద్వారా ముమ్మాటికీ ఈ సర్కార్ మనువాద అజెండా అమలు చేస్తోంది. కేంద్రంలోని కీలక పదవులు బ్రహ్మణలకు బీజేపీ కట్టబెట్టింది. దీనిని బట్టే బీజేపీ మనువాద అజెండాను బలంగా అమలు చేస్తోందని చెప్పాలి. ఇలా 2014 నుంచి నేటి వరకు మన దేశపు పుస్తకంలోని పుటలను తిరగేసి చూస్తే ప్రతీ పేజీలో రక్తపు మరకలు, ఆక్రందలు, ఆవేదనలే కనబడతాయి.

ఈ నినాదాల ఉద్దేశం ఏమిటి?

గో రక్షణ, లవ్ జీహాద్, ఘర్‌వాపసీ, బేటీ బచావో..బహులావో ఈ నినాదాలు వినడానికి కొంత ఆకర్షించే రీతిలో ఉన్నా దాని వెనక ఉన్న ఉద్దేశాలు మాత్రం చాలా ప్రమాదపూరితమైనవి. గో రక్ష పేరుతో ముస్లిం, దళిత, మైనార్టీ వర్గాలపై దాడులు దేశవ్యాప్తంగా పెరిగాయి. ఎంతో మంది ఈ వర్గ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లవ్ జీహాద్ వీటి వల్ల దేశంలో మతాంతర వివాహాలు ఎక్కడా అమాంతంగా పెరిగిన దాఖలాలు లేవు. కానీ ఈ నినాదంతోనూ దళిత, ముస్లిం, మైనార్టీ వర్గాలపైనా దాడులు పెరిగాయి. ఘర్‌వాపసీ ఈ నినాదంతో ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బీజేపీ నేతలు హిందూ మతంలోకి తిరిగి ఎంతమంది హిందూయేతరులను తీసుకొచ్చారో చెప్పలేదు. ఇప్పుడు బేటీ బచావో...బహులావో అన్న నినాదం. తన బిడ్డను రక్షించుకో అన్న దాంతో పాటు బహు లావో అని చెప్పడం ద్వారా పరమతం అమ్మాయిని ఆకర్షించు అన్న ఉద్రేకపూరిత నినాదం దాగివుంది. ఈ నినాదాల వల్ల దేశ పురోగతికి వచ్చిన లాభమేమిటీ, హిందూ మతానికి ఒరిగిన లాభం ఏమిటీ...ఈ నినాదాల వల్ల హిందూ మతానికి అమీతంగా జరిగిన లాభం ఏమిటో ఇంత వరకు మనకు బోధపడలేదు. కానీ దేశంలో ఇప్పటి వరకు అన్నదమ్ములుగా మెలుగుతున్న హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్ ఇలా అన్ని వర్గాల మధ్య విద్వేషాలకు మాత్రం బీజం వేస్తూ పోతున్నాయి. ఒక నేర చరిత్ర ఉన్న వ్యక్తి ఎంతటి ప్రమాదకారో అలాంటి వారిని తయారు చేసే వారు మరింత ప్రమాదకారులు. ఈ విషయాన్ని మాత్రం కేంద్రంలోని మోడీ సర్కార్ పట్టించుకొనేలా కనిపించడంలేదు. అందుకే కొత్త కొత్త నినాదాలతో ఈ శక్తులు రెచ్చిపోతున్నాయి.

కాషాయ శక్తులు చేసిన మేలేమిటి?

హిందూ రాజ్యం...హిందూ ప్రతినిధులం ఇవి కాషాయకరణ శక్తులు నిత్యం జపించేవి. నిజంగా ఈ హిందూ సమాజంపై కాషాయ శక్తులకు ప్రేమ ఉంటే వారిని ఆర్థికంగా అభివృద్ధిలోకి తేవడంలో చేసిన ప్రయత్నం ఏమిటో లెక్కలతో సహా ఆ పార్టీలు వివరించాలి. ఈ హిందూ సోదరులకు నినాదాలతో తప్పా అభివృద్ధిచేసింది ఎక్కడా లేదు అన్న వాస్తవాన్ని ప్రజాస్వామిక, లౌకికవాదులు లెక్కలతో సహా వెలుగులోకి తీసుకురావాలి. వాటిని హిందూ సోదరులకు చేరవేయాలి. అప్పుడే మతశక్తుల ఈ నినాదాలు ఎక్కువ కాలం పారవు.

లౌకికవాదుల నినాదాలు

కేంద్రంలో నరేంద్రమోడీ సర్కార్ అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా ముస్లింలు, దళితులపై దాడులు పేట్రెగాయని మాట వాస్తవం. ఈ వాస్తవాన్ని అంగీకరించిన దళితులు సైతం ముందుకొచ్చి ముస్లింతో చెయ్యిచెయ్యి కలిపి మనువాద(అగ్రవర్ణాల మత అజెండా) భావాలను అడ్డుకొంటామని వెల్లడించాయి. జై భీం, జై ముస్లిం, దళిత వర్గాల ఐక్యత అని నినాదించాయి. కానీ ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఎన్నికలలో మాత్రం తమ అజెండాను సమర్థవంతంగా అమలు చేయడంలో లౌకిక పార్టీలు, బడుగు వర్గాల ప్రజా సంఘాలు విఫలమయ్యాయి. కానీ బీహార్‌లో మాత్రం నితీష్‌కుమార్, లాలు ప్రసాద్‌యాదవ్, కాంగ్రెస్ నాయకత్వం ఏకమై బీజేపీని సమర్థవంతంగా నిలువరించగలిగాయి. కానీ ఆ ప్రయత్నం ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లలో జరగలేదు. ఎందుకంటే లౌకిక పార్టీలుగా చెప్పుకొనే బీజేపీ యేతర పార్టీలన్నీ అధికార కాంక్ష దిశగా అడుగులేశాయి. కానీ ప్రమాదకరమైన మత అజెండా వల్ల తమ ఉనికిని కోల్పోతామన్న సృహను ఈ పార్టీలు కోల్పోయాయి. మత అజెండా ఒక్కసారి తెరపైకి వస్తే మత అజెండాతో సంబంధంలేని ఏ పార్టీకి ఉనికి ఉండదు. ఆ ధీమాతోనే బీజేపీకి ముందుకెళ్తోంది. ఈ క్రమంలో మున్ముందు లౌకిక పార్టీలుగా చెప్పుకొనే పార్టీలు ఉనికిని కోల్పోవాల్సి వస్తుంది. లౌకిక పార్టీలు బీజేపీ అజెండాకు వ్యతిరేకంగా ప్రజలన సమాయత్తం చేయడంలో విఫలమయ్యాయి. యూపీ, గుజరాత్ ఎన్నికలల్లో ఆర్ఎస్ఎస్, విహెచ్‌పికి చెందిన లక్షలాది కార్యకర్తలు సోషల్‌మీడియా వేదికగా చేసుకొని ప్రచారం చేయడం వల్ల బీజేపీ ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే ఈ తరహాలో లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు మత సహనం భావాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే విషయంలో లౌకిక పార్టీలు విఫలమయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల ఐక్యతను కాక్షించే ప్రజాసంఘాలు కేవలం వాటిని నినాదాలుగా మార్చడం వల్లే బీజేపీ విజయాల దిశగా దూసుకుపోతుందే తప్పా వాస్తవానికి అది కమలం విజయం కాదు. మత అజెండా ఉన్న ప్రభుత్వం వస్తే ఎలాంటి పరిణామాలు ఉత్పన్నమవుతాయో విశధీకరించి చెప్పడంలో లౌకిక వాద పార్టీలు విఫలమయ్యాయి.

చరిత్రలో ఈరోజు

జనవరి 28

1933: ముస్లిముల ప్రత్యేక దేశానికి పాకిస్తాన్ అనే పేరుపెట్టాలని ప్రతిపాదించారు. పాకిస్తాన్ అంటే స్వచ్ఛమైన భూమి అని అర్థం.
1950: భారత సుప్రీంకోర్టు పనిచేయడం ప్రారంభించింది.
1955: వినోద్ ఖోస్లా, ఇండియన్–అమెరికన్ వెంచర్ క్యాపిటలిస్ట్ జననం.
2014: బీరం మస్తాన్‌రావు, రంగస్థల కళాకారుడు, నట శిక్షకుడు, తెలుగు సినిమా దర్శకులు మరణం.
2016: గౌరు తిరుపతిరెడ్డి, ప్రముఖ వాస్తునిపుణుడు మరణం.
2016: అరిందమ్ సేన్‌గుప్తా ప్రముఖ ఆంగ్ల దినపత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ ఎడిటర్ మరణం.

సుప్రీంకోర్టు


భారత దేశంలోని అత్యున్నత న్యాయస్థానము సుప్రీంకోర్టు. ఇది 1950 జనవరి 28న నుంచి పనిచేయడం ప్రారంభించింది. ఇది హైకోర్టు లేదా ఉన్నత న్యాయస్థానములపై నియంత్రణాధికారం కల్గి ఉన్నది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహాపైననే రాష్ట్రపతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను, ఇతర న్యాయమూర్తులను నియమిస్తాడు. ఈ కోర్టు భారత ప్రభుత్వానికి, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాల మధ్య తగాదాలను, భారత ప్రభుత్వం, ఒకటి లేదా కొన్ని రాష్ట్రాలు ఒక వైపు ఒకటి లేదా కొన్ని రాష్ట్రాలు ఇంకొక వైపు ఉన్నప్పుడు వాటి మధ్య తగాదాలను, రెండు అంత కంటే ఎక్కువ రాష్ట్రాల మధ్య తగాదాలను పరిష్కరిస్తుంది. కోర్టు ఆఫ్ రికార్డుగాను, రాష్ట్రపతికి సలహాదారుగాను వ్యవహరిస్తుంది. న్యాయసమీక్షాధికారం ఉంటుంది.

పాకిస్తాన్




పాకిస్థాన్ పేరులోని పాక్ అంటే ఉర్దూ, పాష్తో మరియు పర్షియాలలో స్వచ్ఛత అని అర్థం. స్థాన్ అంటే ప్రదేశం అని అర్థం. పాకిస్తాన్ అంటే స్వచ్ఛమైన ప్రదేశం అని అర్థం. స్థాన్ అనే పర్షియన్ పదానికి మూలం సంస్కృత స్థాన్ (సంస్కృతం) (దేవనాగర్) అని భావిస్తున్నారు. 1933 జనవరి 28న మొదటిసారిగా పాకిస్థాన్ స్వతంత్ర సమర యోధుడు చౌద్రీ రహ్మత్ అలీ ఒక కరపత్రంలో పాకిస్థాన్ డిక్లరేషన్ పేరును పేర్కొన్నాడు. పాకిస్తాన్‌లో 3 కోట్లమంది ముస్లిములు నివసిస్తున్నారని పేర్కొన్నాడు. ఇందులో సౌత్‌ఆసియా, బ్రిటిష్‌రాజ్‌లోని పంజాబు, ఖైబర్, కాశ్మీరి, సింధీ మరియు బలూచిస్థాన్ ప్రాంతాలు పేర్కొన్నాడు. పాక్ అనే పదా నికి సులువుగా పలకడానికి మరియు అర్థవంతం చేయడానికి పేరులో ఐ అనే అక్షరాన్ని చేర్చారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్. కరాచీ, లాహోర్, పెషావర్ ఇతర ప్రధాన నగరాలు.

బీరం మస్తాన్‌రావు



బీరం మస్తాన్ రావు అక్టోబర్ 30, 1944న గుంటూరులో జన్మించారు. జనవరి 28, 2014న మరణించారు. ఆయన రంగస్థల కళాకారుడు, నట శిక్షకుడు, తెలుగు సినిమా దర్శకులు. ప్రజా నాట్యమండలి, యువజన నాట్యమండలి, ఆంధ్ర ఆర్ట్ థియేటర్స్ వంటి సమాజాలలో చురుకైన పాత్ర పోషించారు. 1971లో నిర్మించిన బాలమిత్రుల కథ సినిమాలోని బాల నటులకు శిక్షణనిచ్చేందుకు బీరం చెన్నై వచ్చారు. తరువాత పలు చిత్రాలకు అసోసియేట్ దర్శకునిగా పనిచేశారు. అల్లు రామలింగయ్య, సుత్తి వీరభద్రరావు, జమున, గరికపాటి రాజారావు తదితరులతో కలిసి నాటకాలు వేస్తూ వచ్చిన ఆయన ‘రాజమనుషులు’ అనే నాటకానికి గానూ నటుడిగా, దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. బాలమిత్రుల కథ చిత్రంతో సహాయ దర్శకుడిగా సినిమా జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం జీవనచదరంగం, దేవుడుచేసిన మనుషులు, కన్నె వయస్సు, శభాష్ పాపన్న, ఎదురులేని మనిషి, ఇంద్రధనస్సు తదితర చిత్రాలకు పనిచేశారు. తెలుగు దర్శకుల అసోషియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా, సలహాదారుడిగా వ్యవహరించిన ఆయన నంది అవార్డుల ఎంపిక జ్యూరీ బృందంలోనూ సుదీర్ఘకాలంపాటు సేవలందించారు.

సర్వేలు ఓట్లు రాల్చేనా !



ఇస్కా రాజేష్‌బాబు, 96520 39780
‘సూర్య’ అమరావతి బ్యూరో చీఫ్

- పలు నియోజకవర్గాల్లో ఫలితాలు మరీ నిరాశాజనకం
- నెల్లూరులో నేటికీ దేశం ఇంకా బలహీనమే
- కాపుల రిజర్వేషన్ ఇచ్చినా అంతా ఓట్లు అంతంతే
- టీడీపీదే విజయమని తేల్చి చెప్పిన సొంత సర్వే
- జనసేనకు 9 సీట్లే వస్తాయన్న జగన్ సర్వే



నవ్యాంధ్రలో ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి రానుందన్న సర్వేలు ఆసక్తి రేపు తున్నాయి. పలు సర్వేల ప్రకారం తమదే అధికార మని నేతలు బయటకు ధీమాగా ఉన్నప్పటికీ విజయావకాశాలపై అప్పుడే లెక్కలు వేసుకుంటు న్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అదే ఊపుతో విజయావకాశాలపై అడుగులు వేస్తుండగా ప్రతిపక్ష వైసీపీ కూడా గత ఎన్నికల పరాజయాన్ని పక్కనపెట్టి ఫ్యాన్ స్పీడ్‌ను పెంచుతూ అధి కార పార్టీలో వణుకు పుట్టిస్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఓటర్లు ఈ సర్వేల విషయం గురించే మాట్లాడుకుంటున్నారు. సర్వే లెక్కలు కాకి లెక్కలవుతాయా.. నిజమవుతాయా అన్ని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు...’

ఆంధ్రప్రదేశ్‌లో 2014 ఎన్నికల్లో వచ్చిన సర్వే వివరాల ప్రకారం ప్రస్తుత ప్రతిపక్ష వైసీపీకి అధికారం వచ్చినట్టే వచ్చి చేజారింది. కొద్దిపాటి ఓట్ల శాతంతో పాటు స్వయంకృతాపరాధంతో పాటు ఓటర్ల నాడిని పట్టలేకపోయింది. అయితే ఈ సారి అలా జరగకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రతిపక్షం ఇప్పటి నుంచే అందుకు అవసరమైన కార్యాచరణప్రణాళికతో ముందుకు సాగుతోంది. అంతే ధీటుగా అధికార పార్టీ కూడా నియోజకవర్గాల వారీగా జయాపజయాలపై అంచనాలు వేస్తోంది. ఆలూ లేదు. చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నది సామెత. కానీ ఆ సామెతను నిజం చేసేలా ఉన్నాయి కొన్ని సర్వేలు. పార్టీ అభ్యర్థులు ఎవరో తెలియదు. ఎక్కడ పోటీ చేస్తారో తెలియదు. కానీ జనసేన పార్టీకి ఏపీ, తెలంగాణలో ఎన్ని సీట్లు వస్తాయో చెబుతున్నారు.

ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటారు. ఎన్ని సీట్లల్లో పోటీ చేస్తారు. ఏంటనేది తెలియదు. కానీ సర్వే ఫలితాలు వచ్చాయి. ఎంత శాతం వారికి ఓటింగ్ పడుతుందో కూడ చెప్పేశాయి. అదే మరి విచిత్రం. కాగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 57శాతం ఓట్లు, 139 సీట్లు తెలుగుదేశం పార్టీకి వస్తాయని ఓ సర్వే తేల్చింది. సీఎం వద్ద సర్వే నివేదిక కూడా ఉందట. ఆంధ్రప్రదేశ్ ను అన్ని రకాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. విభజనతో రావాల్సిన నిధులకు గండి పడినా వీలున్నంత వరకు ఏపీకి అన్యాయం జరగకుండా చూస్తున్నాడు. విదేశీ పర్యటనలు చేస్తు పెట్టుబడులను తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతోంది.

కొన్ని కంపెనీలు ఇప్పటికే రాగా మరి కొన్ని వచ్చే ఆలోచన చేస్తున్నాయి. హామీలు కొన్ని అమలు చేసినా మరికొన్నింటి విషయంలో లోటు పాట్లు ఉన్నాయి. అందుకే అసలు వాస్తవ పరిస్థితి ఏంటి. ప్రజలు ఎటువైపు ఉన్నారు. వాస్తవ పరిస్థితి ఏంటనే విషయం పై రకరకాల సర్వే లు వస్తున్నాయి. మొన్న రిపబ్లిక్ టీవీ ఇచ్చిన సర్వేతో నిజం ఏంటనే అనుమానం కలిగింది. అందుకే తాజాగా మరో సర్వే చేశారు ప్రైవేటు వ్యక్తులు. 2018 డిసెం బర్‌లో ఎన్నికలు జరిగితే ఎవరికి జనాలు పట్టం గడతారనే విషయం పై ఓటర్లు తేల్చిచెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో సైకిల్ ప్రభంజనం తప్పదని ఆ కీలక సర్వే వెల్లడించింది. నంద్యాల, కాకినాడల్లో వచ్చిన 56శాతం ఓట్లు కంటే మరో శాతం అధికంగా వస్తుందని వెల్లడించింది.

టీడీపీ 57శాతం ఓట్లతో 139 సీట్లలో, వైసీపీ 24శాతం ఓట్లతో 28సీట్లు, జనసేన 10శాతం ఓట్లతో 9సీట్లు వస్తాయని సర్వే ఖచ్చితంగా చెబుతోంది. దేశంలోనే అత్యంత పలుకుబడి, విశ్వస నీయత కలిగిన సంస్థతో ఈ సర్వే చేయించారని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ లోనే కాదు దేశంలో అందరూ విశ్వసించే మాజీ ఎంపీ లగడపాటికి చెందిన చెందిన సంస్థ బృందం 200 మంది నంద్యాల ఎన్నికలకు ముందు రంగంలోకి దిగారు. నంద్యాల, కాకినాడ సర్వేలు పూర్తి చేసి పంపించాక తమ అసలు ఆపరేషన్ మొదలుపెట్టారు. వారితో పాటు ఢిల్లీ, నోయిడా నుంచి వచ్చిన ఆ సర్వే టీమ్స్ రాష్ట్రంలోని 13 జిల్లా ఖలు తిరిగి సమాచారం సేకరించింది. ఆయా నియోజక వర్గానికి వేయిమంది చొప్పున శాంపుల్స్ సేకరించాయి. 20 ప్రశ్నలతో కూడిన ఫార్మెట్ రూపొందించాయి. సర్వేలో వయస్సుల వారీగా, ప్రాంతాల వారీగా, విదార్థతల వారీగా డేటాను ప్రిపేర్ చేశాయి. ఆయా సామా జికవర్గాలు గురించి ప్రత్యేకంగా ఆరా తీశారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయ లసీమ వారీగా నివేదికలు అందచేశారు. వీటి ఆధారంగానే సీఎం టీడీపీ వర్క్ షాప్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ నివేదికల ప్రకారం టీడీపీ+ 57 శాతం, వైసీపీ 24శాతం, జనసేన+ 10శాతం, కాంగ్రెస్ 4 శాతం, ఇప్పుడే ఎవరికి వేసేది చెప్పలేం 5శాతం అని తేలినట్లు సమాచారం. రాయలసీమలోని 52 స్థానాల్లో తెలుగుదేశం 41 వైసీపీ 10, జనసేన 1, చిత్తూరులోని 14 నియో జకవర్గాలలో టీడీపీ 11, వైసీపీ 3 స్థానాలు, కడపలోని 10 నియోజకవర్గాల్లో టీడీపీ 7, వైసీపీ 3 స్థానాలు, అనంతపురంలోని 14 నియోజకవర్గాలలో టీడీపీ 11, వైసీపీ 2, జనసేన 1 స్థానం, కర్నూలులోని 14 నియోజక వర్గాలలో తెలుగుదేశం పార్టీ 12, వైసీపీ 2 స్థానాలు లభించనున్నట్లు సర్వే తేల్చింది. ఉత్తరాంధ్ర సర్వే ఫలితాలు కూడా ఈ సారి కీలకంగా మారనున్నాయి. ఉత్తరాంధ్రలోని మొత్తం 33సీట్లలో తెలుగు దేశం పార్టీకి 24,వైసీపీ 8, జనసేన 1 వస్తుందని వెల్లడైంది. శ్రీకాకుళంలోని 10 నియోజకవర్గాల్లో టీడీపీ 7, వైసీపీ 3 విజయనగరం లోని 9 నియోజకవర్గాల్లో టీడీపీ 6, వైసీపీ 3, విశాఖపట్నం జిల్లాలోని 14 నియోజకవర్గాలలో తెలుగు దేశం పార్టీ 11, వైసీపీ 2, జనసేన 1 స్థానాలు వస్తాయని ఆ సర్వే అంచనా వేసింది. కోస్తా జిల్లాల్లో వారీగా బలాబలాలు ఇలా ఉన్నాయి. కోస్తాంధ్రలో మొత్తం 89 సీట్లలో తెలుగుదేశం పార్టీ 72, వైసీపీ 10, జనసేన 7 స్థానాలు గెలుచుకోనున్నాయట. తూర్పు గోదావరి జిల్లాలోని 19 నియోజకవర్గాలలో టీడీపీ 14, వైసీపీ 2, జనసేన 3, పశ్చిమగగోదావరి జిల్లాలోని 15 నియోజకవ ర్గాలలో టీడీపీ 12, వైసీపీ 1, జనసేన 2, కృష్ణా జిల్లాలోని 16 నియోజకవర్గాలలో టీడీపీ 14, వైసీపీ 1, జనసేన 1, గుంటూరులోని 17 నియోజకవర్గాలలో టీడీపీ 15, వైసీపీ 2, ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలలో టీడీపీ 9, వైసీ పీ 2 జనసేన 1, నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాలలో టీడీపీ 8, వైసీపీ 2 గెలుపు సాధిస్తాయని ఆ సర్వేలు వెల్లడించాయి. ఇక ఉభయ కమ్యూనిస్టు పార్టీ లో గెలిస్తే ఒకటి అరా తప్ప పెద్దగా ప్రభావం చూపలేవని తేలింది. (రేపు



హెచ్1బి వీసాల విషయంలో మరో శుభవార్త

వాషింగ్టన్ : హెచ్1బి వీసాల గడువు పొడిగింపు, కొత్త వీసాల జారీ విషయంలో అమెరికా కొత్త నిబంధనలు, ఆంక్షలు పెడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ విషయంలో అమెరికా తాజాగా ఒక శుభ వార్త చెప్పింది. తాజాగా అమెరికాలో రిపబ్లికన్ సెనేటర్లు సెనేట్‌లో హెచ్1బి వీసాలపై వార్షిక పరిమితిని పెంచడానికి ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు సదరు వీసాల పరిమితి ఏడాదికి 65 వేలుగా ఉండగా ఈ బిల్లు ప్రకారం ఆ పరిమితిని 85 వేలకు పెంచారు. అదనంగా పెంచిన ఈ 20 వేల వీసాలను అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన వారికి ఇవ్వనున్నారు. అంతే కాదు. ఒకవేళ కంపెనీలకు మరింత మంది ఉద్యోగులు అవసంమైనట్లయితే అందుకు తగినట్లుగా కొత్త వారి కోసం అదనంగా 1,10,000 వీసాలు కూడా మంజూరు చేసుకునేలా ఈ బిల్లు తీసుకువచ్చారు. దీనితో మొత్తం హెచ్1బి వీసాలు ఒక ఆర్థిక సంవత్సరంలో 1,95,000 వరకు మంజూరు చేయవచ్చు. అదే విధంగా, హెచ్1బి వీసాదారుల జీవిత భాగస్వాములతో పాటు వారి పిల్లలకు హెచ్-4 కింద ఉద్యోగం చేసుకునే అవకాశాన్ని కూడా ఇవ్వనున్నారు.

మేఘా సిగలో మరో నగ

- **నేడు ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్య ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం**
- **మరోళాలో ప్రారంభించనున్న కర్నాటక మంత్రులు**
- **ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేసిన ఎంఈఐఎల్**
- **12,300 హెక్టార్లకు సాగునీరు అందించనున్న ప్రాజెక్టు**
- **ఆరువేల మందికి పైగా రైతులకు లబ్ధి**
- **2150 కిలో మీటర్ల పైప్‌లైన్ నిర్మాణం**

(అమరావతి-సూర్య ప్రత్యేక ప్రతినిధి) : మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్య ప్రాజెక్ట్ కర్నాటకలోని భాగల్‌కోట్ జిల్లా రాంతాల్ మరోళాలో ఆదివారం నాడు ప్రారంభం కానుంది. కృఎష్ణా భాగ్య జల నిగమ అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టును మేఘా సంస్థ చేపట్టి పూర్తి చేసింది. ప్రాజెక్టును కర్నాటక జల వనరుల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇజ్రాయిల్‌కు చెందిన నెటాఫిమ్ సంస్థ సాంకేతిక సహకారాన్ని అందించింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను



మేఘా సంస్థ ఐదు సంవత్సరాల పాటు చూడనుంది. ఈ బిందు సేద్య ప్రాజెక్టుకు 2150 కిలోమీటర్లు పైప్‌లైన్ వేశారు. భాగల్‌కోట్ జిల్లాలోని రాంతాల్ మరోళా ప్రాంత రైతులు ఇంతకు ముందు సాగునీరు సక్రమంగా అందక తీవ్ర ఇబ్బందులు పాలయ్యేవారు. ఆయకట్టు చివరి రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఆయకట్టు ఆరంభంలో ఉన్న రైతులు ఏదాదికి రెండు పంటలు పండిస్తే చివరన ఉన్నరైతులకు ఒక పంట పండటం కూడా గగనంగా ఉండేది. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని కృష్ణా భాగ్య జలనిగమ నిర్ణయించింది. ఆ బాధ్యతను మేఘా సంస్థకు అప్పగించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టిసీమ ప్రాజెక్టును అతి తక్కువ సమయంలో పూర్తి చేసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించిన మేఘా సంస్థ ఆసియాలోనే అతి పెద్ద బిందు సేద్య ప్రాజెక్టును నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఆలమట్టి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను ఈ ప్రాజెక్టు ద్వారా సద్వినియోగం చేసి గత ఐదు నుంచి పది సంవత్సరాలుగా నీటి లభ్యత సరిగా లేక కరువుతో అల్లాడుతున్న భాగల్‌కోట్ ప్రాంత రైతుల ఇబ్బందులు తీర్చేందుకు సిద్ధమైంది. బిందు సేద్య ప్రాజెక్టుకు అవసరమైన భూమిని అప్పగించేందుకు తొలుత నిరాకరించిన రైతులను మీ సమస్యలు తీరుతాయని ఒప్పించి పనులను మేఘా సంస్థ చేపట్టింది. ప్రాజెక్టును పూర్తి చేసింది. ఆదివారం ఇది ప్రారంభం కానుంది. ఇప్పటి వరకూ కాల్వ చివరి భూములకు నీళ్లు అందటం లేదని నిత్యం రైతులు ఘర్షణలకు దిగుతుండేవారు. ఇవుడు ఇక ఆ సమస్య తీరనుంది. మేఘా సంస్థ చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రైతు తమ పొలంలో ఏర్పాటు చేసిన సిలెండర్ ద్వారా నీటిని నేరుగా బిందు సేద్యంతో పంటకు అందించుకోవచ్చు. పంటకు వినియోగించే ఎరువులు, పురుగు మందులను కూడా ఈ సిలెండర్ ద్వారానే వేసుకునే అవకాశం ఉంది. దీని ద్వారా నీటి వృధాను కూడా అరికట్టవచ్చు. కృష్ణా నది బ్యాక్ వాటర్‌లో ఏవైనా వ్యర్థాలు వస్తే వాటిని శుభ్రం చేసి పంటలకు అందించే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రాజెక్టులో వినియోగించారు. బిందు సేద్యం వల్ల తక్కువ ఖర్చు, తక్కువ నీటి వినియోగం, తక్కువ పురుగుమందులు, తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం రైతులకు వస్తుందని కర్నాటక జల వనరుల విభాగం అధికారులు చెప్పారు. దేశంలోనే తొలిసారిగా



ఇజ్రాయిల్ సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ప్రాజెక్ట్ ఇది. ఆ ఘనత మేఘా ఇంజనీరింగ్ సంస్థకు దక్కుతుంది. సాధారణంగా బిందు సేద్యానికి ఉపయోగించే పైపులకు భిన్నంగా భూమిలోపల నుంచి పైపులను వేశారు. భూమి లోపల నుంచి వేసిన పైపులు కూడా పది నుంచి 15 సంవత్సరాల కంటే ఎక్కువ వినియోగించే అవకాశం లేదు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు వినియోగించిన పైపులు ఫైబర్ ఆప్టిక్‌తో తయారు చేశారు. వీటి జీవిత కాలం 50 సంవత్సరాలు. భూమిలోపల నుంచి పైపులు వేయటం వల్ల రైతులకు కూడా ఎలాంటి నష్టం లేదు. ఈ ప్రాజెక్టు కోసం ఫైబర్ ఆప్టిక్ పైపులను మేఘా సంస్థ ప్రత్యేకంగా తయారు చేయించింది. కృష్ణా నది బ్యాక్ వాటర్ లభ్యం కాని పక్షంలో రైతులు తమ పొలాల్లోని బోర్ల ద్వారా కూడా నీటిని బిందు సేద్యానికి వేసిన పైపుల ద్వారా పంటలకు అందించే సౌకర్యం కూడా కల్పించారు. మేఘా సంస్థ ఐదు సంవత్సరాల నిర్వహణ అనంతరం బిందు సేద్య ప్రాజెక్టును రైతులకు అప్పగించనుంది. ఆ తరువాత వారు దాని నిర్వహణ బాధ్యతలను చేపడతారు. ఇందుకు గాను రైతులు ఒకొక్కరు ప్రతి ఏటా ఎకరాకు సుమారు 1300 రూపాయలు వసూలు చేసుకుని బ్యాంకులో భద్ర పరుచుకుంటారు. ఐదు సంవత్సరాల తరువాత ఏదైనా అవసరమైన పక్షంలో ఆ మొత్తం నుంచి వినియోగించుకుంటారు.

తగ్గిన బంగారం ధర



న్యూఢిల్లీ : పెళ్లిళ్ల సీజన్ దగ్గర పడుతుండడంతో క్రితం సెషన్‌లో 14 నెలల గరిష్ఠానికి పెరిగిన బంగారం ధర శనివారం కాస్త దిగి వచ్చింది. అంతర్జాతీయంగా ధర పెరిగినా స్థానిక నగల వ్యాపారుల నుంచి డిమాండ్ లేకపోవడంతో దేశీయ విపణిలో ధర పడిపోయింది. శనివారం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ. 250 మేర తగ్గి రూ. 31,200గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో 0.15 శాతం పెరిగి ఔన్స్ ధర 1,349.30 డాలర్లుగా ఉన్నది. అటు వెండి పరిస్థితి కూడా అదే తీరులో ఉంది. పారిశ్రామిక వర్గాల నుంచి కొనుగోళ్లు తగ్గడంతో వెండి ధర రూ. 41వేల కిందకు పతనమైంది. రూ. 350 మేర తగ్గడంతో శనివారం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 40,650గా ఉన్నది. మరొక వైపు అంతర్జాతీయంగా 0.72 శాతం పెరిగి ఔన్స్ వెండి 17.38 డాలర్లు పలికింది.

వొడాఫోన్ కుక్కపిల్ల మళ్లీ వచ్చేసింది




న్యూఢిల్లీ : 'వేర్ ఎవర్ యు గో, ద నెట్‌వర్క్ ఫాలోస్ యు' అంటూ అప్పట్లో హచ్ కుక్కపిల్ల చేసిన సందడిని ఎవరూ మరచిపోలేరు. తన యజమాని ఎక్కడికి వెళితే అది కూడా అక్కడికి వెళ్లేది. ఇంత కాలం తరువాత ఇది మళ్లీ ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో దర్శనం ఇచ్చింది. ఈసారి ఒక్కటే కాకుండా తన గ్యాంగ్‌నంతా వెంట తెచ్చుకుంది. అసలు విషయం ఏమిటంటే అవి నిజమైన కుక్కపిల్లలు కావు. ఆగ్మెంటెడ్ రియాలిటీ సాంకేతికతను ఉపయోగించి వొడాఫోన్ వీటిని సృష్టించింది. వీటితో వ్యాఖ్యాతలు కొద్ది సేపు ఆటలు ఆడారు. వీటిని చూసి అలా ఆశ్చర్యపోవడం ప్రేక్షకుల వంతైంది. ఇలా ఒక్కసారిగా హచ్ కుక్కపిల్లలు ప్రేక్షకుల చూపును తమ వైపు తిప్పుకున్నాయి. స్పోర్ట్స్ లీగ్‌లో వొడాఫోన్ ఈ సాంకేతికతను వాడడం ఇదే మొదటిసారి. ఆగ్మెంటెడ్ రియాలిటీ అంటే కంప్యూటర్‌లో ఉండే చిత్రాలను వాస్తవిక ప్రపంచంలోకి తీసుకువచ్చినట్లు చూపరులకు భ్రమ కలిగించడం.

స్వల్ప కాలంలోనే

జిఎస్‌టి విజయవంతమైంది

- **జిఎస్‌టి పరిధిని విస్తరిస్తాం** • **పన్ను రేట్లు హేతుబద్ధం చేస్తాం**
- **పన్ను వసూళ్లు పెరిగాయి** • **జిఎస్‌టి భారం తగ్గించాలి**
- **సేవా రంగంలోని వేర్వేరు పరిశ్రమల డిమాండ్**
- **ఆర్థిక మంత్రి జైట్లీ**


న్యూఢిల్లీ : వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) చాలా కొద్ది కాలంలో విజయవంతమైందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. దీని వల్ల దాని పరిధిని మరింత విస్తృతం చేసేందుకు అవకాశం కల్పించినట్లయిందని ఆయన తెలిపారు. అంతే కాదు. భవిష్యత్‌లో పన్ను రేట్లను హేతుబద్ధం చేసేందుకు ఇది సూచకంగా ఉందని జైట్లీ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ కస్టమ్స్ డే సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన సందర్భంలో జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని పరోక్ష పన్ను వ్యవస్థలో జిఎస్‌టి చాలా మార్పులు తీసుకువచ్చిందని మంత్రి తెలిపారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో జిఎస్‌టి వ్యవస్థ చాలా కొద్ది కాలంలోనే స్థిరపడిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిఎస్‌టి కింద నాలుగు శ్లాబుల ప్రకారం పన్నులు విధిస్తున్నారు. 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం పన్నులను విధిస్తున్నారు. వినియోగదారుడిపై పడుతున్న పన్ను భారాన్ని తగ్గించేందుకు జిఎస్‌టి మండలి ఎప్పటికప్పుడు సమావేశమై పన్ను విధానాలను సవరిస్తూ వస్తోంది. నవంబర్‌లో సమావేశమైన జిఎస్‌టి మండలి 28 శాతం పన్ను కింద ఉన్న 178 వస్తువులను ఆ శ్లాబు నుంచి తొలగించి తక్కువ పన్ను శ్లాబులోకి మార్చిన విషయాన్ని జైట్లీ గుర్తు చేశారు. రెండు నెలల క్షీణత నుంచి కోలుకుని డిసెంబర్ నెలలో జిఎస్‌టి వసూళ్లు పెరగడంపై జైట్లీ హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్ నెలలో జిఎస్‌టి కింద రూ. 86 వేల కోట్లు వసూలైన విషయం విదితమే. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) భారం తగ్గించాలి. సేవా రంగంలోని వేర్వేరు పరిశ్రమల డిమాండ్ ఇది. వారి ఆశను రానున్న సార్వత్రిక బడ్జెట్ నేరవేరుస్తుందా? పర్యాటకం, రవాణా, టెలికమ్, టెక్ రంగాలకు ఊతమిచ్చేలా కేంద్రం కీలక నిర్ణయాలు ప్రకటిస్తుందా? దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో సేవా రంగానిదే సింహభాగం. జిడిపిలో దాదాపు 54 శాతం వాటా కలిపి దేశంలోకి పెద్ద ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సేవా రంగం ఆకర్షిస్తోంది. ఇలా దేశ ఆర్థికాభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్న సేవా రంగ పరిశ్రమలో పర్యాటక రంగం ప్రధానమైనది. పర్యాటక రంగం ద్వారా



ఇప్పటికే 4 కోట్ల మంది ఉపాధి పొందుతుండగా రానున్న దశాబ్దంలో అదనంగా కోటి ఉద్యోగాల సృష్టికి అవకాశం ఉంది. చూపు తిప్పుకోనివ్వని ప్రకృతి అందాలు, అపార చారిత్రక సంపద, విభిన్న సంప్రదాయాలకు నెలవైన భారత్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో ఆస్కారం ఉందని గుర్తించిన మోడీ ప్రభుత్వం ఆ దిశగా విస్తృత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నది.

శాంసంగ్ ఫ్లాగ్‌షిప్ మొబైల్

గెలాక్సీ ఎస్9 రిలీజ్ డేట్ ప్రకటన



సియోల్: శాంసంగ్ తన తాజా ఫ్లాగ్‌షిప్ మొబైల్ గెలాక్సీ ఎస్ 9 విడుదల తేదీని ప్రకటించింది. ఫిబ్రవరి 25న బార్సెలోనాలో ఈ ఫోన్‌ను విడుదల చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. స్పెయిన్‌లో మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండబ్ల్యుసి) 2018 ప్రారంభానికి ఒక్క రోజు ముందు అన్‌ప్యాక్‌డ్ పేరుతో జరగనున్న కార్యక్రమంలో గెలాక్సీ ఎస్9ను విడుదల చేయనున్నట్లు శాంసంగ్ తెలిపింది. గెలాక్సీ ఎస్9కి సంబంధించిఒక టీజర్‌ను కూడా సంస్థ ట్విట్టర్‌లో విడుదల చేసింది. ఎస్9తో పాటు ఎస్9 ప్లస్‌ను కూడా సంస్థ అదే రోజు విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో శాంసంగ్ నుంచి వచ్చిన గెలాక్సీ ఎస్ 8, ఎస్8 ప్లస్‌లకు ఎస్ 9 చాలా దగ్గరగా ఉండే అవకాశం ఉందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. ఫింగర్ ప్రింట్ స్కానర్, డిజైన్‌లో కొద్దిపాటి తేడాలు ఉండే అవకాశం ఉంది.

జియో 4జి ఫీచర్ ఫోన్

కస్టమర్లకు బంపర్ ఆఫర్



న్యూఢిల్లీ : జియో 4జి ఫీచర్ ఫోన్‌ను వాడుతున్న వినియోగదారులకు శుభవార్త. దేశీయ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన జియో ఫోన్ ఇతర కంపెనీలకు చుక్కలు చూపిస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని రకాల షరతులతో ఈ ఫోన్ అత్యంత తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చింది. కాగా, రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రిలయన్స్ జియో తన 4జి ఫీచర్ ఫోన్ యూజర్ల కోసం రూ. 49 ప్లాన్‌ను ఆవిష్కరించింది. దీనిలో ఉచిత వాయిస్ కాల్స్, 1జిబి 4జి డేటాతో పాటు 28 రోజుల వాలిడిటీ ఉంటుంది. అదే విధంగా, వారి కోసం రూ. 11, రూ. 21, రూ. 51, రూ. 101 ధరల్లో డేటా యాడ్ ఆన్ ప్లాన్‌లను జియో ప్రకటించింది. ఈ ప్లాన్లను జియో తన అఫిషియల్ సైట్‌లో పొందుపరిచింది.

ఆధార్ చిక్కులు

- **26 వేల మందికి అందని రేషన్**
- **రాజధాని ఢిల్లీలో పరిస్థితి**



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నగరంలో నిరుపేదలు ఆధార్ కష్టాలు అనుభవిస్తున్నారు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 15 లక్షలకు పైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వారిలో 98 శాతం మందికి జనవరి నెల రేషన్ సరకులు సక్రమంగానే లభించాయి. మిగిలిన రెండు శాతం మందికి ఆధార్ డేటాతో వేలి ముద్రలు సరిపోలేదు. దీనితో 26,201 కుటుంబాలకు బియ్యం, గోధుమలు అందలేదు. అత్యధిక బాధిత కుటుంబాల్లో పోషణ భారాన్ని కేవలం ఒక వ్యక్తి మోస్తున్నారు. అటువంటి కుటుంబాల నెలసరి ఆదాయం రూ. 5,000కు మించడం లేదు. దీనితో వీరు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 2,255 ప్రభుత్వ రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటన్నిటిలోనూ ఈ నెల 1 నుంచి ఆధార్ కార్డు ఆధారిత ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్స్ (ఇ-పోస్) పరికరాలను ఏర్పాటు చేశారు. రేషన్ కార్డు హోల్డర్ల కుటుంబ సభ్యుల వేలి ముద్రలను ఆధార్ డేటాతో సరిచూసి, రేషన్ సరకులను ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు ఇంటర్నెట్ అవసరం. కనెక్టివిటీలో సమస్యలు, వేలిముద్రల సరిపోలకపోవడం వంటి సమస్యల వల్ల 26,201 కుటుంబాలకు రేషన్ సరకులు ఈ నెలలో అందలేదు. ఇటువంటి బాధితులకు ఈ నెల 15 నుంచి ఐరిస్ స్కాన్ చేసి, వన్ టైమ్ పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేస్తామని ఢిల్లీ ప్రభుత్వ అధికారులు చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఈ హామీ ఆచరణలోకి రాలేదు. దీనితో బాధితులందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. కిలో బియ్యం రూ. 3, కిలో గోధుమలు రూ. 2కు రేషన్ దుకాణాల్లో లభించేవని, ఆధార్ డేటాతో ఎదురవుతున్న సమస్యల వల్ల తాము కిలో బియ్యం రూ. 35కు పైగా, కిలో గోధుమలు రూ. 20కి పైగా చెల్లించి కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు.

కన్నడ ఉద్యోగులకు జీతాల పెంపు

బెంగళూరు: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బంపర్ బొనాంజా ఇవ్వనుంది. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం వచ్చే నెలలో 24 నుంచి 30శాతం పెంచనున్నట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 6.2లక్షల ఉద్యోగులు, పింఛనుదారులకు ఈ బడ్జెట్‌లో 24 నుంచి 30శాతం వరకు వేతనం పెంచనుందని ప్రభుత్వ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జీతాలు పెంచాలని, వారంలో ఐదు పనిదినాలు మాత్రమే ఉండాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి ఆరు రోజులు పనిదినాలు ఉన్నాయి.

భారత్ అంటే బిజినెస్

ఇదే టాప్ హ్యాష్‌ట్యాగ్

వాషింగ్టన్ : దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేత్తల సదస్సు నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో భారత్ పేరు మారుమోగిపోయింది. భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఆయన ప్రసంగం గురించి నెటిజన్‌లు ఎక్కువగా మాట్లాడుకున్నారు. సదస్సులో నరేంద్ర మోడీ తన ప్రసంగంలో భారత్ అంటే బిజినెస్ అని వెల్లడించిన సంగతి తెలిసిందే. దావోస్ సదస్సుపై సోషల్ మీడియాలో చేసిన సర్వే ప్రకారం, 'భారత్ అంటే బిజినెస్' అనే హ్యాష్‌ట్యాగ్‌ను ప్రజలు ఎక్కువగా ఉపయోగించినట్లు అమెరికాకు చెందిన టాక్‌వాకర్ అనే అనలిటిక్స్ కంపెనీ వెల్లడించింది.

ప్రపంచ ఆర్థిక సదస్సుకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువగా ఏ అంశాలపై ప్రజలు చర్చించారనే విషయమై ఈ కంపెనీ సర్వే నిర్వహించింది. హ్యాష్‌ట్యాగ్స్‌లో భారత్ అంటే బిజినెస్ టాప్‌లో నిలిచింది. దీనిని నెటిజన్‌లు 39,251 సార్లు ప్రస్తావించారు. తదుపరి స్థానంలో మహిళలు అనే హ్యాష్‌ట్యాగ్‌ను 35,837 సార్లు, అమెరికా ఫస్ట్ అనే హ్యాష్‌ట్యాగ్‌ను 31,449 సార్లు, సంపద అనే హ్యాష్‌ట్యాగ్‌ను 22,896 సార్లు, ఎఐ అనే హ్యాష్‌ట్యాగ్‌ను 19,018 సార్లు, ప్రపంచీకరణ హ్యాష్‌ట్యాగ్‌ను 16,513 సార్లు, వాతావరణ మార్పులు హ్యాష్‌ట్యాగ్‌ను 15,477 సార్లు, ఫేక్‌న్యూస్ హ్యాష్‌ట్యాగ్‌ను 13,567 సార్లు ప్రస్తావించారని టాక్‌వాకర్ వెల్లడించింది.

ఈ సదస్సు నేపథ్యంలో సోషల్ మీడియాలో అత్యంత ఎక్కువగా ప్రస్తావించిన వ్యక్తి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అట. ఆయన పేరును దాదాపు 2.73 లక్షల సార్లు ప్రస్తావించారని కంపెనీ తెలిపింది. తరువాత రెండవ స్థానంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారు. 62,227 సార్లు



మోడీ పేరు వచ్చింది. ఆ తరువాతి స్థానాల్లో వరుసగా ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రన్ (40,975), బ్రిటిష్ ప్రధాని థెరిసా మే (27,791), కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో (25,809), జర్మనీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ (23,897), బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్(13,573) ఉన్నారు. ఈ ఏడాది దావోస్ అని 2.2 మిలియన్ల సార్లు ప్రస్తావించగా, గత ఏడాది 7,95,000 సార్లు ప్రస్తావించారట.

పురుషులకు కూడా ఉచిత గ్యాస్ కనెక్షన్

- **ఎంయువై పథకం కింద అందించే యోచనలో ప్రభుత్వం**
- **ఇప్పటి వరకు ఈ పథకంలో మహిళ మాత్రమే అర్హురాలు**
- **మహిళ లేని నిరుపేద కుటుంబంలోని పురుషుడిని పథకంలో చేర్చనున్న ప్రభుత్వం**

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) పథకాన్ని 2016 మే 1న ప్రధాని నరేంద్ర మోడీ ఉత్తర ప్రదేశ్‌లోని బాలియాలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 3.31 కోట్ల నిరుపేద (బిపిఎల్) కుటుంబాల్లోని మహిళలు లబ్ధి పొందారు. అయితే ఇప్పటి వరకు ఈ పథకంలో మహిళను మాత్రమే అర్హురాలిగా గుర్తించిన ందున వారి పేరుతోనే గ్యాస్ కనెక్షన్ మంజూరు చేశారు. అయితే, ఇకపై మహిళ లేని లేదా మహిళ అనారోగ్యంగా ఉన్న నిరుపేద కుటుంబంలోని పురుషుడి పేరుతో



కూడా గ్యాస్ కనెక్షన్, సిలిండర్ అందజే యాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథ కంలో అర్హులై ఉండాలంటే సామాజిక- ఆర్థిక కుల గణనలో పేరు ఉన్నవారై ఉండాలి. అందుకు అనుగుణంగా చమురు మంత్రిత్వశాఖ సామాజిక- ఆర్థిక కుల గణన జాబితాలో వారి పేర్లను చేర్చనున్నది. ప్రస్తుతం పిఎంయువై పథకానికి రూ. 4800 కోట్ల బడ్జెట్ ఉండగా దీనిని 8 వేల కోట్లకు పెంచాలని కేంద్ర కేబినెట్‌ను మంత్రిత్వశాఖ కోరనున్నది.

రూ. 50 ఫేక్ నోట్ల చలామణి



హైదరాబాద్ : ఇప్పటి వరకు పెద్ద నోట్లకే పరిమితమైన దొంగ నోట్ల దందా చిన్న నోట్లకు కూడా పాకింది. రూ. 50 నోట్ల ఫేక్ కరెన్సీ యథేచ్ఛగా చలామణి అవుతోంది. రూ. 2 వేలు, రూ. 500 నోట్ల మీద నిఘా ఎక్కువగా ఉండడం, కరెన్సీ కౌంటింగ్ మెషీన్లు కూడా వీటిని పట్టేస్తుండడంతో అక్రమార్కులు రూ. 50 నోట్లపై దృష్టి సారించారు. పెట్రోలః బంకులు, మెడికల్ షాపులు, వస్త్ర దుకాణాలు, వైన్స్, కిరాణా షాపులు, కిళ్లీ బడ్డీలు... ఇలా అనుకూలంగా ఉన్న ప్రతి చోట రూ. 50 దొంగ నోట్లు చేతులు మారుతున్నాయి. తాజాగా చేబ్రోలులోని ఓ షాపు యజమాని ఈ దొంగ నోటును గుర్తించి, నోటును తీసుకోకపోవడంతో విషయం వెలుగు చూసింది. నకిలీ నోటు అచ్చం ఒరిజినల్ నోటుగానే ఉండడంతో అధికారులు కూడా గుర్తు పట్టలేని పరిస్థితి నెలకొన్నది.

ఈ దొంగ నోట్లను ఇలా గుర్తించవచ్చు :

- అసలు నోటు పై భాగంలో చుక్కలు ఉంటాయి.
- దొంగ నోటుపై చుక్కలు లేవు.
- గాంధీ బొమ్మ వైపు ఆర్‌బిఐ పేరుతో వెండి గీత ఉంటుంది.
- దీనిపై అది కనిపించడం లేదు.
- అసలు నోటుకు పక్కన చుక్కలు, పద్మంలాగా ఉంటుంది.
- దొంగ నోటుకు పువ్వు గుర్తు మాత్రమే ఉండి, చుక్కలు లేకుండా ఉన్నాయి.
- కింద వైపు నోటును ముద్రించిన సంవత్సరం ఉంటుంది.
- దొంగ నోటుపై సంవత్సరం లేదు.

గాటెమాలా సుప్రీం కోర్టు

మాజీ ప్రెసిడెంట్ హత్య

గాటెమాలా సిటీ : నగర శివారుల్లో నడి రోడ్డుపై దారుణం జరిగింది. గాటెమాలన్ సుప్రీంకోర్టు మాజీ ప్రెసిడెంట్ జోస్ అర్టురో సియెర్రా (72) ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఆయన రోడ్డు మార్గంలో ప్రయాణిస్తూండగా ఆయనపై దుండగులు కాల్పులు జరిపారు. ఆయనను ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయనకు చికిత్స అందజేస్తూ ఉండగా తుది శ్వాస విడిచారు. 2013 నుంచి 2014 మధ్య కాలంలో జోస్ గాటెమాలన్ సుప్రీంకోర్టు ప్రెసిడెంట్‌గా సేవలందించారు.

ఇవి సరస్సులో తేలియాడే వినూత్న మార్కెట్లు

కోల్‌కతా: ఫ్లోటింగ్ మార్కెట్(తేలియాడే మార్కెట్) గురించి ఎప్పుడైనా విన్నారా.. లేదు కదూ.. కానీ పశ్చిమ్‌బంగా రాజధాని కోల్‌కతాకు వెళ్తే ఈ మార్కెట్ గురించి వినడమే కాదు చూడొచ్చు కూడా.. పశ్చిమ్‌బంగాలోని తూర్పు మెట్రోపాలిటన్ బైపాస్ సమీపంలోని పాటులి వద్ద గల సరస్సులో ఈ తేలియాడే మార్కెట్‌ను ఏర్పాటుచేసింది మమతాబెనర్జీ ప్రభుత్వం. జనవరి 24న ఈ మార్కెట్‌ను ప్రారంభించారు. మొత్తం 150 బోట్లలో 200 మందికి పైగా దుకాణదారులు అక్కడ విక్రయాలు చేపడుతున్నారు. అంతకు ముందు వీరంతా బైపస్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో తమ వస్తువులను అమ్ముకునేవారు. అయితే రోడ్డు వెడల్పు పనుల కారణంగా అధికారులు వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. కొంతకాలం పాటు ఈ చోట, ఆ చోట అమ్ముకోమని చెప్పారు. అయితే దీనికి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ ఫ్లోటింగ్ మార్కెట్‌ను తీసుకొచ్చింది అక్కడి ప్రభుత్వం. బ్యాంకాక్‌ను ఆదర్శంగా తీసుకుని రూ. 9కోట్లతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో దుకాణదారులు ఈ ఆలోచన పట్ల ఆనందం వ్యక్తం చేశారు. నేను ఎప్పుడూ వెనిస్ నగరానికి వెళ్లలేదు. కానీ ఫొటోలు చూశాను. ఇప్పుడు నాకు వెనిస్‌లో ఉన్నట్లుగా ఉంది. ముఖ్యమంత్రి దయ వల్లే ఇదంతా జరిగింది. దేశంలోనే ఇలాంటి మార్కెట్ ఇదే మొదటిది. దీన్ని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తారని నమ్ముతున్నాం.



మెట్రో రెండో దశ ప్రారంభం

- 5 నెలల్లో ఫైనల్ డీపీఆర్ సిద్ధం
- కొత్త మెట్రో రైలు పాలసీని అనుసరించి రెండో దశ
- విమానాశ్రయంతో అనుసంధానం కీలకం
- మెట్రో రెండో దశపై ప్రారంభమైన కసరత్తు
- ఢిల్లీ మెట్రో ప్రతినిధితో ఉన్నత స్థాయి సమావేశం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: మెట్రో రైలు రెండో దశ ప్రారంభంపై కసరత్తు మొదలైంది. రెండోదశ డీపీఆర్‌ను ఐదు నెలల్లోనే రూపొందించేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. అవసరమైన డిపోలు, స్టేషన్ల నిర్మాణాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశాలనే ప్రధానంగా తీసుకుంటున్నారు. అయితే నిధుల లభ్యత సంక్లిష్టంగా మారనుందని తెలుస్తోంది. ఈ మేరకు ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.డి.శర్మతో హెచ్‌ఎంఆర్ ఎం.డి ఎన్వీఎస్ రెడ్డితో పాటు ఇంజనీరు సమావేశమయ్యారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో మెట్రోను అనుసంధానం చేసే అంశానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. మెట్రో రెండో దశపై ఉన్నత స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. వీలైనంత త్వరగా రెండో దశను ప్రారంభించా లన్న సీఎం కె.చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్) సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ నుంచి ప్రత్యేకంగా నగరానికి వచ్చిన డైరెక్టర్ ఎస్.డి.శర్మతో హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో పాటు ఇంజనీర్లు సమావేశమయ్యారు. ఢిల్లీ మెట్రో ప్రతినిధితో కలిసి రెండు రోజులుగా నగరంలోని మెట్రో పరిధిని విస్తరించే ప్రాంతాల్లో పర్యటించారు. రెండో దశ విస్తరణపై సుదీర్ఘ చర్చల అనంతరం మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ మొదటి దశకు అనుసంధానంగా రెండో దశ ఉం టుందని, అయితే నిధుల లభ్యత ఎంతో క్లిష్టంగా ఉంటుందని తెలిపారు. మొదటి ద శ కంటే రెండో దశకు నిధులు సేకరించడం సవాల్‌గా మారిందన్నారు. ఏయే మార్గా ల్లో ఎంతమంది ప్రయాణించే అవకాశం ఉందన్న అంశంపై ఢిల్లీ మెట్రో అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారన్నారు. మెట్రో రెండో దశలో అవసరమైన డిపోలు, మెట్రో స్టేషన్‌ల నిర్మాణం ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపైనే ప్రధానంగా చర్చ జరిగిందన్నారు. కాగా సీఎం కేసీఆర్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో మెట్రో రైలు అనుసంధానం చేసే విషయానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. దాన్ని పరిగణలోకి తీసుకునే రెండోదశను విస్తరించాలని నిర్ణయించామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రెండో దశ డీపీఆర్‌ను 5 నెలల్లోనే రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, సరికొత్త పరిజ్ఞానంతో నిర్మాణాలు చేపట్టేందుకు ఉన్న



అవకాశాలను డీపీఆర్‌లో పొందుపర్చి అమలు చేస్తామని చెప్పారు. ఆర్థిక వనరులు, నిధుల సేకరణ కోసం ఇప్పటికే దేశ, విదేశీ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందన్నారు. సమావేశంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.డి.శర్మతోపాటు హెచ్‌ఎంఆర్ చీఫ్ ఇంజనీర్లు డి.వి.ఎస్.రాజు, లక్ష్మణ్, పంచారం, సూపరింటెండింగ్ ఇంజనీర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, వినోద్‌కుమార్, జీఎం రాజేశ్వర్, డీసీపీ బాలకృష్ణ పాల్గొన్నారు.

రాజధాని విద్యార్థులకు
ఉచిత విద్యా పథకం

వెలగపూడి, సూర్య బ్యూరో : రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ జరిపిన సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీల్లో ఒకటైన ఉచిత విద్యాపథకంలో భాగంగా 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీఆర్డీయే కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. 2016-17 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించి 10 సంవత్సరాల వరకు ఈ పథకం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కులమతాలు, ఆదాయంతో నిమిత్తం లేకుండా అమరావతి రాజధాని నగర పరిధిలోని 29 గ్రామాల్లో 2014, డిసెంబర్ 8 నాటికి నివసిస్తున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. గతంలో ఏ విద్యాకోర్సు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందనివారే దీనికి అర్హులన్నారు. హాజరు శాతం 75 శాతంపైన ఉండాలని, ఆధార్ సంఖ్య లేదా రేషన్ కార్డు కానీ కలిగి ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ (పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, వృత్తివిద్య, విశ్వవిద్యాలయ కళాశాలలు) విద్యాసంస్థల్లో కన్వీనర్ కోటాలో ఎ క్యాటగిరీ ద్వారా సాంకేతిక, మేనేజ్‌మెంట్, వృత్తివిద్యా కోర్సులను చదువుతున్న రాజధాని విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. పైన పేర్కొన్న అర్హతలున్న వారు వెబ్‌సైట్‌లో తాము విద్యనభ్యసిస్తున్న కళాశాలల ప్రిన్సిపల్స్ ద్వారా తమ పేర్లను వచ్చే నెల 28వ తేదీలోగా నమోదు చేయించు కోవాలని శ్రీధర్ కోరారు.

ప్రజల గోడు వింటూ ముందుకు సాగుతున్న జగన్

- సూళ్లూరుపేట నియోజకవర్గం ఓజిలిలో ఘనస్వాగతం
- గుర్రంకొండలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ
- ఆర్మేనుపాడులో పార్టీ జెండాను ఆవిష్కరించిన జగన్
- గూడూరు నియోజకవర్గంలోకి చేరుకున్న పాదయాత్ర
- నేడు కొండగుంట నుంచి పాదయాత్ర ప్రారంభం
- గూడూరు కోర్టు సెంటర్‌లో బహిరంగ సభ
- 980.5 కిలోమీటర్ల దూరం పూర్తిచేసుకున పాదయాత్ర

నెల్లూరు, మేజర్‌న్యూస్ః ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవాలనే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగుతోంది. 72వ రోజు శనివారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఓజిలి మండలం చిలమానుచేను క్రాస్‌రోడ్డు నుంచి వైఎస్ జగన్ పాదయాత్రను ప్రారంభించారు. ప్రజల గోడు వింటూ ముందుకుసాగుతున్న జగన్ గుర్రంకొండలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అటు నుంచి ఆర్మేనుపాడు చేరుకున్న ఆయనకు ప్రజలు, మహిళలు పెద్దసంఖ్యలో ఘనస్వాగతం పలికారు. ఆర్మేనుపాడులో వైఎస్ జగన్ పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం భోజన విరామం తర్వాత కాంద్ర గ్రామం దగ్గర గూడూరు నియోజకవర్గంలోకి పాదయాత్ర అడుగుపెట్టింది. అక్కడి నుంచి వెంకటేశుపల్లి మీదుగా తిమ్మసముద్రం క్రాస్ రోడ్డు వరకు వైఎస్.జగన్ ప్రజాసంకల్పయాత్ర సాగింది. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 73వ రోజు ప్రజాసంకల్పయాత్ర షెడ్యూల్ ఖరారు అయింది. ఆదివారం ఉదయం ఆయన కొండగుంట నుంచి పాదయాత్రను ప్రారంభించనున్నారు. అక్కడ నుంచి పాలిచెర్ల, గాంధీనగర్ చేరుకుంటారు. భోజన విరామం అనంతరం ఇందిరమ్మ కాలనీ మీదగా గూడురు కోర్టు సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభలో వైఎస్ జగన్ ప్రసంగిస్తారు. నెల్లూరు జిల్లా గూడురు నియోజకవర్గం తిమ్మసముద్రం క్రాస్ వద్ద వైఎస్ జగన్ 72వ రోజు



ప్రజాసంకల్పయాత్రను ముగించారు. ఇవాళ ఆయన 14.7 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. గుర్రంకొండ, ఆర్మనుపాడు, కాంద్ర, వెంకటేశుపల్లి మీదగా తిమ్మసముద్రం క్రాస్ వరకూ ప్రజాసంకల్పయాత్ర కొనసాగింది. ఇప్పటివరకూ వైఎస్ జగన్ 980.5 కిలోమీటర్లు నడిచారు.

నేను రైతు పక్షం



(అనంతపురంనుంచి సూర్య పొలిటికల్‌బ్యూరో ప్రత్యేక ప్రతినిధి) : తాను ఎవరికీ తొత్తులా వ్యవహరించడంలేదని సినీ నటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సిద్ధాంతాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తానని, అంశాలను బట్టి మద్దతు ఇస్తానని తెలిపారు. చలోరె చలోరె చల్ కార్యక్రమంలో భాగంగా శనివారం అనంతపురం వచ్చిన ఆయన జనసేన పార్టీ కార్యాలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. 2019లో ఎవరికి మద్దతు పలుకుతానో అనేది ప్రతిఒక్కరి మనసుల్లో ఉంది. ఎవరైతే రైతుకు వెన్నుదన్నుగా ఉంటారో వారికి అండగా ఉంటా. రైతన్న కన్నీరు ఎవరు తుడుస్తారో వాళ్లకు అండగా ఉంటా. అనంతరం జిల్లా అభివృద్ధికి ఎలా అండగా నిలబడతారో, మహిళలకు ఎలా అండగా ఉంటారో, మా గౌరవ మర్యాదలను ఎలా కాపాడగల్గుతారో చెప్పే జాతీయ లేదా ప్రాంతీయ పార్టీలకే మద్దతు పలుకుతా. ఓటు బ్యాంకు రాజకీయాలు ఎప్పుడూ చేయను. సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుదాం. సీమ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా. రైతులకు జనసేన అండగా ఉంటుంది. కరువు సమస్యలపై అధ్యయనం చేస్తా. పరిష్కారాల కోసం కేసీఆర్, చంద్రబాబులను కలుస్తా. నేను ఎవరికీ తొత్తునుకాను. రాజకీయాల్లో నాకు శత్రువులంటూ ఎవరూ లేరు. అంశాలను బట్టి మద్దతు ఇస్తా. రాయలసీమ అభివృద్ధి కోసం పాటుపడతా. సీమ సమస్యలపై ఓ బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీని కలుస్తాం. ఎన్ని కష్టాలు ఎదురైనా రాజకీయాల్లోనే ఉంటా, ఓటు బ్యాంకు రాజకీయాలకు నేను దూరం. నా పని నచ్చితేనే ఓటువేయమని అడుగుతా, ఇకనైనా పోరాటం చేయకపోతే కరువు దూరం కాదు, రైతులకు వెన్నుదన్నుగా ఉండేవారికి అండగా ఉంటా, జిల్లాలో చాలా సమస్యలున్నాయి. సమస్యలకు పరిష్కారం చూపి, ప్రభుత్వం వలసలు నివారించాలి," అని కోరారు. జిల్లాలో కరువు నివారణపై పార్టీలకు అతీతంగా స్పందించాలని పిలుపునిచ్చారు. రైతే రాజు కావాలి బానిస కాదు అని పేర్కొన్నారు. ఎక్కువ కరువు మండలాలు ఈ జిల్లాలోనే ఉన్నాయన్న పవన్ రైతుల సమస్యలపై గళమెత్తడానికి లక్షమంది సైన్యం కావాలన్నారు. జీఎస్టీ భారంపై ప్రధానితో మాట్లాడతానని చెప్పారు.


మొదటి పేజీ తరువాయి

ఏపీలో సృజనాత్మక కేంద్రం

సదస్సు ఇదన్నారు. తాను ఇప్పటి వరకు 14 సార్లు ఈ సదస్సుకు వెళ్లానని చెప్పారు. 20 ఏళ్ల తరువాత భారత ప్రధాని ఈ సదస్సుకు హాజరయ్యారన్నారు. ప్లీనరీలో మాట్లాడిన తొలి భాతర ప్రధాని నరేంద్ర మోదీ అని తెలిపారు. 4వ పారిశ్రామిక విప్లవం, టెక్నాలజీ, వ్యాపారం, పరిశ్రమలు తదితర రంగాలకు సంబంధించి కొత్తకొత్త అంశాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. భారత్ అత్యంత శక్తివంతమైన దేశం, ఇక్కడ అవకాశాలు ఎక్కువ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో స్ట్రాంగ్, ఇక్కడ ఇంగ్లీష్ మాట్లాడేవారు అధికంగా ఉండటంతోపాటు అతి పెద్ద మార్కెట్ కలిగి ఉందని అందువల్ల ప్రపంచం మొత్తం భాతర్ వైపు చూస్తోందని చెప్పారు. ఈ పర్యటనలో రెండు ఎంఓయులు జరిగినట్లు, 25 ద్వైపాక్షిక సమావేశాలలో పాల్గొన్నట్లు వివరించారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించి 50 సంస్థలు మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఆసక్తి వ్యక్తీకరణ లేఖలు) ఇచ్చినట్లు తెలిపారు. దావోస్ లో భారత్, ఆంధ్రప్రదేశ్ ఆకర్షణీయంగా నిలిచాయని, తాము ముఖ్యమైన అన్ని అంశాల్లో పాల్గొన్నామని చెప్పారు. యుపీఎల్ లిమిటెడ్ కంపెనీ గ్లోబల్ సీఈవో జై షరోఫ్ తో సమావేశమైనట్లు తెలిపారు. వర్షం పడకపోయినా సాగు నీటికి ఉపకరించే ఒక ఉత్పత్తిని యూపీఎల్ సంస్థ రూపొందించినట్లు తెలిపారు. భూమిలోని నీటిని గ్రహించి క్షామం ఏర్పడిన సందర్భంలో నెమ్మదిగా నీటిని విడుదల చేసే ఉత్పత్తి ఇదని, దీనిని మన రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టడానికి వారిని ఏపీకి ఆహ్వానించినట్లు చెప్పారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామని, పెట్టుబడులు రాబట్టడానికి, పరిశ్రలమ ఏర్పాటుకు ఎంతో కృషి చేయడంతోపాటు కష్టం, తెలివితేటలు, అధికారులు, ఉద్యోగుల నిబద్ధతతో పనిచేయడం వల్ల రెండంకెల వృద్ధి రేటు సాధించామని, వ్యవసాయ రంగంలో అద్వితీయమైన వృద్ధి రేటు సాధించామన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభాన్ని నివారించగలిగితే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ బెంచ్ మార్క్ తీసుకున్నట్లు తెలిపారు. ఒక్క కాల్ తో ఎటువంటి సమస్య అయినా పరిష్కారం అయ్యే విధానం ప్రవేశపెట్టామని, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రయోగంగా పేర్కొన్నారు. ప్రజల సంతృప్తి పెరిగిందన్నారు. పనులు త్వరగా అవడం, వారి ఫిర్యాదులు పరిష్కారం అవుతుంటనే సంతృప్తి స్థాయి పెరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం 30 శాఖలను అనుసందానం చేశామని, త్వరలో అన్ని శాఖలను ఇందులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రతి రోజూ కొత్త ఆలోచనలతో ముందుకు వెళుతున్నామన్నారు. సాంకేతిక అభివృద్ధితో స్కాలర్ షిప్‌లు, పెన్షన్లలో దుర్వినియోగం తగ్గిందని, గతంలో దెయ్యాలు కూడా పెన్షన్ తీసుకునేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. భూధార్ తో భూమి సమస్యలు కూడా పరిష్కారమవుతాయని చెప్పారు. అంతర్జాతీయ సమితి పర్యావరణ సంస్థ జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. లక్షా 35 వేల ఎకరాల్లో ఈ రకమైన సాగుచేస్తున్నట్లు చెప్పారు. కాలుష్యం లేకుండా, పెస్టిసైడ్స్ తగ్గిస్తూ భూసారం పెంచుకుంటూ, తక్కువ ఖర్చు, ఆరోగ్యాన్ని రక్షించుకునేవిధంగా 2027 నాటికి రాష్ట్రంలో గ్రీన్ అగ్రికల్చర్ ని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో భాగస్వామ్య సదస్సులు నిర్వహించడం ద్వారా దేశంలో ఏ రాష్ట్రానికి రాని పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆటోమొబైల్ రంగంలో 3.7 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. అనంతపురానికి కియా మోటార్స్ రావడం, దక్షిణ కొరియా టౌన్ షిప్ ఏర్పడటంతో అక్కడి వాతావరణం మారిపోయిందన్నారు. బెంగళూరు విమానాశ్రయం మనకి ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. హుద్ హుద్ తుపాను తరువాత విశాఖ పట్నం శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. ఇక్కడ విమాన ప్రయాణికుల సంఖ్య పెరిగిందని చెప్పారు. ఈజీ టు బిజినెస్‌లో దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచామని, 21 రోజుల్లో పారిశ్రామిక అనుమతులు ఇస్తున్నామని, పరిశ్రమల స్థాపన విషయంలో అధికారులు పారిశ్రామికవేత్తల వెంటపడుతున్నారని, ఇది తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు కూడా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసిన పనులకు సంబంధించి నాబార్డ్ ద్వారా నిధులు ఇప్పించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 1 నుంచి కాంక్రిట్ పని కూడా ప్రారంభమవుతుందన్నారు. నదులు అనుసంధానం ద్వారా రాష్ట్రమంతటా సాగు, త్రాగు నీరు అందిస్తామని చెప్పారు. పట్టిసీమ ద్వారా నీరందించడంతో ఈ ఏడాది అధిక వ్యవసాయ దిగుబడులు వచ్చాయని, రూ.2500 నుంచి రూ.3000 వేల కోట్ల వరకు అదనపు ఆదాయం లభించినట్లు చంద్రబాబు చెప్పారు.

ప్రకృతితో మమేకం కండి...

ప్రజలందరూ ప్రకృతితో మమేకం కావాలని, ప్రకృతిని ఆరాదించి, ప్రేమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సాంప్రదాయాలు



పాటిస్తూ ప్రకృతిని కాపాడుకుంటూ, దానిపట్ల చైతన్యం తీసుకురావాలన్నారు. అప్పుడే జీవితం ఆనందమయం అవుతుందన్నారు. ఏరువాక పవిత్రమైన కార్యక్రమం అని, అందరికీ తిండిపెట్టే రైతన్నకు సంఘీభావం తెలుపుతూ దానిని పండుగలాగా జరుపుకున్నామని గుర్తు చేశారు. సంపదకు మూలం నీరని అందువల్ల జలసిరికి హారతి ప్రారంభించామన్నారు. పుష్కరాలకు అఖండ హారతి పట్టామన్నారు. వనం మనం కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవం నిర్వహించి పండుగ వాతావరణంలో చెట్లకు పూజలు చేశామన్నారు. ప్రస్తుత, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా అమ్మకు వందనం పేరుతో తల్లిని గౌరవించడం, అభిమానించడం, ప్రేమించడం, ఆరాధించడం వంటివి పిల్లలకు అలవాటు చేస్తున్నామన్నారు. అలాగే ఆదివారం ఉదయం 7 గంటలకు విజయవాడలో సూర్య ఆరాధన కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో, అన్ని గ్రామాల్లో అదే సమయానికి పవిత్రమైన మనసు, పరిశుభ్రతతో సూర్య నమస్కారాలు చేయాలని రాష్ట్ర ప్రజలకు పిలువు ఇచ్చారు. అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదులలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్, వకృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సూర్య నమస్కారాల వల్ల మానసికంగా, శారీరకంగా లాభం చూకూరుతుందని చెప్పారు. ఇక నుంచి ప్రతి ఏడాది రథసప్తమి రోజున గానీ లేక ఆ తరువాత వచ్చే మొదటి ఆదివారం (సూర్యుని ఇష్టమైన రోజు) గానీ ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కుల మత రహితంగా అందరికీ ఆరాధ్య దైవం సూర్యుడని, ఎటువంటి పక్షపాతం లేకుండా అందరి సుఖసంతోషాలకు కారణం అయన అన్నారు. సూర్య కిరణాల ఆధారంగా ఎంతో శాస్త్రీయంగా అరవిల్లిలో దేవాలయం నిర్మించారని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

నదిలో పడిన బస్సు

నదిలో పడిపోయింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 17 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరు తీర్థయాత్రలు ముగించుకుని తిరిగివస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షి చెప్పినదాని ప్రకారం బస్సు అత్యంత వేగంగా వస్తూ డివైడర్‌ను ఢీకొని నదిలో పడిపోయింది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా డ్రైవర్ మద్యం మత్తులో బస్సు నడిపివుంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాబూల్‌లో భారీ పేలుడు



కార్యాలయంలో పని చేస్తున్న వారందరూ సురక్షితంగా ఉన్నట్టు విదేశాంగమంత్రిత్వ శాఖ వెల్లడించింది. బాంబులతో నిండిన అంబులెన్స్ పేలిందని తెలుస్తోంది. పోలీసు చెక్ పాయింట్ వద్ద ఈ అంబులెన్స్ పేలిపోయింది. భారీ శబ్దంతో అంబులెన్స్ పేలిపోయింది. సమీపంలోని భవనాల కిటికీలు కదిలాయి. పెద్ద ఎత్తున పొగ లేచిన దృశ్యాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. అంబులెన్స్ పేలిన స్థలం ఆంతరంగిక మంత్రిత్వ శాఖ, ఐరోపా యూనియన్, హై పీస్ కౌన్సిల్ కార్యాలయాలు ఉన్నాయి. ఆంతరంగిక మంత్రిత్వ శాఖ భవనం సమీపంలో పేలుడు సంభవించిందని ఆంతరంగిక ంత్రిత్వ శాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి నస్రత్ రహిమీ చెప్పారు. కాగా అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో ఉగ్రవాదుల దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమాయక ప్రజలను లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్న ముష్కరులను మట్టుపెట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎంఈఏ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇలాంటి ఉగ్రదాడులను ఎంతమాత్రం సహించేది లేదు. అఫ్ఘానిస్థాన్‌కు భారత్ సాధ్యమైనంత వరకు అన్నివిధాలుగా సాయం చేసేందుకు సిద్ధంగా ఉంటుంది. అని ఎంఈఏ పేర్కొంది. అఫ్ఘానిస్థాన్ ప్రజలకు భారత్ సంఘీభావం తెలిపింది.

పొత్తు పొడిచేనా !

తో పొత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి...'

బీజేపీతో పొత్తు వ్యవహారాలపై ఇంతవరకు సీఎం చంద్రబాబు నేరుగా స్పందించలేదు. బీజేపీ న్యాయకత్వంతో పొత్తు వ్యవహారం తాము చూసుకుంటామని, ఎవరూ మీడియా ఎదుట చర్చించకూడదని గతంలోనే చంద్రబాబు సొంత పార్టీ నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఇప్పుడు చంద్రబాబు అభిప్రాయంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని టీడీపీ ముఖ్యనేతలు అంటున్నారు. తాము బీజేపీతో మిత్రధర్మం పాటిస్తున్నా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతగా తగ్గి ఉందామనుకుంటున్నా దానిని అలుసుగా తీసుకుని పార్టీ, ప్రభుత్వంపై అనవసరంగా బీజేపీ విమర్శలు చేస్తున్నట్లు చంద్రబాబు కూడా భావిస్తున్నట్లు తాజా వ్యాఖ్యల ద్వారా తెలుస్తోందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. విభజన తర్వాత కట్టుబట్టలతో మిగిలిన ఏపీ ఆర్థికంగా నిలబడాలంటే కేంద్ర సాయం తప్పనిసరన్న ఉద్దేశంతో బీజేపీతో పొత్తుపెట్టుకున్నామని చంద్రబాబు మొదటి నుంచి పదేపదే చెబుతున్నారు. అయితే విభజన చట్టంలోని హామీల విషయంలో కేంద్రం నిర్లిప్తంగా వ్యవహరిస్తూ ఉండటం నాలుగేళ్లు గడుస్తున్నా హామీ అమలుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో చంద్రబాబు కూడా అసంతృప్తితో ఉన్నారు. కానీ ఆయన ఇప్పటి వరకు ఎక్కడా బయటపడలేదు. కేంద్రం నుంచి సాధించుకుంటామనే ఉద్దేశంతోనే బాబు ఇప్పటి వరకు రాష్ట్రానికి రావాల్సిన ఆర్థిక సాయం, ప్రాజెక్టుల గురించి పదేపదే లేఖలు రాశారు. కానీ కేంద్ర నుంచి స్పందన మాత్రం అంతంత మాత్రమే ఉంటుందన్న అసంతృప్తి ప్రభుత్వ వర్గాల్లో చాలా రోజుల నుంచి ఉంది. పోలవరం విషయలో కేంద్రం ఇటీవల వరుస అడ్డంకులు సృష్టించింది. ఉద్దేశపూర్వకంగా రాసిన లేఖలు, సృష్టించిన అడ్డంకుల వల్ల ప్రాజెక్టు నిర్మాణం మూడు నెలలపాటు నత్తనడకన సాగింది. ఒకసారి పనులు ఆగితే మళ్లీ పనుల ప్రారంభించడం కష్టంతో కూడుకున్న వ్యవహారమని సీఎం పదేపదే విజ్ఞప్తి చేసినా కేంద్రంలో కదలిక రాలేదు. ప్రొటోకాల్ పక్కన పెట్టి మరీ నాగపూర్ వెళ్లి కేంద్రమంత్రి గడ్కారీతో దీనిపై సంప్రదింపులు చేశారు. కానీ ఆలస్యం మాత్రం జరిగిపోయింది. ఇప్పుడు కొత్తగా నవయుగ కంపెనీకి పనులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబందించిన ఒప్పందాలు పూర్తి కావాల్సి ఉంది. ఇలా అన్నీ విషయాల్లో కేంద్రం మిత్రపక్ష రాష్ట్రంతో వ్యవహరించినట్లు కాక తమకు సంబంధం లేనట్లుగా పరిగణించడం చంద్రబాబును అసహానానికి గురి చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని బీజేపీ నేతలు చేస్తున్న ఓవర్‌యాక్షన్ కూడా చంద్రబాబును ఆగ్రహానికి గురిచేసినట్లు తెలుస్తోంది. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో పొత్తు ఉంటుందా ? లేదా అన్న దానిపై నేతల్లో విస్తృతంగా చర్చ సాగుతోంది.

మొదలైన కొత్త రాజకీయ సమీకరణలు...

టీడీపీ ప్రభుత్వం బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. తాము మిత్రధర్మం పాటిస్తున్నామని, బీజేపీ నేతలు ఎన్ని విమర్శలు చేస్తున్నా తమ నేతలను చాలా వరకు నియంత్రిస్తున్నామన్నారు. బీజేపీ వద్దనుకుంటే తమదారి తాము చూసుకుంటామని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు వైసీపీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పార్టీ మారిన వారికి మంత్రి పదవులు ఇవ్వడంపై విమర్శలు గుప్పించారు. గతంలోనూ బీజేపీ నేతలు టీడీపీ ప్రభుత్వం సవాళ్లు విసిరారు. దమ్ముంటే పొత్తు వదులుకోవాలని సోము వీర్రాజు చేసిన సవాల్ సంచలనం సృష్టించింది. కొద్దిరోజుల క్రితం వైసీపీ అధినేత జగన్ ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తే బీజేపీతో పొత్తుకు సిద్ధమని ప్రకటించారు. ఆ తర్వాత ఏపీలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ నేతలు వైసీపీపై విమర్శలు తగ్గించగా టీడీపీపై మాత్రం వ్యూహాత్మకంగా విరుచుకపడుతున్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన ముఖ్యనేతలు ఢిల్లీలో పొత్తు కోసం లాబీయింగ్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు బీజేపీ వద్దనుకంటే తమదారి తాము చూసుకుంటామని నేరుగా స్పష్టం చేయడం కొత్త సమీకరణలు దారితీసే అవకాశం కనిపిస్తోంది.



ప్రభుత్వ పాఠశాలల్లో మత విద్య వద్దు

విజయవాడ, సూర్యబ్యూరో : ప్రభుత్వ పాఠశాలల్లో మెజారిటీ సంస్క తిని పరిచయం చేయ దం జరుగుతుంది. విద్యను ఒక మతానికి అనుసంధానం చేయడం రాజ్యాంగ విరుద్ధం. అది హక్కుల ఉల్లంఘన అని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూఖ్ షుబ్లీ ఓ ప్రకటనలో అన్నారు. ఈ విధంగా నెమ్మదిగా ఒకరి సంస్క తిని అన్య మతస్థుల పై రుద్దడం జరుగుతుందన్నారు. మత ఆచారాలు, విద్య ఈ రెండు వేరే. ఒకవేళ బలవంతం లేదు, ఇష్టమున్న వాళ్ళు మ్మామే పాటించండి అన్నా కూడా ఇలా చేస్తే మతం, సంస్క తి పేరుతో పిల్లలను విభజించినట్లు అవుతుందన్నారు. ఇది పసిమొగ్గలపై ఆలోచనపై తీవ్రప్రభావం చూపిస్తుందన్నారు. దయచేసి ఈ అనుసంధాన కార్యక్రమం విరమించుకోండి. ఇలా చేస్తే అన్య మతస్తులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ అసమానతలను రూపుమవుడానికే విద్యను ప్రోత్సహిస్తునన్నారు. దయచేసి సామాజిక విద్యను మత విద్యగా మార్చకండి. సంస్క తి, మత విద్య నేర్చుకోవడానికి ఎవరికి వారికి వేద పాఠశాలలు, మదరసాలు, బైబిల్ పాఠశాలలు ఎలాగో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మత విద్య వద్దు అన్నారు. వివిధ సంస్క తుల గురించి మంచిగా అవగాహన ఏర్పరచే, మతసామరస్యం ప్రోత్సహించే సమాచారాన్ని ఇవ్వండి. రాజ్యాంగాన్ని గౌరవించండి. నియంతత్వ ధోరణి మంచిది కాదన్నారు. అసలు మన భారతదేశంలో ఏం జరుగుతుంది? ఇతర మతాలను గౌరవించటం అన్నదమ్ముల వలె కలిసి ఉండటం మన సంప్రదాయం కానీ దానికి విరుద్ధంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 25ను తూట్లు పొడవటం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ పాఠశాలల్లో సూర్య నమస్కారం చెయ్యటంలో ఎటువంటి అభ్యంతరంలేదు కానీ ప్రభుత్వ పాఠశాలల్లో అన్య మతస్తులు ముస్లింలు, క్రైస్తవులు ఉంటారు వారి ఆచారం ప్రకారం సూర్యనమస్కారం చెయ్యరు చెయ్యలేరు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ముస్లింలు మరియు క్రైస్తవులను మినహాయించాలని ఫారూఖ్ షుబ్లీ డిమాండ్ చేశారు.

క్రీడల్లో రాష్ట్రం ఆదర్శం

- 2017-18 ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్
- క్రీడల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- క్రీడలకు వేదికగా అమరావతి
- మూలపాడులో ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, సూర్య బ్యూరో : 18 రాష్ట్ర జట్టులు, 2 యూనిటెరిటరీస్, 11 ప్రాంతీయ క్రీడా సంస్థలకు చెందిన 8 వందల మంది క్రీడాకారుల భాగస్వామ్యం అత్యుత్తమ స్థాయిలో క్రీడా రంగంలో మౌలిక వసతులను కలగజేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, క్రీడల అవశ్యకతను గుర్తించి చర్యలు తీసుకోవడంలో రాష్ట్రం ఆదర్శంగా నిలువుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం మూలపాడు గ్రామంలోని క్రికెట్ స్టేడియంలో అల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్ 201718 ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయస్థాయికి ధీటుగా మూలపాడు గ్రామంలోని క్రికెట్ స్టేడియంలో అత్యద్భుతంగా తీర్చి దిద్దడం జరిగిందన్నారు. గతంలో కామన్‌వెల్త్ క్రీడలను నిర్వహించామని వాటి నుండి అనుభవాన్ని పొందగలిగామన్నారు. దేశంలో క్రీడలకు ప్రోత్సాహం వుండడంతో పాటు ఒలింపిక్ క్రీడలను నిర్వహించే సామర్థ్యం ఉందని, వాటి నిర్వహణ కోసం అమరావతి సిద్దంగా వుంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒలింపిక్ క్రీడలను నిర్వహిం చేందుకు ముందుకు వస్తుం దన్నారు. పుల్లెల గోపిచంద్‌కు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించామని ఆ అకాడమి ద్వారా ప్రపంచస్థాయి క్రీడాకారులు సైనా సెహ్వాల్ , సింధు, కిడాంబి శ్రీకాంత్ వంటి ఎందరో క్రీడాకారులు రూపు దిద్దు కున్నారన్నారు. అత్యుత్తమ ప్రతిభను చూపే క్రీడాకారులను ప్రోత్సహిం చడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తరవున ఉన్నత ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు.

క్రీడల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడంతో పాటు 16 వేల గ్రామ పంచాయితీలలోను క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి బాలబాలికలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామ పంచాయతీ ల్లోను, మున్సిపల్ వార్డులలోను ప్రతి శనివారం, ఆదివారం ను అన్ని వయస్సుల వారికి క్రీడాపోటీలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం జరిగింద న్నారు. 2017-18 అఖిల భారత సివిల్ సర్వీసు అధికారుల క్రీడా పోటీలలో 34 జట్లు పాల్గొనడం పట్ల వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నా మన్నారు. భవిష్యత్తులో అమరావతి క్రీడలకు అత్యుత్తతమైన వేదికగా నిలపడం జరుగుతుందన్నారు. మొదటి నుంచి తాను క్రీడలను ప్రోత్సహించడం జరుగు తోందని, నిత్య జీవితంలో క్రీడలు, ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమా లలో భాగస్వామ్యం అవ్వాల్సిన ఆవశ్యకత ఉందని అపడే మనం ఆనందం తోను, ఆరోగ్యంతోను జీవించగలుగుతామన్నారు. రాష్ట్రంలో 30 క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడంలో పార్లమెంటు సభ్యులు గోకరాజు గంగరాజు చర్యలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. భారతదేశం క్రీడా రంగంలో చరిత్ర సృష్టించడానికి సిద్దంగా వుందని ప్రతిభకు కొదవలేదని ఆయన అన్నారు.

క్రీడలు, న్యాయ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ అధికారులు, ప్రాంతీయ క్రీడ సంస్థల క్రీడాకారులు క్రికెట్, అథెలిటిక్స్ పోటీలను నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. 175 నియోజకపరిధిలో ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రం అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలలో అంతర్జాతీయ స్థాయి ప్రాంతీయ క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలను రూపుదిద్దేందుకు 10 అకాడమీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. గ్రామీణస్థాయి నుండి నైపుణ్యంగల క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు 6 అకాడమీలు, 4 వాటర్‌స్పోర్ట్ అకాడమీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్లమెంటు సభ్యులు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ జాతీయ క్రీడాపోటీలకు మూలపాడు వేదిక కావడం ఎంతో ఆనందంగా వుందన్నారు. దేశానికి ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగ ప్రోత్సాహంలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "ఇకో టూరిజం" అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు, క్రికెట్ మరియు ఆథ్లెటిక్స్ క్రీడాంశంలో జనవరి 27 నుండి ఫిబ్రవరి 5వరకు క్రికెట్ పోటీలను మరియు జనవరి 30 నుండి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆథ్లెటిక్స్ పోటీలు ప్రతిష్టాత్మకముగా నిర్వహించుకుంటున్నామన్నారు. దాదావు 20 సంవత్సరాల



తరువాత ఈ పోటీలను తిరిగి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీలలో 18 రాష్ట్రాల నుంచి, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి, 11 ప్రాంతీయ క్రీడా సంఘాల నుండి దాదావు 800 మంది క్రికెట్ క్రీడాకారులు మరియు అధికారులు పాల్గొన్నారు. క్రికెట్ పోటీలను మూలపాడులోని అంతర్జాతీయ స్థాయి ఆంధ్ర క్రికెట్ ఆసోసియేషన్ వారి సేడియంలోని రెండు క్రీడా మైదానాలలో ఏర్పాటు చేయడం జరిగింది. వివిధ క్రీడాంశాలలో భాగంగా ఆథ్లెటిక్, ఇతర పోటీలను ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని అధునాతన సింథటిక్ ట్రాక్‌లో ఫ్లడ్ల లైట్స్ వెలుగులోను, విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రి తొలుత జాతీయ పతాకాన్ని అవిష్కరించిన అనంతరం ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పతాకం, శాప్ పతాకాలను అవిష్కరించారు. మార్చి ఫాస్ట్‌ను 34 బృందాలుగా 18 రాష్ట్రాల, 2 కేంద్ర పాలిత 11 ప్రాంతీయ క్రీడా సంస్థల క్రీడాకారులు నిర్వహించారు. క్రీడాంశాలలో పాల్గొంటున్న జట్ల వివరాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఉత్తరప్రదేశ్, పాండిచ్చేరి యుటి, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కర్నాటక, బీహార్, చండీఘర్ యుటి. తమిళనాడు, హార్యానా, మహారాష్ట్ర, కేరళ, చత్తీస్‌ఘడ్గ, ఉత్తరాఖండ్గ, గుజరాత్, ఒడిస్సా, మధ్యప్రదేశ్, 13 ఆర్‌ఎస్‌బిజట్లు , డిల్లీ సెక్రటేరియేట్, సెంట్రల్ సెక్రటేరియేట్ లకు చెందిన 34 జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎన్. శ్రీనివాసులు, కృష్ణా కలెక్టర్ బి. లక్ష్మికాంతం, సిపి గౌతమ్‌సవాంగ్, జాయింట్ కలెక్టర్2 పి.బాబురావు, శాప్ ఎం.డీ పి.బంగా ర్రాజు, ఎ.సీ.పి జి.రామ కృష్ణ, ఎపి ఎన్‌జీవో రాష్ట్ర అద్యక్షులు పి. అశోక్ బాబు, జిల్లా అధికారులు, జి.ఎ.డీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తొలి మ్యాచ్‌లో హిమాచల్ జట్టుపై ఏపి గెలుపు



వెలగపూడి, సూర్య బ్యూరో : మూలపాడులో ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం జరిగిన 20 ఓవర్ల పరిమిత క్రికెట్ మ్యాచ్ లో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి హిమాచల్‌ప్రదేశ్ జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం జరిగింది. నిర్ణీత 20 ఓవర్లలో హిమాచల్‌ప్రదేశ్ జట్టు 91 పరుగులు సాధించగా అతిధ్య ఆంధ్రప్రదేశ్ జట్టు 16.2 ఓవర్లలోనే విజయం సాధిం చింది. మొట్టమొదటి మ్యాచ్‌లోనే ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించడంలో ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర ఐఎఎస్ బ్యాట్‌తో మరియు బాల్‌తో ప్రతిభను చాటి అద్భుత ప్రదర్శనతో కీలక పాత్ర పోషించారు. రవిచంద్ర 4 ఓవర్లు బౌలింగ్ చేసి రెండు వికెట్లు తీసుకోవడమే కాకుండా 15 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకా రులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో రెండు శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. క్రికెట్ పోటీల నేపథ్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు కెప్టెన్‌గా ఎస్ సుబ్రహ్మ ణ్యం వ్యవహరించారు.

31న రామకృష్ణ తీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : శేషాచలగిరుల్లో నెలవైన పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీరామకష్ణ తీర్థ ముక్కోటి జనవరి 31వ తేదీన జరుగనుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి తిరుమల జెఈవో కె.ఎస్. శ్రీనివాస రాజు ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం రామకృష్ణ తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై అధికా రులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఓ మాట్లాడుతూ రామకృష్ణ తీర్థానికి వెళ్లే మార్గాన్ని చక్కగా రూపొందించాలని, అవసరమైన చోట్ల చెక్క నిచ్చెనలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జనవరి 30, 31వ తేదీల్లో ఈ తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యామ్ వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేయాలన్నారు. తీర్థానికి చేరుకున్నాక తినేందుకు వీలుగా భక్తులకు క్యారీ బాగుల్లో పులిహోర పొట్లాలు అందించాలని సూచించారు. ఇక్కడ అన్నప్రసాద వితరణకు ప్రయివేటు వ్యక్తులకు అనుమతి లేదని తెలియజేశారు. ఈ రెండు రోజుల్లో భక్తులకు పంపిణీ చేసేందుకు 15 వేల తాగునీటి ప్యాకెట్లు, వెయ్యి వాటర్ బాటిళ్లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అటవీమార్గంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో టిటిడి ఎస్ఇ-2 రామచంద్రారెడ్డి, ట్రాన్స్‌పోర్టు జిఎం శేషారెడ్డి, సిఎంవో నాగేశ్వం ర్రావు, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి వేణుగోపాల్, క్యాటరింగ్ అధికారి జిఎల్‌ఎన్.శాస్త్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట

- రైతు రుణ మాఫీతో చరిత్ర సృష్టించిన చంద్రబాబు
- ఆర్థిక లోటులోనూ రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ
- శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు
- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు

గిద్దలూరు, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అటవీ శాఖా మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. శనివారం గిద్దలూరు నియోజకవర్గంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన రైతులకు ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగంలో అనేక చర్యలు తీసుకున్నారన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేని సాహసవంతమైన రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక లోటు ఉన్నప్పటికీ రూ 24 వేల కోట్లతో రుణమాఫీ, 12 వేల కోట్లతో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం కార్యక్రమాన్ని చేపట్టి ముఖ్యమంత్రి రైతు పాలిట అపర భగీరథుడు అయ్యాడన్నారు. రాష్ట్రంలో రైతులు సంక్షేమం కోసం ప్రతీ మంగళవారం బుధవారం, పొలం పిలుస్తుందని కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రైతులకు అవసరమైన శాస్త్ర సాంకేతిక పరిజా నాన్ని అందించి అధిక దిగుబడులు సాధించే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రకాశం పశ్చిమ ప్రాంతం చాలా వెనుబడిన ప్రాంతమని, వెలుగొండ ప్రాజెక్టు మొదటి దశను 2018 చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు సాగు నీరు, త్రాగు నీరు అందిస్తామని తెలిపారు. గిద్దలూరులో అటవీశాఖ అతిథి గృహం, పల్లె వనం పార్క్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. దిగువమిట్ట వద్ద ఏకో టూరిజం పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిద్దలూరు నగర పంచాయితీలో 1.62 కోట్లతో స్టేట్ ఫైనాన్స్ నిధులతో మంజూరు అయిన సిమెంట్ రోడ్డుకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతు రథం పథకం క్రింద 60 మంది రైతులకు ట్రాక్టర్లును మంత్రి శిద్ధా పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ఎం అశోక్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే పగడాల రామయ్య, గిద్దలూరు ఎంపిపి కడప వంశీధర్‌రెడ్డి, అర్ధవీడు ఎంపీపీ రవికుమార్, బేస్తవారిపేట ఎంపిపి సూరారెడ్డిలు పాల్గొన్నారు.

31న చంద్రగ్రహణం



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : చంద్ర గ్రహణం కారణంగా ఈ నెల 31వ తేదీన ఉద యం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఆలయ తలుపులు మూసివున్న కారణంగా శ్రీవారి దర్శనం ఉండదని టిటిడి తిరు మల జెఈవో కె.ఎస్. శ్రీనివాస రాజు తెలిపారు. తిరుమల లోని అన్నమయ్య భవనంలో శనివారం జెఈవో మీడియాతో మాట్లాడుతూ జనవరి 31న సాయంత్రం 5.18 గంటలకు చంద్ర గ్రహణం ప్రారంభమై రాత్రి 8.41 గంట లకు పూర్తవుతుందన్నారు. గ్రహణ సమయానికి 6 గంటలు ముందుగా ఆల యం తలుపులు మూసివేయడం ఆనవాయితీగా వస్తోందని, రాత్రి 9.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం, రాత్రి కైంకర్యాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆ తరువాత రాత్రి 10.30 నుంచి 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుందన్నారు. చంద్రగ్రహణం కారణంగా అన్న ప్రసాదాల వితరణ ఉండదని, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లలోకి భక్తులకు అనుమతి ఉండదని జెఈవో తెలిపారు.

నేడు పెన్‌జాప్ పురస్కారాలు

విజయవాడ, సూర్య బ్యూరో : ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘ కార్యవర్గ సమావేశం నగరంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు బడే ప్రభాకర్, సెక్రటరీ జనరల్ డా॥ జి.శరత్ బాబులు తెలిపారు. 28న ఐలాపురం, శ్రీరామ ఫంక్షన్‌హాలులో ఉదయం 10.30 గంటలకి ప్రారంభమయ్యే ఈ సమావేశాలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో విశేష సేవలందిస్తున్న వారికి పెన్‌జాప్ పురస్కరాలను అందించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధి కారులు పాల్గొననున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూత నంగా ఏర్పాటుచేసిన పెన్‌జాప్ అమరావతి కేపిటల్ రీజియన్ కార్యవర్గాన్ని సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానితులు, పెన్‌జాప్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కరీంనగర్ కరవు ఎరుగని జిల్లాగా మారుతుంది

- నాలుగు ప్రాజెక్టులు పూర్తి అయితే జిల్లాకు నీటి కొరత ఉండదు
- రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్



కరీంనగర్ -సూర్యప్రతినిధి: కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసుకుని వచ్చే వర్షాకాలం నుండి ఎస్సారెస్పి నీటితో కరీం నగర్ కరువు ఎరుగని జిల్లాగా మారుతుందని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలో నిర్మిస్తున్న మేడి గడ్డ, సుందిళ్ల, అన్నారం, తుపాకుల గుడెం నాలుగు ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి అయితే కరీంనగర్ జిల్లాకు నీటి కొరత ఉండదని ప్రతి ఎకరానికి నీరు అంది సస్యశ్యామలం అవుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద మానవ ప్రయత్నం ప్రాజెక్టుగా గుర్తింపు పొందిందని వచ్చే వర్షాకాలం వరకు పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సమాతంతరంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కొత్త రాష్ట్రంలో ప్రజలు ధరఖాస్తులు ఇచ్చి దండంపెట్టె రోజులు పోయాయని అన్నారు. ప్రభుత్వమే ప్రజల అవసరాలను గుర్తించి వేల కోట్లతో డ్రైనెజిలు, రోడ్లు, మిషన్ భగీరథ వంటి మొదలగు ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులే పర్యవేక్షించుకోవాలని, నాణ్యతతో పనులు జరిగేలా నిఘా పెట్టాలని సూచించారు. పేద రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్య సేవలందించుటకు వేల కోట్లు నిధులు మంజురు చేస్తామని తెలిపారు. అన్ని పాఠశాలలకు ప్రహారి గొడలు, మరమ్మత్తులు, లైట్లు, గేట్లు, టాయిలెట్లు బ్లాకులు నిర్మాంచామని తెలిపారు. పాత పైపులైన్ల ద్వారా వచ్చే వేసవిలో నీటిని వాడుకోవాలని,వచ్చే జూన్‌లోగా ఇంట్రావిలేజ్ పనుల కింద కొత్త పైపులైన్లు అమర్చి ఇంటింటికి త్రాగునీరు అందిస్తామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకంలో గెజిటెడ్ ఆఫీసర్ సంతకాన్ని తొలగించి పెండ్లి రోజు చెక్కులు అందచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, హర్టికల్చర్, విద్య, ఎస్సారెస్పి, గ్రామీణ అభివృద్ధి, ఇరిగేషన్, వైద్యంశాఖలపై సమీక్షించారు. ఈ సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ, అధ్యక్షతన వహించగా రాష్ట్ర సంస్కృతిక సారధి రసమయి బాలకిషన్, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, సర్పరాజ్ ఆహ్మద్, దేవసేన, కృష్ణభాస్కర్, జగిత్యాల జేసి రాజేశం, కరీంనగర్, చొప్పదండిశాసన సభ్యులు గంగుల కమలాకర్, బొడిగె శోభ, జడ్పిటిసిలు, ఎంపిపిలు, జిల్లా అధికారులు పాల్గోన్నారు.

3 నుంచి అమరావతి బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు



విజయవాడ, సూర్య బ్యూరో : ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు విజయవాడలో అమరావతి బౌద్ధ సాంస్క తిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఏపీ పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిల ప్రియ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందులో భాగంగా, విశ్వశాంతి కోసం అమరావతి బౌద్ధ సాంస్క తి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అధారిటీ ప్రప్రథమంగా వెయ్యి మంది బౌద్ధ భిక్షువులతో ఇంతటి మహత్కార్యాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ఇది ప్రపంచ రికార్డు కాబోతోందన్నారు. హీనయాన బౌద్ధ ధర్మం వుట్టిన నవ్యాంధ్ర సాంస్క తిక రాజధాని అని చాటి చెప్పడమే ఈ ఉత్సవాల లక్ష్యమని వివరించారు. ఈ ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి భారీగా బౌద్ధ భిక్షువులు, ప్రముఖులు తరలివస్తారని చెప్పారు. వీరంతా అమరావతి బౌద్ధస్తూపంతో పాటు నాగార్జునకొండ, తొట్లకొండ, అనువు, వంటి బౌద్ధారామాలన్నీ సందర్శించడంతో విదేశీ టూరిజానికి ఇది ఎంతో ఉపకరిస్తుందని మంత్రి అన్నారు. ఫిబ్రవరి 3న ఈ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఫిబ్రవరి 4న విశ్వశాంతి కోసం బౌద్ధభిక్షువులు ప్రార్ధనలు చేస్తారని, ఇందులో వెయ్యిమంది బౌద్ధులు పాల్గొంటున్నారని తెలిపారు. ఇందులో బౌద్ధ గురువుల సందేశాలు, సాంస్కతిక ప్రదర్శనలుంటాయన్నారు. ఇంత పెద్ద ఎత్తున బౌద్ధ భిక్షువుల సమ్మేళనం, ప్రార్ధనలు జరగడం ప్రపంచ రికార్డు అన్నారు. ఉత్సవాల్లో డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, బుద్ధ గయ ఆలిండియా భిక్కు సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇ. శివనాగిరెడ్డి, ఆనంద్ బంటి, మేధాంకర థిరో, ప్రొఫెసర్ దమ్మా జ్యోతి, బౌద్ధ గురువు విరాంత, డాక్టర్ మిలింద్ జివానే, డాక్టర్ సుమేద్ థిరో తదితరులు ప్రసంగిస్తారని మంత్రి భూమా అఖిల ప్రియ తెలిపారు.


ఈ బౌద్ధ భిక్షువుల ప్రార్ధనల్లో ప్రజలంతా పాల్గొనవచ్చని, నవ్యాంధ్రలో ఇంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న బౌద్ధ ఉత్సవాలకు ప్రజలందరి సహకారం కావాలని కోరారు. టూరిజం శాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ అమరావతి బౌద్ధ ఉత్సవాల ద్వారా విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది పర్యాటకశాఖలో అభివద్ధి రేటు 11 శాతం పెరిగిందన్నారు. నవ్యాంధ్రకు పర్యాటకుల రాక గణనీయంగా పెరిగిందని, అయితే, విదేశీ పర్యాటకులు ఎక్కువ మంది వస్తే, తద్వారా రాష్ట్రానికి ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. ఒక డే టూరిస్ట్ వల్ల తలసరి 830 రూపాయలు ఆదాయం వస్తే, ఓవర్ నైట్ 3,300 ఆదాయం పెరుగుతుందన్నారు. అదే విదేశీ టూరిస్టుల వల్ల లక్షన్నర వరకు విదేశీ మారకం మనకు లభిస్తుందని మీనా వివరించారు. ఏపీటీడీసీ ఎం.డి. హిమాన్సు శుక్లా మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించే బౌద్ధ ఉత్సవాలకు బెంగళూరు, బుద్ధ గయ, ధర్మశాల, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి తరలి వచ్చే బౌద్ధ భిక్షువుల కోసం వంద బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్య ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం



విజయవాడ, సూర్య బ్యూరో : మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆసియాలోనే అతిపెద్ద బిందు సేద్య ప్రాజెక్ట్ కర్నాటకలోని భాగల్‌కోట్ జిల్లా రాంతాల్ మరోళాలో ఆదివారం నాడు ప్రారంభం కానుంది. ప్రాజెక్టును కర్నాటక జలవనరుల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఇజ్రాయిల్‌కు చెందిన నెటాఫిమ్ సంస్థ సాంకేతిక సహకారాన్ని అందించింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను మేఘా సంస్థ ఐదు సంవత్సరాల పాటు చూడనుంది. ఈ బిందు సేద్య ప్రాజెక్టుకు 2150 కిలోమీటర్లు పైప్‌లైన్ వేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టిసీమ ప్రాజెక్టును అతి తక్కువ సమ యంలో పూర్తి చేసి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన మేఘా సంస్థ ఆసియాలోనే అతి పెద్ద బిందు సేద్య ప్రాజెక్టును నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. మేఘా సంస్థ చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రైతు తమ పొలంలో ఏర్పాటు చేసిన సిలెండర్ ద్వారా నీటిని నేరుగా బిందు సేద్యంతో పంటకు అందించుకోవచ్చు. కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ఏవైనా వ్యర్థాలు వస్తే వాటిని శుభ్రం చేసి పంటలకు అందించే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రాజెక్టులో వినియోగించారు. మేఘా సంస్థ ఐదు సంవత్సరాల నిర్వహణ అనంతరం బిందు సేద్య ప్రాజెక్టును రైతులకు అప్పగించనుంది. ఇందుకు గాను రైతులు ఒకొక్కరు ప్రతి ఏటా ఎకరాకు సుమారు 1300 రూపాయలు వసూలు చేసుకుని బ్యాంకులో భద్రపరుచుకుంటారు. ఐదు సంవత్సరాల తరువాత ఏదైనా అవసరమైన పక్షంలో ఆ మొత్తం నుంచి వినియోగించుకుంటారు.

రైలు దీక్షకు సిపిఐ మద్దతు



విజయవాడ, సూర్య బ్యూరో : విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు కోసం ఉత్తరాంధ్ర చర్చావేదిక తరవున మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చేపట్టిన 48 గంటల రైలుదీక్షకు సిపిఐ మద్దతు తెలువు తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు రామ కృష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వునర్వవస్థీ కరణ చట్టం 2014 లో విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గత ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విశాఖ రైల్వేజోన్ చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. అంతకు ముందు పివి నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో అప్పటి రైల్వే మంత్రి జాఫర్ షరీఫ్ విశాఖ రైల్వే జోన్ ఇస్తామని చెప్పారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఏర్పడి 44 మాసాలు గడుస్తున్నప్పటికీ ఏపీకి రావల సిన విభజన హామీల అమలుకు నోచుకోలేదన్నారు. 2016 మార్చి 16న ఈ విషయమై లోక్‌సభలో కమిటీ వేశామని, కమిటీ పరిశీలన తర్వాత రైల్వే జోన్ విషయం చూస్తా మన్నారు. కాని ఆ కమిటీ ఏం నివేదిక ఇచ్చిందో తెలుప కుండా కేంద్రం కాల యాపన చేస్తున్నదన్నారు. ఒక రాష్ట్రంలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలంటే 600 కిలో మీటర్ల పరిధి ఉండాలి, కాని విశాఖ డివిజన్‌లో 1052 కిలోమీటర్ల పరిధి ఉందన్నారు. విశాఖపట్నంలో రైల్వే వద్ద 782 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. దేశంలో అతిపెద్ద డీజిల్ లోకోషెడ్, వ్యాగన్ వర్క్‌షాప్, కోచ్ డిపో వంటి రైల్వేజోన్‌కు అనువైన సదుపా యాలున్నాయన్నారు. రైల్వేజోన్ ఏర్పాటుకు అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ బిజెపి తన రాజకీయ స్వార్థం కోసం విశాఖ రైల్వేజోన్ ప్రకటించకుండా తాత్సా రం చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి బడ్జెట్ సమా వేశాల్లో విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదన్నారు.

29న టెలి మెడిసిన్ సెంటర్లు ప్రారంభం

విజయవాడ, సూర్య బ్యూరో : విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సౌజన్యంతో పార్లమెంట్ పరిధిలోని 264 గ్రామాల్లాలో ప్రజలకు వైద్యం అందించే కార్యక్రమంలో భాగంగా స్వస్థ కుటుంబం కార్యక్రమం ప్రారంభించి 20000 మందికి అనేక రకాల శాస్త్ర చికిత్సలు, వైద్యం అందించారు. విజయవంతంగా సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల 29న సోమవారం ఉదయం 9 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు టాటా ట్రస్ట్ వారు అందరికి ఆరోగ్యం అందించే విధంగా నియోజకవర్గంలోని మండల కేంద్రంలో మరియు ముఖ్య ప్రాంతాలలో సుమారు 20 టెలి మెడిసిన్ సెంటర్లు ప్రారంభించనున్నారు.

దీని ద్వారా నేరుగా ప్రజలకు వైద్య పరీక్షలు టెలి మెడిసిన్ సెంటర్ ద్వారా నిర్వహించి అవసరమైన మందులు డాక్టర్ ద్వారా సరఫరా చేస్తారు. తదుపరి అత్యవసర సేవలు అవసరమైనప్పుడు రోగిని స్వస్థ కుటుంబం కార్డు ద్వారా కార్పొరేట్ ఆసుపత్రి నందు వైద్య చికిత్సలు చేయిస్తారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు, విశిష్ట అతిథులుగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మాత్యులు దేవినేని ఉమామహేశ్వర రావు, గౌరవ అతిథులుగా నందిగామ శాసన సభ్యులు తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీ శ్రీరామ్ తాతయ్య, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, తిరువూరు మాజీ శాసన సభ్యులు నల్లగట్ల స్వామి దాసు పాల్గొంటారు. పార్లమెంట్ పరిధిలోని గ్రామాల అభి వృద్ధికి ప్రధాన కారణమైన టాటా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్. వెంకటరామన్, టాటా ట్రస్ట్ సౌత్ హెడ్ ఆర్. పవిత్ర కుమార్, స్టార్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంద రేశన్, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్, దేవస్థానాల చైర్మన్లు, అన్ని గ్రామా పంచాయతీల సర్పంచ్‌లు , ఎంపిటిసిలు, జడ్పీటిసిలు, ఎంపీపీలు, టాటా ట్రస్ట్ ఫెసిలిటేటర్లు, కోఆర్డినేటర్లు పాల్గొంటారు.



దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

- దళితుల సంక్షేమానికి అనేక అభివృద్ధి పథకాలు
- అధిక నిధులతో దళిత వాడల్లో అభివృద్ధి పనులు
- కెల్లంపల్లి గ్రామంలో 30 ఏళ్ళ భూ సమస్యను పరిష్కరించిన ఘనత మాదే
- దళితుల సమస్యల పరిష్కారానికే 'తెలుగు దేశం - దళిత తేజం'
- గ్రామ పంచాయితీ ఎస్సీ కాలనీ సభలో పాల్గొన్న మంత్రి శిద్ధా రాఘవరావు



దర్శి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని దళితుల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. శనివారం దర్శి నియోజకవర్గ పరిధిలోని దర్శి గ్రామ పంచాయితీ క్రిస్టియన్ కాలనీలో తెలుగుదేశం-దళిత తేజం కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద పీఠ వేశారన్నారు. రాష్ట్రంలో ద ళితులందరూ పైకి రావాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో దళితులకు కేటాయించిన నిధులను వారి సంక్షేమం కోసం ఉపయోగించడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం దళితులకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. పేద ప్రజలకు ఎన్‌టిఆర్ గృహ నిర్మాణం పథకం కింద పేదలకు పక్కా గృహాలు నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. అమరావతి రాజధానిలో 100 అడుగులు అంబేద్కర్ విగ్రహాన్ని స్మృతి వనాన్ని ఏర్పాటుకు ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారన్నారు. ముండ్లమూరు మండలం కెల్లంపల్లి గ్రామంలో గత 30సం॥లుగా ఎస్సీ ప్రజలు ఎదుర్కొంటున్న భూమి సమస్యలు పరిష్కరించి ప్రజలకు పట్టాలను పంపిణీ చేశామన్నారు.

పిల్లలు ఇద్దరికి చంద్రన్న భీమా పథకం కింద రూ.10లక్షలు రూపాయలు అందించడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సూరె చిన్న సుబ్బారావు, దర్శి ఎంపిపి పూసల సంజీవయ్య, రాష్ట్ర కనీస వేతనాలు అమలు బోర్డ్ డైరెక్టర్ వేమా శోభారాణి, దర్శి జడ్పిటిసి స్టీవెన్, దర్శి సర్పంచ్ జి.సి.గురవయ్య, మండల పార్టీ అధ్యక్షుడు నారపుశెట్టి పిచ్చయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంగా తిరుపతిరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు రవిచంద్ర, పౌలు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రాన్ని రాబందుల్లా దోచుకుంటున్నారు



- చెరకు రైతులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం
- నాలుగేళ్లైనా మాట నిలబెట్టుకోని కేసిఆర్
- ఏడాదిగా దీక్ష చేస్తున్న స్పందించని సర్కార్
- చెరుకు రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం
- మెట్‌పల్లి బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి

కరీంనగర్ -సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్రాన్ని కేసిఆర్ కుటుంబం రాబందుల్లా దోచుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో నిజాం చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని ఏడాది కాలంగా చేస్తున్న రిలే నిరహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం పట్టణంలో భారీ కాన్వాయ్‌తో ర్యాలీ నిర్వహించి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబం తెలంగాణ రాష్ట్రం మీద పడి ప్రజలను రాబందుల్లా దోచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ఆయన నూతన నివాసం ప్రగతి భవన్ నిర్మాణం కోసం వేల కోట్లు ఖర్చు పెట్టుకోవడానికి నిధులు ఉంటాయి కాని, చెరుకు రైతుల సమస్యల పరిష్కరించడానికి నిదులు ఉండవ అని ప్రశించారు. నల్లకారులను తెల్లకారులుగా మార్చుకోవడానికి వందల కోట్లను వెచ్చించారని, అన్నదాతల కడుపు నింపడానికి మాత్రం ఆలోచించడం లేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక వందరోజుల్లోనే నిజాం చక్కెర ఫ్యాక్టరిని తెరిపిస్తామని హామి ఇచ్చిన కేసిఆర్ ఆదమర్చడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో తెరాసా ప్రభుత్వం ఏర్పడిన నుండి సుమారు 3,400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఏ రైతు కుటుంబాన్ని కూడా ఏ నాయకుడు పరామర్శించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని మాయమాటలు చెబుతున్న కేసిఆర్‌కు రైతుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేసిఆర్ కుటుంబ సభ్యుల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఆరోపించారు. కొడుకు కేటిఆర్, అల్లుడు హరిష్‌రావు, కూతురు కవితల అభ్యున్నతి కోసమే వివిధ పథకాలను ప్రారంభించారని అన్నారు. కొడుకు ఐటి మంత్రిగా అన్ని దేశాలు పర్యటిస్తు రాజ్యా బోగాలను అనుభవిస్తున్నారే తప్ప రాష్ట్రానికి ఒరిగింది ఏమి లేదన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా కేటిఆర్ బాగా ధనవంతుడు అవుతున్నాడే తప్ప పేదవాడి ఇంటికి నీటి చుక్క రాలేదన్నారు. మిషన్‌కాకతీయ పథకం ద్వారా అల్లుడు హరిష్‌రావు ఇంట్లోకి నీటి వరదలాగ కమిషన్లు పారుతున్నాయని ఆరోపించారు. కూతురు కవిత రాష్ట్రాంలో అన్ని సెటిల్‌మెంట్లు చేస్తు లాకర్లల లో నింపుతున్నారని అన్నారు. ఈ రాబందుల పాలనలో రాష్ట్రం మొత్తం సర్వనాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్ కేసిఆర్‌ను కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు అన్నారని రైతుల పట్ల అవగాహన పెంచుకోవాలని కాని ఇలా ముఖ్యమంత్రి మన్నలను పొందడం కోసం గవర్నర్ ఇలా మాట్లాడడం సరి కాదన్నారు. గవర్నర్ రాష్ట్రంలో అన్నదాతల కష్టాల గురించి కేసిఆర్‌కు తెలియ చేస్తే బాగుంటుందన్నారు. భూగర్భంలో నీరు లేకున్నా రైతులకు 24 గంటల విద్యుత్తును అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఏ రైతు కూడా 24 గంటల కరెంటును ఉపయోగించుకోవడం లేదని తెలిపారు. పాసుబుక్కులపై కేసిఆర్ పోటో కోసమే భూ ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారే తప్ప రైతు భూ సమస్యల పరిష్కారం కోసం కాదని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో ప్రతి రోజు జీవోలు వెలువడుతున్నాయే తప్ప ఎవరి జీవితాల్లో వెలుగులు నిండడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నారో, ఎంత మందికి తెరాసా ప్రభుత్వం ఏర్పాడ్డాక ఉద్యోగాలు ఇచ్చారో తెలుపాలన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంటికో ఉద్యోగం అమ్మి గొప్పలు చెప్పుకున్న కేసిఆర్ ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. రైతు సంక్షేమమే మ ప్రభుత్వ ధ్యేయం అని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైతుల రక్తాన్ని పీలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 1.50లక్షల కోట్లతో పనులు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం రూ. 400 కోట్లు పెట్టి చక్కెర ఫ్యాక్టరిని నడిపించలేరా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో చక్కెర ఫ్యాక్టరిని తె రిపించ కుంటే ఫ్యాక్టరి ముందు 30వేల రైతులతో ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు ఊర్లలలో బీడి పంచుకొని తెరాసా నాయకులను ఊర్లకు రానివ్వకుండా చేయలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాతల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిజాం చక్కెర ఫ్యాక్టరిని తెరిపిస్తుందని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజి ఎమ్మెల్యే కొమెరెడ్డి రాములు, సుప్రింకోర్టు న్యాయవాది కొమెరెడ్డి కరం, కొమెరెడ్డి విజయ్‌ఆజాద్, చక్కెర ఫ్యాక్టరి సాధన క మిటి చైర్మేన్ గురిజాల రాజారెడ్డి, కౌన్సిల ర్ ఎండి షకీల్, పుప్పాల లింబాద్రి, కాంగ్రెస్ నాయకులు, కోరుట్ల నియోజకవర్గ చెరకు రైతులతో పాటు పలు మండలాలలోని చెరుకురైతులు తదితరులు పాల్గోన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా

- అనుక్షణం టాస్క్ ఫోర్స్ బృందాలు పర్యవేక్షణ
- ఈ ఏడాది 'వనం-మనం' విజయవంతం చేయాలి
- అటవీ శాఖ లక్ష్యాలను అధికారులు అధిగమించాలి
- ఎర్రచందనం వేలం నిర్వాహణ ద్వారా రూ 194 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం
- తిరుపతి, విశాఖపట్నంలో జూ పార్కుల అభివృద్ధికి కృషి
- గిద్దలూరు అటవీ కార్యాలయంలో మొక్కలు నాటిన రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు



గిద్దలూరు, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర అటవీ శాఖామంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. శనివారం గిద్దలూరు అటవీ శాఖ కార్యాలయంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం గిద్దలూరు డివిజన్ అటవీ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 2029 నాటికి 50 శాతం భూ భాగాన్ని పచ్చదనంతో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 100 రోజుల పాటు వనం – మనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అడవులను సంరక్షించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులను అదేశించారు. రాష్ట్రంలో గత రెండు నెలల్లో ఎర్రచందనం వేలం నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి 194 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. అటవీశాఖ డిపోల్లో ఎర్రచందనం నిర్వలు లేకుండా వచ్చే నెలల్లో వేలం నిర్వహించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. వేలంలో సరైన ధరలు రాకపోతే ఎర్రచందనంతో ఫర్నిచర్ తయారు పరిశ్రమను ఏర్పాటు చేసి చైనా, సింగపూర్ దేశాలకు డిమాండ్ మేరకు పంపుతామన్నారు. అటవీ శాఖ పాత పద్ధతులను స్వస్తి చెప్పి నూతన విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అమరావతిలో జూ పార్కును ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. తిరుపతి, విశాఖపట్నంలో జు పార్కులను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. దిగువమిట్టా వద్ద ఏకో వద్ద ఏకో టూరిజం పార్కు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిద్దలూరు అటవీ శాఖ అతిథి గృహం నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గిద్దలూరు అటవీ శాఖ కార్యాలయం మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

పాలేరును పాలేరు కాపు కాస్తుందా!



- తుమ్మలను ఎదుర్కొనే సమ ఉజ్జీ వస్తాడా?
- ఉప ఎన్నికల్లో వచ్చిన ఆధిక్యత నిలుస్తుందా?
- అభివృద్ధి ఆదుకుంటుందా?
- భక్తరామదాసు ఓట్ల వర్షం కురిపిస్తుందా?
- పాలేరు పాత కాలువ మరమ్మతులు అక్కరకు వస్తాయా?

(ఖమ్మం–సూర్యప్రతినిధి) : ఖమ్మంజిల్లా అభివృద్ధిలో కీలక పాత్రపోషిస్తున్న జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఈ సారి పాలేరు కాపు కాస్తుందా? ఆయన పాలేరు నియోజకవర్గ ప్రజలకు తాను పెద్ద పాలేరుగా ఉంటూ సేవచేస్తానని తరుచు చెబుతుంటారు. ప్రజలను ఆయన్ను ఆదరిస్తారా? తిరిగి ఆయన అక్కడ నుంచి గెలుస్తారా? అంటే వెంటనే గెలుస్తారు అనే మాట చెప్పలేక పోతున్నారు పాలేరు ఓటర్లు . ఇంత అభివృద్ధి చేసినప్పటికి గెలుపుపై సందేహాలు ఎందుకు వస్తున్నాయనే దానిపై సమగ్ర పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఆయనకు పోటిలో సమ ఉజ్జీ ఉంటుందా? ఉంటే ఎవరు? ఇప్పటికే కొన్ని పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికి వారు నుంచి మాత్రం సంకేతాలు రాలేదు. ఆయన గెలుపు ఓటములు విపక్షాల నుంచి పోటిచేసే అభ్యర్దులను బట్టి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అభివృద్ధిచేయటంలో ఆయన్ను మించిన నాయకుడులేడంటే అతిశేయోక్తి కాదు. కాని అధికారులు , ఉద్యోగులపై నోరుపారేసుకోవటం, దూరుసుగా ప్రవర్తించటం ఆయనకు ఇబ్బందికరపరిణామంగా పరిణమించే ఆకాశం ఉంది. దీంతో ఆయన వ్యవహరశైలే మైనస్ పాయింట్‌గా ఉంటుందని మరి కొందరు అంటున్నారు. స్వతహగా మంచి వ్యక్తి, కష్టపడే మనస్తత్వం ఉన్న వాడు, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా తిరుగుతుంటారు. అభివృద్ధి కాముకుడు, వ్యక్తిగత పనులకన్నా నలుగురికి ఉపయోగపడే పనులు, కమ్యూ నిటీ అవసరాలు తీర్చేందుకు ఆయన ప్రాధాన్యత ఇస్తారనే పేరు సంపాదిం చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రిగా ఉన్న ఆయన భారీనీటిపారుదల, రోడ్లు భవనాల శాఖలాంటి కీలక శాఖలను నిర్వహించారు. ఆయనకు ఈ రెండు శాఖలపైన సమగ్ర అవగాహన కలిగి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ మంత్రివర్గంలోనూ కీలకమైన రోడ్లు భవనాలశాఖను కేటాయించటంతో జిల్లాలో రోడ్ల నిర్మాణం చేపట్టారు. జాతీయరహదారులను సైతం జిల్లా నుంచి వెళ్ళేలా ప్రణాళికలు రూపొందించారు. తుమ్మల మార్కురోడ్ల ఖమ్మంలో దర్శనమిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా సాగునీరు, తాగునీరు, రోడ్లు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వ ద్వారా నిధులు తెచ్చేందుకు ముఖ్యమంత్రిని సైతం ఒప్పించి అందుకు నిధులు కేటాయింపచేశారు. జిల్లా అభివృద్ధి ప్రధాతగా పేరు సంపాదించుకున్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా ఆయన చేసే హడావుడి పార్టీవాళ్లకు సైతం నచ్చుటంలేదనే విషయం ఆయన దృష్టికి వస్తుందా? లేదా, వచ్చినా అదే కంటిన్యూ చేస్తున్నారా? అనే సందేహాలు కలుగుతున్నాయి. గతంలో సత్తుపల్లి జనరల్ నియోజకవర్గ జనరల్‌గా ఉండగా అక్కడ నుంచే ఆయన ప్రాతినిద్యం వహించారు. పునర్విభజనకు ముందు ఆయన సొంత నియోజకవర్గం కూడా సత్తుపల్లినే . సత్తుపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధిచేశారు. సత్తుపల్లిలో కన్నా పాలేరు ప్రజలు మాటలను పెద్దగా పట్టించుకోరు. పట్టించుకున్నారంటే ఎంత అభివృద్ధి చేసినా లెక్కచేయరు. కనీసం కనికరించరు. పాలేరులో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. నిధుల వరద పారుతుంది. నిధుల వరదతోపాటు అవినీతి కూడా అదే స్ధాయిలో ఉందనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల జరిగిన జక్కేపల్లి ఉప ఎన్నికల్లో గెలుపుకోసం నానా విధాలుగా ఓటర్లను, పోటిచేస్తున్న అభ్యర్దులను ప్రలోభ పెట్టారనే విమర్శలు వెల్లు ఎత్తుతున్నాయి. గతంలో ఖమ్మం నియోజకవర్గంలో రెండు సార్లు పోటిచేసి ఒకసారి గెలుపొందారు. తెలుగుదేశంలో ఉన్న గ్రూపు తగాదాలు రెండవ సారి ఆయన్ను దెబ్బతీశాయి. గ్రామీణ నియోజకవర్గం అంటే మక్కువ ఎక్కువ ఉన్న తుమ్మల పాలేరు ఉప ఎన్నికల్లో ఏరికోరి పోటిచేసి తిరుగులేని ఆధిక్యతతో గెలుపొందారు. అభివృద్ధిని తనదైనశైలిలో ఉరకలు పెట్టిస్తున్నారు. తన మార్కు అభివృద్ధికి నియోజకవర్గంలో బాటలు వేసారు. నీటి రంగంపై ప్రధాన దృష్టి సారించిన తుమ్మల తీవ్ర కరువు మండలంగా ఉన్న తిర్మలాయపాలెం మండలానికి పాలేరు నుంచి భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా నీరు తరలించి, చెరువులకు నీరిచ్చి అక్కడ రైతుల్లో ఆనందం నింపారు. మారుముల గ్రామాలకు సైతంవిశాలమైన తారు రోడ్లు వేయించారు. సుమారు 15 వందల కోట్లు నిధులు ఒక్క పాలేరులోనే ఖర్చుచేసినట్లు తెలుస్తుంది. గతంలో ఎవరు తిరగని విధంగా నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు. కాని స్ధానిక నాయకులను పట్టించుకోవటంలేదనే అభిప్రాయాలు ఉన్నాయి. గతంలో సత్తుపల్లి నియోజక వర్గంలో జిల్లాలో ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి తుమ్మల చేశారు. ఆ అభివృద్ధే శ్రీరామరక్ష అనుకున్నారు. ఆ అభివృద్ధే తనను గెలిపిస్తుందని నమ్మారు. తుమ్మలకు తిరుగులేదని మోజార్టీ కూడా బాగా ఉంటుందని ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు చెప్పారు.

అయినా 2004 ఎన్నికల్లో ఓడిపోయారు. పాలేరు తిరిగి 2004 నాటి సత్తుపల్లి కాకుండా ఉండాలంటే ఆయన కొన్ని జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాల్సిందే . ప్రధానంగా ఎన్ని అభి వృద్ధి పనులు చేయించినా ప్రజలను పలకరించే సందర్బంలో వ్యవహరశైలి మార్చుకోవాలి. క్రింది స్థాయి నాయకుల, కార్యకర్తల మనుసులను గెలుచు కోవాలి. లేకపోతే సత్తుపల్లి ఫలితం పాలేరులో పునరావృతం కావటం ఖాయం.

ఉండవల్లి అప్పుడు ఏం చేశారు

బీజేపీ నేత సోము వీర్రాజు



రాజమండ్రి, మేజర్‌న్యూస్: పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది బీజేపీయేనని ఆ పార్టీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే ఆ ప్రాజెక్టుకు రూ. 4వేల కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. ముంపు మండలాలను ఆంధ్రాలో కలిపింది కూడా బీజేపీయేనని తెలిపారు. "పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌కు ఆంధ్రా అభివృద్ధి గుర్తుకు రాలేదా, పార్లమెంటులో రాష్ట్రాన్ని విడదీసినపుడు అప్పటి ఎంపీ ఉండవల్లి ఏం చేశారు, భద్రాద్రి రాముడు తెలంగాణకు వెళ్ళినపుడు ఉండవల్లి ఏమీ చేయలేకపోయారు ఎందుకు." అని ప్రశ్నించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించిన అనంతరం విశాఖ రైల్వే జోన్ కోసం బీజేపీ యత్నిస్తుందని సోము అన్నారు.


ఉపాధి పథకం కొందరు అవినీతిపరులకు ఉపాధిగా మారిందన్నారు. 2019 ఎన్నికల్లో కూడా నరేంద్ర మోడీయే ప్రధాని అని, ముందస్తు ఎన్నికలపై మోడీదే తుది నిర్ణయం అని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, మద్యం మాఫియాలను అరికట్ట లేకపోతోందని వీర్రాజు విమర్శించారు.

కలసపాడులో ఎమ్మెల్సీ పల్లె నిద్ర



కలసపాడు: కలసపాడులో శనివారం రాత్రి ఎమ్మెల్సీ గోవింద రెడ్డి రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైకాపా జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కోటా నుంచి నీటి శుద్ధి కేంద్రం, వెలుగొండ ప్రాజెక్టు నుంచి రాచ్చెరువుకు నీరు, తెలుగు గంగ ప్రధాన ఎడమ కాలువ నుంచి సగిలేరు కాలువకు నేరుగా నీరందించేలా చూడాలని స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో వెకాపా నియోజకవర్గ సమన్వయకర్త వెంకట సుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు సుదర్శన్, వెకాపా నాయకులు రామకృష్ణారెడ్డి, గురివి రెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సంప్రదాయాలు కాపాడుకోవాలి'



సీతంపేట: ఆచార వ్యవహారాలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని ఐటీడీఏ పీవో శివశంకర్ అన్నారు. సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ హెరిటేజ్ కల్చర్ డే సందర్భంగా ఇంటెక్, ఆర్స్ సంస్థలు సంయుక్తంగా జరిగిన సమావేశంలో పీవో మాట్లాడారు. రాష్ట్రంలో పురాతన, చారిత్రక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాలన్నారు. మ్యూజియంలో ఉన్న పురాతన వస్తువుల చరిత్రను తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇంటెక్ సంస్థ కన్వీనర్ రాధాప్రసాద్, కో–కన్వీనర్ మోహన్‌రావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఆర్స్‌సంస్థ డెరక్టర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు దళిత ద్రోహి

వైసీపీ నేత మేరుగు నాగార్జున




విజయవాడ, మేజర్‌న్యూస్: సీఎం చంద్రబాబు ముమ్మాటికి దళిత ద్రోహి అని వైసీపీ ఎస్సీ సెల్ నాయకుడు మేరుగు నాగార్జున విమర్శించారు. గడిచిన నాలుగేళ్లుగా టీడీపీ పాలన లో దళితులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఎన్నికలు సమీపిస్తుండటంతో దళిత తేజం పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని మండిపడ్డారు. శనివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "హిట్లర్, చంద్రబాబుల పుట్టితేదీలేకాదు, తీరు కూడా ఒక్కటే. నాలుగేళ్ల టీడీపీ పాలనలో దళితులను ఏనాడూ గౌరవించకుండా, అణిచివేసే యత్నంచేశారు. సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారు. అనేక చోట్ల దళితులపై దాడులు జరిగాయి. ఎన్నికల హామీలను తుంగలోతొక్కారు. ఒక్క ఎకరం భూమిని కూడా దళిత కుటుంబాలకు పంచివ్వలేదు. ఇన్ని మోసాలు, దారుణాలకు పాల్పడిన టీడీపీకి అసలు దళిత వాడల్లోకి వెళ్లే అర్హతేలేదు. దళిత ద్రోహి చంద్రబాబు వెంటనే క్షమాపణలు చెప్పాలి." అని మేరుగు నాగార్జున అన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం

ఆరిలోవ: విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం పరిధిలోని 300 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. శ్రీకృష్ణపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర్‌రెడ్డి హాజరు అయ్యారు. 2014 డీఎస్సీ సాంఘిక, గణిత ఉపాధ్యాయులకు వృాఎత్యంతర ట్రెనింగ్ పేరిట శిక్షణ ప్రారంభమైంది. రాష్ట్ర, జిల్లా స్థాయి రిసోర్స్ అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఐదు పాస్‌పోర్ట్ సేవాకేంద్రాలు



వెలగపూడి, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా ఐదు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి డీఎస్ఎస్ శ్రీనివాసరావు వెల్లడించారు. ఇప్పటికే నెల్లూరు, కడప, కర్నూల్ లో పాస్‌పోర్టు సేవాకేంద్రాలుండగా కొత్తగా మరో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. విజయవాడ లో త్వరలో ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. దీంతోపాటు గుంటూరు, ఒంగోలు, చిత్తూరు, అనంతపూర్, విజయ వాడ లలో మరో రెండు నెలల్లో పాస్‌పోర్టు సేవాకేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. పాస్‌పోర్టు సేవలను ప్రజల ముంగిటకు తీసుకువ చ్చేందుకు వీలుగా మార్చి నెలాఖరులోగా విజయవాడలో ప్రాంతీయ పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి వివరించారు.

'అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి'

విశాఖ: విశాఖ ఉక్కు విస్తరణ, ఆధునికీకరణ ద్వారా ఏర్పడిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉక్కు సీఎండీ పి. మధుసూదన్ ఎమ్ఎస్ఎమ్ఈలకు పిలుపునిచ్చారు. ఉక్కు నగరంలో మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఎమ్ఎస్ఎమ్ఈ 21వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు సేకరణలో స్థానిక ఎమ్ఎస్ఎమ్ఈల సహకారంతో ఉక్కు సామర్థ్యం 7.3 మిలియన్ టన్నులకు చేరుకుందన్నారు. 2015–16లో 290 కోట్లు, 16–17లో రూ.415 కోట్లు ఎమ్ఎస్ఎమ్ఈల ద్వారా సేకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖ జాయింట్ డెరెక్టర్ గిరిధర్‌రావు, ఉక్కు డెరెక్టర్లు పి. రాయ్‌చౌదరి, కేసీ దాస్ తదితరులు పాల్గొన్నారు.



మలుపులు తిరుగుతున్న మావోల ఉద్యమం

తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టు ఉద్యమం మలుపులు తిరుగుతోంది. పార్టీని బలోపేతం చేయడం కోసం కొత్త పంథాను అనుసరిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో క్రమంగా పుంజుకునేందుకు పార్టీ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందన్నది సమాచారం. ఇందులో భాగంగా పార్టీలోని వయోవృద్ధులైన మావోలకు స్వచ్ఛందంగా ఇళ్లకు వెళ్లేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో జంపన్న, రజిత తదితరులు పార్టీని వీడటానికి పార్టీ తీసుకున్న నిర్ణయాలేనని తెలియకనే తెలుస్తోంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్రాలకు షాక్ ఇచ్చేలా ఉద్యమం చాపకింద నీరులా విస్తరిస్తోంది. నూతన తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకుడు జగన్ పలుమార్లు బహిరంగ లేఖ రాసిన విషయం విధితమే. ఇదిలావుండగా ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల జోన్ సమీప ప్రాంతాలలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పలువురు మావోయిస్టులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలతో రెండు రాష్ట్రాలలో మావోయిస్టు ఉద్యమం బలపడుతోందన్నది సమాచారం. కొత్త రాష్ట్రాలలో ఉద్యమం బలపడటానికి చాలా అవకాశాలున్నాయి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్థిరత్వాన్ని సాధించకపోవడం. నూతన రాష్ట్రాలు నిధుల సమీకరణ, పాలనా వ్యవస్థ తదితర సమస్యల్లో నిమగ్నమవడం మావోయిస్టు పార్టీ బలోపేతానికి ఉపకరిస్తాయి. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు సాధారణ శాంతిభద్రతలపై దృష్టిసారించడంలోనే ఉండిపోయాయి. ఈ తరహా పరిస్థితులను మావోయిస్టు పార్టీ అవకాశంగా చేసుకుని పార్టీ విస్తరణ దిశగా

తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర విభజన ఉద్యమం నుంచే పార్టీ బలోపేతమవుతూ వస్తోంది. ఈక్రమంలో రెండు రాష్ట్రాల్లో విభజన సమయంలో హోరెత్తిన ఉద్య మాల సమయం నుంచి ముందస్తుగా పార్టీని ఇరు ప్రాం తాల్లో బలోపేతం దిశగా పయనించాయి. కాగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం మావోయిస్టు పార్టీ అండగా నిలిచిందన్నది తెలియంది కాదు. ఈక్రమంలో తెలంగాన రాష్ట్రానికి అనుకూలంగా తెలంగాణ జోనల్ కమిటి నాయకుడు జగన్ బహిరంగంగా పత్రికా ప్రకటనలు చేసిన విషయం విధితమే. ఇదిలావుండగా తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్‌లు పూర్తిస్థాయిలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు,కాగా కర్ణాటక రాష్ట్రా న్ని షెల్టర్ జోన్‌గా చేసుకుని పార్టీ కార్యక్రమాలు చేపడుతోంది. ఇక ఆంధ్రపదేశ్ విషయానికి వస్తే పొరుగు రాష్ట్రాలైన ఒడిశా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కాగా కర్ణాటకాను షెల్టర్ జోన్‌గా చేసుకున్న విషయం విధితమే. రెండు రాష్ట్రాలు కర్ణాటకను షెల్టర్ జోన్‌గా చేసుకుని బలోపేతమవుతున్నాయి. దీంతో ఉద్య మంతోపాటు పార్టీ కార్యక్రమాలు ఊపందుకునే అవకాశాలు సైతం ఉన్నాయి. అయితే 2004వ సంవత్సరానికి ముందు సుమారు నాలుగు దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమం పెద్ద ఎత్తున నడిచింది. కాలక్రమంలో అప్పటి సర్కారు, పోలీసు విధానాలు పార్టీపై ఉక్కుపాదం మోపడంతో మావోయిస్టులు కొంతకాలం పాటు వలసపోయారు. చత్తీస్ గడ్, ఒడిషా, మహారాష్ట్ర, కోల్‌కత తదితర ప్రాంతాలకు వెళ్ళి అక్కడ ఉద్యమాన్ని బలోపేతం చేశారు.

కాగా రెండు రాష్ట్రాలలో ప్రస్తుత నెలకొన్న పరిస్థితుల కారణంగా తిరిగి ఇక్కడికి వచ్చి ఉద్యమాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేంతవరకు మావోయిస్టు పార్టీకి సంబంధించిన ప్రకటనలు, హెచ్చరికలు వస్తూనే వున్నాయి. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది ఆగస్టు సెప్టెంబరు నెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నల్లమల్ల మావోయిస్టు పార్టీ డివిజనల్ కమిటీ మేనేజర్ జాన్‌బాబురావు, అలియాస్ అశోక్‌తోపాటు ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ప్రాంతానికి చెందిన సంఘం తాండాకు చెందిన మరో ఇద్దరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెం దారు. కాగా జాన్‌బాబురావు మావోయిస్టు పార్టీలో 13 సంవ త్సరాలుగా వివిధ హోదాల్లో పనిచేశాడు.

అలాగే నల్లమల్ల ఏరియా కమిటి డిసిఎంగా పనిచేస్తున్న ఆయనపై ఆంధ్ర ప్రదేశ్ సర్కారు రూ.5లక్షల రివార్డు సైతం ప్రకటించింది. తెలంగాణ జిల్లాలోని అమ్రాబాద్ ప్రాంతానికి చెందిన మహి ళా మావోయిస్టు అయిన నాగమణి అలియాస్ భారతితో జాన్ బాబుతో వివాహమైంది. ఆమె ప్రకాశం జిల్లా ఎసిఎంగా ఉద్య మంలో పనిచేస్తోంది. ఆమె ప్రకాశం జిల్లా ఎసిఎం అయి న్పటికీ మహబూబ్‌నగర్ జిల్లా అటవీ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేసింది. నాగమణిపై సర్కారు రూ.4లక్షల రివార్డు ప్రకటించింది. అలాగే శ్యామక్క పార్టీలో చురుకైన పాత్ర పోషించింది. ఆమె అసలు పేరు కవిత. తొగుట ప్రాంతానికి చెందిన ఆమె జన్‌బాబుతో నల్లమల్ల అటవీ ప్రాంతంలో గత 8సంవత్సరాలుగా పనిచేస్తోంది. కాగా వీరంతం నల్లమల్ల అట వీ ప్రాంతంలో ఉద్యమ తీవ్రత కొంతమేర సన్నగిల్లడంతో ఇత ర ప్రాంతాలకు వలస వెళ్ళారు. తాజా పరిస్థితులు అను కూలించడంతో తిరిగి నల్లమల్ల చేరుకుని పార్టీని బలోపేతం చేసేందుకు యత్నాలు సాగిస్తుండగా పోలీసులకు చిక్కారు.

ఉద్యమంపై ఉక్కుపాదం

తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు మావోయిస్టులను నియంత్రించేం దుకు ఉమ్మడి కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లు సమష్టిగా కట్టుదిట్టమైన చర్యలుకు సిద్ధమౌతు న్నాయి. ఈక్రమంలో తెలుగు రాష్ట్రాలలో పెద్దగా మా వోయిస్టు కార్య కలాపాలు లేకపోయినా.. ఏపీ ఒడిశాలతో సరిహ ద్దు, ఛత్తీస్‌గఢ్‌లలో విస్తృతంగా ఉన్న విషయం విదితమే.

కాగా తెలంగాణ, ఏపీల పోలీస్ శాఖలో ఎస్‌ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో) వ్యూహాత్మక చర్యలు, గ్రేహౌండ్స్ ఆపరేషన్స్‌తో మావోయిస్టుల ఆగడాలను కొంతమేర నియంత్రిం చినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలోని ప్రభుత్వాలు మాత్రం మావోయిస్టులను నియం త్రించడంలో విఫలమవుతున్నాయి. ఒకవైపు మావోల ఏరివేతకు కేంద్రం భారీ స్థాయిలో సీఆర్‌పీఎఫ్ బలగాలను దింపుతున్నా.. ప్రాణనష్టం ఎక్కువగా జరుగుతుండటంతో ఆందోళనలో పడింది.

ఈ నేపథ్యంలోనే సంయుక్త కార్యా చరణ తెరపైకి వచ్చింది. యాక్షన్ ప్లాన్ 2018 పేరిట తీసుకునే ఈ చర్యలు, మావోయిస్టు కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ఇంటెలిజెన్స్ నివేదికలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.ఈ మేరకు సంయుక్త కార్యాచరణ, యాక్షన్ ప్లాన్ దిశగా చర్యలు చేపట్టాలని మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌డీజీపీలకు కేంద్రం ఆదేశాలిచ్చినట్లుగా సమాచారం.

తెలంగాణ ఎస్‌ఐబీ ఇచ్చే సమాచారాన్ని ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసు శాఖలు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని, ఆపరేషన్స్‌లో సూచనలు, సలహాలను పాటించాలని కేంద్ర నిర్ణయించినట్టు సమాచారం.

ఇదిలావుండగా మావోయిస్టు పార్టీ అగ్రనాయకులంతా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కావడం.. ఈ నాలుగు రాష్ట్రాల కమిటీల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్నది కూడా ఇక్కడి నాయకులే కావడంతో సమాచారం అందించాలని తెలంగాణ పోలీస్‌శాఖను సీఆర్‌పీఎఫ్ కోరింది. ఇక తెలంగాణ ఆవిర్భావం నుంచి స్తబ్దుగా ఉన్న మావోయిస్టు తెలంగాణ కమిటీని ఇటీవల కాలంలో పునరుత్తేజితం చేసే కార్యాచరణ రచించినట్టు నిఘా వర్గాలకు సమాచారం అందింది.

అవగాహన లేని అధికారులు

2004 ముందు ఇంటలిజెన్సీ విభాగంలో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారులు పదవీ విరమణ పొందారు. కొత్తగా వచ్చిన అధికారులకు అవగాహన లేకపోవడం, అప్పట్లో ఇక్కడ పనిచేసిన అధికారులను తెలంగాణకు కేటాయించారు. దీంతో అధికారుల వికేంద్రీకరణ కారణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు తగ్గిపోయాయి. అలాగే క్షేత్రస్థాయి సిబ్బందిలో కొంతమేర బలంగా ఉన్న కారణంగా అరకొర ఫలితాలు సాధ్యమవుతున్నాయి.

ఈక్రమంలో మావోయిస్టు కేంద్ర కమిటి తాజాగా రెండు రాష్ట్రాలలో బలోపేతం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో బెంగళూరు కేంద్రంగా చేసుకుని పార్టీ పటిష్టం చేసేందుకు యత్నాలు సాగుతున్నాయి. అలాగే తెలంగాణలో పార్టీ పటిష్టానికి చత్తీస్‌గడ్‌ను కేంద్రంగా చేసుకున్నట్లు సమాచారం. రెండు రాష్ట్రాలలో షెల్టర్‌జోన్స్ నుంచి పరేషన్స్ నిర్వ హించాలని నిర్ణయాలు తీసుకున్నట్టు తెలియవచ్చింది.

అధునాతన ఆయుధ సంపత్తి

మావోయిస్టులు భారీగా ఆయుధ సంపత్తిని పెంచుకునే యోచనలు చే స్తు న్న ట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యమంలో ఏకే47 తుపాకులు 50నుంచి 65లోపు అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 40లోపు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇదివరలో కేవలం డిసిఎం కేడర్‌లో మాత్రమే ఎకె తరహా ఆయుధాలు ఉపయోగించేవారు. పార్టీని బలోపేతం చేయడంలో భాగంగా క్రమంగా ఏకేల సంఖ్యను పెంచారు. పోలీసు శాఖకు ధీటుగా ఆయుధసామాగ్రిని ఏర్పాటు చేసుకోవాలని పార్టీ నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇందులో భాగంగా ఆయుధాలను సమకూర్చుకునేందుకు పార్టీ పెద్దలు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులకు, పోలీసులకు ఎదురు కాల్పులు ఎప్పుడు జరిగినా పోలీసులదే పైచేయి కావడం తరచూ జరుగుతున్న విషయమే.

ఈ విషయంపై పార్టీ దృష్టిసారించిందని, ఇకపై పార్టీలోనూ ఆపరేషన్స్ చేసే దళాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారన్నది సమాచారం.

ఈక్రమంలో ఏకే47 సంఖ్య పెంచడం, ఏకే 56లను వినియోగించడం, గ్రైనేడ్స్ వాడకం, అత్యాధునిక బైనాక్యులర్స్, భారీ ఎత్తున తూటాలను సమకూర్చుకోవడంతోపాటు, వాటినికి తీసుకెళ్లగలిగే సామ్యర్థాన్ని పెంపొందించుకునే దిశగా పార్టీ సమాలోచనలు చేస్తోంది. పార్టీలో చురుకైన యువకులను గ్రేహౌండ్స్ దళాలకు ధీటుగా కఠోర శిక్షణ ఇచ్చేందుకు పార్టీ కసరత్తులు చేస్తోంది. ఇటు అత్యాధునీక ఆయుధాలు, అటు ప్రత్యేక శిక్షణ పొందిన దళాల ఏర్పాటుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మావోయిస్టులు బలపడేందుకు యత్నాలు సాగిస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమం తిరిగి పుంజుకుంటుందనడంలో సందేహం వలదు. అయితే ఉద్యమంపై పోలీసు పట్టు బిగుస్తుండటంతో వాటి నుంచి తప్పించుకునేందుకు అన్నలు యత్నిస్తున్నారు.













సూర్య సినిమా

ఆపరేషన్ దుర్యోధనలా అదరగొట్టాలి

రెబల్‌స్టార్ కృష్ణంరాజు



శ్రీకాంత్, యజ్ఞశెట్టి హీరో హీరోయిన్లుగా అలివేలమ్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణం బాబ్జి దర్శకత్వంలో అలివేలు నిర్మిస్తున్న చిత్రం 'ఆపరేషన్ 2019'. 'బివేర్ ఆఫ్ పబ్లిక్' అనేది ట్యాగ్ లైన్. ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రెబల్‌స్టార్ కృష్ణంరాజు టీజర్ లాంచ్ చేసిన అనంతరం మాట్లాడుతూ... 'శ్రీకాంత్ నాకు తమ్ముడుగా 'సింహగర్జన'లో నటించాడు. ఆ తర్వాత 'నాన్నకు పెళ్లి' చిత్రంలో కొడుకుగా నటించాడు. తను మంచి నటుడే కాదు. మంచి మనసున్న వ్యక్తి కూడా. గతంలో చేసిన ఆపరేషన్ దుర్యోధన చిత్రం తనకు మంచి పేరు తెచ్చింది. ఆ చిత్రంలా శ్రీకాంత్‌కు ఈ సినిమా మంచి పేరు తేవాలనీ, టీమ్ అందరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నా' అన్నారు.నిర్మాత అలివేలు మాట్లాడుతూ.. 'డైరక్టర్ బాబ్జి గారు మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. శ్రీకాంత్ గారు ఎంతో సహకరించడంతో సినిమాను అనుకున్న విధంగా చేయగలుగుతున్నాం' అన్నారు. దర్శకుడు కరణం బాబ్జి మాట్లాడుతూ...'శ్రీకాంత్ గారితో గతంలో 'మెంటల్ పోలీస్' చిత్రాన్ని డైరక్ట్ చేశాను. ఆ సినిమా టైటిల్ వివాదం కావడం, రిలీజ్ ప్రాబ్లమ్ అవడంతో మేము అనుకున్న పేరు రాలేదు. మరోసారి శ్రీకాంత్ కాంబినేషన్‌లో 'ఆపరేషన్ 2019' చిత్రాన్ని డైరక్ట్ చేస్తున్నా. నన్ను నమ్మి మా నిర్మాతలు ఏ విషయంలో రాజీ పడకుండా సినిమాను నిర్మిస్తున్నారు' అన్నారు.

శ్రీకాంత్ మాట్లాడుతూ... 'ఈసారి కాంట్రవర్సీ లేకుండా మంచి కంటెంట్‌తో సినిమా చేద్దాం అన్నాను. ఈ స్టోరీ చెప్పాడు. ఇందులో కాంట్రవర్సీ ఉన్నా కంటెంట్ బావుంది. కచ్చితంగా అందరికీ నచ్చుతుందన్న నమ్మకం ఉంది. మా నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా సినిమా నిర్మిస్తున్నారు. షకీల్ ఆరు అద్భుతమైన పాటలిచ్చారు' అన్నారు.

సితార ఘట్టమనేని



ఘట్టమనేని ఫ్యాన్స్ ప్రస్తుతం పండగ చేసుకుంటున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా విడుదలైన 'భరత్ అనే నేను' చిత్రం ఆడియో టీజర్ అమితంగా అలరిస్తుండడం ఒక కారణమైతే.. తమ ముద్దుల కుమార్తె సితారతో కలిసి ఘట్టమనేని నమ్రత తీసుకున్న ఫోటో సోషల్ మీడియాలో సందడి చేస్తుండడం మరో కారణం. మహేష్ బాబు పర్ఫెక్ట్ ఫ్యామిలీ మ్యాన్ అన్న విషయం తెలిసిందే. కుటుంబం కోసం వీలైనంత తరచుగా సమయం కేటాయిస్తూ, కుటుంబ విలువలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే మహేష్ బాబుకు పిల్లలంటే ప్రాణం. మహేష్ బాబు మనసెరిగిన నమ్రత కూడా తన కెరీర్‌ని పక్కన పెట్టి.. గృహిణి పాత్రకు అంకితమై.. భర్త, పిల్లల ఆలనా పాలనతో ఆనందిస్తుండడం తెలిసిందే!

ఇంటిలిజెంట్ టీజర్ చాలా ఇంట్రెస్టింగ్

జైసింహా నందమూరి బాలకృష్ణ



సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ హీరోగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం టీజర్‌ను నటసింహ నందమూరి బాలకృష్ణ శనివారం విడుదల చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో హీరో సాయిధరమ్ తేజ్, దర్శకుడు వి.వి.వినాయక్, నిర్మాత సి.కళ్యాణ్, రచయిత శివ ఆకుల పాల్గొన్నారు. సహనిర్మాతల్లో ఒకరైన సి.వి.రావు బొకేలతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా నటసింహ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ "సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో మా సి.కళ్యాణ్‌గారు వి.వి.వినాయక్ దర్శకత్వలో నిర్మిస్తున్న నాలుగో సినిమా ఇది. వినాయక్ కాంబినేషన్‌లో ఇంతకుముందు 'చెన్నకేశవరెడ్డి' సినిమా చేశాం. మన కాంబినేషన్‌లో సినిమా ఎప్పుడు అని అడుగుతుంటాను. ఆర్టిస్టు నుంచి సరైన పెర్‌ఫార్మెన్స్ రాబట్టుకోవడం ఆయనకు తెలుసు. ఇండస్ట్రీ గర్వించదగ్గ దర్శకుడు వి.వి.వినాయక్. ఆయన దర్శకత్వంలో మెగా ఫ్యామిలీ నుంచి మరో నటవారసుడు సాయిధరమ్ తేజ్ హీరోగా రూపొందిన చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ సినిమా టీజర్‌ని నా చేతుల మీదుగా రిలీజ్ చేయడం చాలా సంతోషంగా వుంది. ఎందుకంటే సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ నా సొంత బేనర్‌తో సమానం. కళ్యాణ్‌గారు పెద్ద హీరోలతో, చిన్న హీరోలతో ఇంకా సినిమా చేయాలి. ఈ సినిమా విషయానికి వస్తే వినాయక్, శివ కాంబినేషన్‌లో ఎన్నో అద్భుతమైన సినిమాలు వచ్చాయి. ఈ సినిమా టీజర్ చాలా బాగుంది. మిస్టీరియస్‌గా వుంది. టీజర్ చూసిన తర్వాత సినిమా ఎప్పుడు చూడాలా అనిపిస్తుంది. టైటిల్ కూడా చాలా బాగుంది. మెగా అభిమానులకు, ఇది నా బేనర్ కాబట్టి నా అభిమానులకు, ముఖ్యంగా యూత్‌కి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అన్నారు.

నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ "మా నందమూరి అభిమానులకు, మెగాస్టార్ చిరంజీవిగారి ఫ్యామిలీ హీరో సాయిధరమ్‌తేజ్ అభిమానులకు, ప్రేక్షకులకు నమస్కారం. ఇదొక సెన్సేషన్. నాకు చాలా పెద్ద హిట్ ఇచ్చిన మా హీరో బాలకృష్ణ గారు. అలాగే గురువుగారి 150వ సినిమాకి నిర్మాతనయ్యే అవకాశం ఆరోజు నాకు ఇచ్చారు. అది చాలా గ్రేట్. ఈ పొంగల్‌కి 'జైసింహా' పెద్ద హిట్ ఇచ్చారు. చాలా తక్కువ టైమ్‌లో రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేసి సక్సెస్ కొట్టాం. అవన్నీ ఒక ఎత్తయితే వినాయక్ నాన్నగారు కృష్ణ కోరిక వినయ్ నాతో ఒక సినిమా చెయ్యాలని. చెన్నకేశవరెడ్డి ఫస్ట్ ప్రొజెక్షన్ ప్రసాద్ ల్యాబ్‌లో జరుగుతోంది. అప్పుడు వినయ్ నాన్నగారితో విషయం చెపితే నాకు వదిలెయ్ నేను చూసుకుంటాను. ఇప్పుడు నాతో సినిమా చేయడం ద్వారా వినయ్ నా కోరికను నెరవేర్చాడు. తేజు ఈ సినిమా ఎంతో కష్టపడి చేశారు. పితృ సమానుడు దాసరి నారాయణరావుగారి దీవెనలు, అన్నయ్య కృష్ణ దీవెనలు మాకు ఉంటాయి. వీటన్నింటిని మించి మా బాలయ్యబాబు మాకు ఆశీస్సులు అందించేందుకు రావడం.. నేను చాలాచాలా పెద్ద సెన్సేషన్ హిట్ కొట్టినట్టు భావిస్తున్నాను. టీజర్ రిలీజ్ చెయ్యవలసిందిగా బాబుని అడగడానికి వెళ్ళినపుడు ఒక టైమ్ చెప్పి అప్పుడు టీజర్ రిలీజ్ చెయ్యండి, సినిమా సూపర్‌హిట్ అన్నారు. 2018 ప్రారంభంలో బాలకృష్ణ గారు నాకు మంచి ఎనర్జీ ఇచ్చారు. ఫిబ్రవరిలో కూడా సూపర్‌హిట్ కొట్టి సి.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్ వుందని నిరూపిస్తాను" అన్నారు.

సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ "మేం అడగ్గానే బాలకృష్ణ గారు రావడంతో ఈ సినిమా సూపర్‌హిట్ అయిపోయిందన్న ఫీలింగ్ వచ్చేసింది. మేమంతా ఆనందంతో ఉద్వేగంగా ఉన్నాం. యూనిట్‌లోని ప్రతి ఒక్కరి తరఫున బాలకృష్ణ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అన్నారు.

హీరో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ "ముందుగా బాలకృష్ణ గారికి థాంక్స్. కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చెయ్యడంలో బాలకృష్ణ గారు ముందుంటారని అందరూ అంటారు. మా సినిమాకి ఆశీస్సులు అందించడానికి రావడంతో మరోసారి అది ప్రూవ్ అయ్యింది" అన్నారు.

ఛలో చిత్రానికి స్వర సారథ్యం చేసినందుకు చాలా గర్వంగా వుంది - స్వర సాగర్

ఐరా క్రియేషన్స్‌కి ఆజన్మాంతం రుణపడి వుంటాను



ఒక అద్భుతమైన హీరోను, అసాధారణమైన ప్రతిభ కలిగిన దర్శకుడ్ని నాకిచ్చి 'ఛలో' చిత్రానికి స్వర సారథ్యం చేసే అవకాశం ఇచ్చిన ఐరా క్రియేషన్స్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటాను' అంటున్నారు యువ సంగీత దర్శకులు స్వర సాగర్.

సుప్రసిద్ధ సంగీత దర్శకులు మణిశర్మ తనయుడిగా రంగ ప్రవేశం చేసిన స్వర సాగర్ మెల్లగా తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు.

నాగశౌర్య హీరోగా వెంకీ కుడుములను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఐరా క్రియేషన్స్ పతాకంపై నిర్మాణమైన 'ఛలో' చిత్రానికి సంగీత సారథ్యం వహించిన స్వర సాగర్.. ఒక గొప్ప టీమ్‌తో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. 'నేను మ్యూజిక్ చేశానని చెప్పడం కాదు. 'ఛలో' చాలా పెద్ద హిట్ అవుతుంది. ఒక హిట్ సినిమాతో అసోసియేట్ అవ్వడం ఆనందంగా ఉంది' అన్నారు.

భాగమతిని బ్లాక్ బస్టర్‌గా డిక్లేర్ చేయడం భావోద్వేగానికి లోను చేస్తోంది



భాగమతి మంచి హిట్ అవుతుందని ముందు నుంచి అనుకుంటూనే ఉన్నాం. అందుకు తగ్గట్టుగానే అందరం కష్టపడ్డాం. కానీ విడుదలైన మొదటి రోజే థియేటర్లు పెంచాల్సినంత బ్లాక్ బస్టర్ అవుతుందని మాత్రం అస్సలు ఊహించలేదు. 'భాగమతి'ని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షక దేవుళ్ళకు హృదయపూర్వక కృతజ్ఞతలు' అన్నారు. యు వి క్రియేషన్స్ పతాకంపై అనుష్క టైటిల్ పాత్రలో అశోక్ దర్శకత్వంలో వంశీ-ప్రమోద్ నిర్మించిన 'భాగమతి' చిత్రం విజయ దుందుభి మ్రోగిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని సినిమా కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. దర్శకుడు అశోక్, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ ఇందులో పాల్గొన్నారు. మూడు కోట్ల వ్యయంతో వేసిన 'భాగమతి బంగ్లా' ఈ చిత్ర విజయంలో కీలక పాత్ర పోషిస్తుండడం చాలా సంతోషంగా ఉందని రవీందర్ అన్నారు.

సైరా బాలరాజు గ్లిట్టర్ విడుదల



నంది క్రియేషన్స్ బ్యానర్‌పై కె.ఎం.డి. రఫీ, రెడ్డం రాఘవేంద్రరెడ్డి నిర్మాతలుగా, కోటేంద్ర దుద్యాల దర్శకుడిగా "బంగారి బాలరాజు" చిత్రంతో పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం గ్లిట్టర్‌ను ప్రముఖ డైరెక్టర్ సురేందర్ రెడ్డి విడుదల చేసారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... బంగారి బాలరాజు టీజర్ చూసాను. చాలా బాగుంది. కొత్తగా వస్తున్న ఈ చిత్ర ప్రొడ్యూసర్స్ రఫీ, రాఘవేంద్రరెడ్డి, డైరెక్టర్ కోటేంద్ర, హీరో రాఘవ్‌కు మంచి సక్సెస్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అల్ ద బెస్ట్ చెప్పారు. చిత్ర నిర్మాతలైన కె.ఎం.డి. రఫీ, రెడ్డం రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ... సురేందర్ రెడ్డి గారి లాంటి ప్రముఖ దర్శకులు చేతుల మీదుగా మా సినిమా టీజర్ రిలీజ్ అవడం మాకు ఆనందంగా ఉంది. ఆయన సైరా మూవీలో బిజీగా ఉన్నా మాకు టైమ్ కేటాయించి టీజర్‌ని విడుదల చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. డైరెక్టర్ కోటేంద్ర దుద్యాల మాట్లాడుతూ.. ఈ చిత్ర థియేటరికల్ ట్రైలర్‌ని ఫిబ్రవరి 14న, సినిమాని మార్చిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాము అని తెలిపారు.

నెల్లూరి పెద్దారెడ్డి పాటల విడుదల




సిద్ధి విఘ్నేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దర్శకులు వీజే రెడ్డి రూపొందిస్తున్న చిత్రం నెల్లూరి పెద్దారెడ్డి. సీహెచ్ రఘునాథ రెడ్డి నిర్మాత. సతీష్ రెడ్డి, మౌర్యాని, ముంతాజ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రభాస్ శీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. గురురాజ్ సంగీతాన్ని అందించిన నెల్లూరి పెద్దారెడ్డి ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ దర్శకులు సాగర్, రేలంగి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆడియో బిగ్ సీడీని ఆవిష్కరించిన అనంతరం దర్శకులు వీజే రెడ్డి మాట్లాడుతూ... పల్లె వాతావరణంలో ఆహ్లాదకరమైన కథా కథనాలతో నెల్లూరి పెద్దారెడ్డి చిత్రం సాగుతుంటుంది. నెల్లూరు నుంచి ఖమ్మం జిల్లా సీతారాంపురం అనే గ్రామానికి వలస వచ్చిన పెద్దారెడ్డి అనే వ్యక్తి కథ ఇది. అలా అతన్ని అంతా నెల్లూరి పెద్దారెడ్డి అని పిలుస్తుంటారు. ఆ గ్రామంలోని వాళ్లంతా నెల్లూరి పెద్దారెడ్డిని గౌరవిస్తుంటారు. నలుగురికి మంచి చేసే పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి అనుకోని పరిస్థితులు ఎదురవుతాయి. వాటి పర్యవసానంగా కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తి కరంగా చూపిస్తున్నాం' అన్నారు.


ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రభంజనం సృష్టిస్తున్న పద్మావత్



అనేక అవరోధాలు, అవాంతరాలు, ప్రతిబంధకాలు అధిగమించి జనవరి 25న విడుదలైన 'పద్మావత్' చిత్రం వసూళ్ల ప్రభంజనం సృష్టిస్తోంది. మొదటి రోజు వసూళ్లు అంత ఆశాజనకంగా లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించినా, రెండో రోజుకి అంతా సర్దుకుంది. 'పద్మావత్' ప్రదర్శితమయ్యే థియేటర్ల వద్ద అలజడులు జరుగుతున్న నేపథ్యంలో మొదటి రోజు సినిమా వీక్షించడానికి జనం భయపడ్డారు. పైగా పలు రాష్ట్రాల్లో ఈ చిత్రం విడుదల కాకపోవడం కూడా వసూళ్లపై ప్రభావం చూపింది. అయితే విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు 'పద్మావత్'కి బ్రహ్మరథం పడుతుండడంతో రెండో రోజుకే ఈ చిత్రం 50 కోట్లు వసూలు చేసి.. 100 కోట్ల దిశగా పరుగులు తీస్తోంది!

ఆశాభోస్లేకి యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్





భారతీయ కళలను, సంస్కృతిని ప్రోత్సహించే కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి జాతీయ స్థాయిలో ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రముఖ దర్శకనిర్మాత యశ్ చోప్రాతో ఆయనది ఎనలేని బంధం. ఆ అనుబంధంతోనే యశ్ చోప్రా తనువు చాలించిన తర్వాత సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ తరఫున 2013 నుండి నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్‌ను సినీ ప్రముఖులకు అందచేస్తున్నారు. ఈసారి 2017కి గాను ఈ అవార్డును ప్రముఖ నేపథ్య గాయని, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ ఆశాభోస్లేకు అందచేయ బోతున్నారు. శనివారం ముంబైలో సమావేశమైన టి. సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు బోనీకపూర్, మాధుర్ భండార్కర్, హనీ ఇరానీ, పద్మినీ కొల్హాపురి, సుబ్బరామిరెడ్డి... శ్రీమతి ఆశాభోస్లే పేరును నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డుకు ఎంపిక చేశారు.

గతంలో ఈ అవార్డును లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, షారుక్ ఖాన్ అందుకున్నారు. ఎప్పటిలానే ఈసారి కూడా ఈ అవార్డు ప్రదానోత్సవం ముంబైలో ఫిబ్రవరి 16న ఘనంగా జరుగుబోతోంది. మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్‌రావుతో పాటు లతా మంగేష్కర్ చేతుల మీదుగా 'నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డు -2017'ను ఆశాభోస్లే అందుకోబోతున్నారు. ఈ కార్యక్రమంలో అమితాబ్ బచ్చన్, ఆమీర్ ఖాన్, షారుక్ ఖాన్, శ్రీదేవి, జయప్రద తదితరులు పాల్గొనబోతున్నారు.

1933లో జన్మించిన ఆశాభోస్లే పదేళ్ళ ప్రాయంలోనే నేపథ్య గాయనిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. గడిచిన 75 సంవత్సరాల్లో వందల చిత్రాలలో వేలాది గీతాలు ఆలపించిన ఆశాభోస్లే రెండు సార్లు ఉత్తమ గాయనిగా జాతీయ అవార్డును అందుకోవడంతో పాటు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోనూ చోటు సంపాదించుకున్నారు. ఆమె కీర్తి కిరీటంలో 'నేషనల్ యశ్ చోప్రా మెమోరియల్ అవార్డ్' మరో కలికితురాయిగా నిలువబోతోంది.

ఆ అపార్టుమెంటులో ఏం జరిగింది?



పలు టీవీ సీరియల్స్ ద్వారా సుపరిచితులైన లయన్ ప్రభాకర్ రావు ముఖ్య పాత్ర పోషిస్తూ నిర్మిస్తున్న సినిమా 'అపార్ట్ మెంట్'. ఒక అపార్టుమెంట్ నేపథ్యంలో.. అపార్ట్ మెంట్‌లో ఉండే వివిధ రకాల మనుషులు వారి మనస్తత్వాలను ఆధారం చేసుకొని తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రముఖ తెరాస నాయకులు సి.వేణుగోపాలాచారి చేతుల మీదుగా లాంఛనంగా మొదలైంది. హారిక 3 క్రియేషన్స్ ఆవుల శివ హరీష్-షాహీన్-హేమ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి చౌదరి దర్శకుడు. త్వరలో రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఈ చిత్రంలో ముఖ్య పాత్ర పోషిస్తూ, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న లయన్ ప్రభాకర్ అన్నారు. ఈ చిత్రంలో నటిస్తున్న హీరోహీరోయిన్స్‌కి చాలా మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం 28 జనవరి 2018



బీజేపీలో అలాంటి వ్యక్తులేరీ?

న్యూఢిల్లీ: పద్దెనిమిదవ శతాబ్దం నాటి మైసూరు రాజు టిప్పు సుల్తాన్ ఫోటోను ఢిల్లీ శాసనసభలో ఏర్పాటు చేయడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం సమర్థించుకుంది. వివాదాస్పదుడైన టిప్పు సుల్తాన్ ఫోటో ఎందుకంటూ నిలదీసిన బీజేపీకి 'ఆప్' దీటైన సమాధానమిచ్చింది. జాతి నిర్మాణం, స్వాంతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్న 70 మంది చిత్రపటాలను ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారంనాడు ఢిల్లీ అసెంబ్లీలో ఆవిష్కరించారు. ఈ గ్యాలరీలో టిప్పు సుల్తాన్ పోటో ఉండడంపై బీజేపీ పెదవి విరిచింది. దీనిపై ఆప్ ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ మీడియా సమావేశంలో స్పందించారు. జాతినిర్మాణం, స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్న వారి పేర్లు సూచించమని అందర్నీ కోరాం. బీజేపీ తమ సొంత పార్టీ నుంచి కానీ, ఆర్ఎస్ఎస్ నుంచి ఎవరి పేర్లనూ సూచించలేకపోయింది' అని అన్నారు. ఇదే అభిప్రాయాన్ని స్పీకర్ రామ్ నివాస్ గోయెల్ సైతం వ్యక్తం చేశారు. వివాదాలు సృష్టించడమే బీజేపీ పని అని, చౌకబారు రాజకీయాలకు పాల్పడటం ఇప్పటికైనా ఆ పార్టీ మానుకోవాలని హితవు పలికారు. గ్యాలరీలో టిప్పు సుల్తాన్ ఫోటో ఉంచడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి వాళ్లకు నేను ఒకటి చెప్పదలచుకున్నాను. రాజ్యాంగంలోని 144వ పేజీలో టిప్పు సుల్తాన్ ఫోటో ఉంది. దేశవిముక్తి కోసం బ్రిటిష్ వారితో తలపడి, రాజ్యాంగ రచన చేసిన వారిని ద్రోహులని మీరు అనుకుంటున్నారా? ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోండి అని రామ్ నివాస్ గోయెల్ బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఐక్యరాజ్యసమితి ఎదుట మూగజీవాల నిరసన

- క్రూయేల్టీ ఫ్రీ ఇంటర్నేషనల్ సంస్థల ఆందోళన
- జంతువులపై కాస్మోటిక్ ప్రయోగాలు వద్దు
- రెండు లక్షల జంతువులపై ప్రభావం
- జంతువులు చేపట్టిన తొలి నిరసనగా నమోదు

ఐక్యరాజ్యసమితి: తమ జాతిపై జరుగుతున్న ప్రయోగాలను వ్యతిరేకిస్తూ ఏకంగా ఐక్యరాజ్యసమితి ముందే ఎనిమిది శునకాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా మా మనుగడకు ముప్పు వచ్చేలా ఉంది. మీ ఆవిష్కరణల కోసం మమ్మల్ని బలి చేయకండిఅంటూ బాడీ షాప్, క్రూయాలిటీ ఫ్రీ ఇంటర్నేషనల్ సంస్థల ఆధ్వర్యంలో ఈ జాగిలాలు నిరసనకు దిగాయి. జంతువులపై జరుగుతున్న కాస్మోటిక్ ప్రయోగాలకు వ్యతిరేకంగా ఈ రెండు సంస్థలు సంయుక్తంగా పాటుపడుతున్నాయి. దీనికోసం వారు శిక్షణ ఇచ్చిన శునకాల మెడలో ప్లకార్డులను వేసి, వెనుక బ్యానర్లతో నిరసన చేపట్టారు. ప్రపంచవ్యాప్తంగా జంతువులు చేపట్టిన తొలి నిరసన ఇదే. రసాయనాలతో కూడుకున్న ప్రయోగాల మూలంగా సంవత్సరానికి సుమారు రెండు లక్షల



జంతువులు వీటి ప్రభావానికి లోను అవుతున్నాయని అంతర్జాతీయ హ్యూమన్ సొసైటీ పేర్కొంది. జంతువులపై జరువుతున్న కాస్మోటిక్ ప్రయోగాలకు నిరసనగా జూన్ 2017 నుంచి ఎనిమిది మిలియన్ల మద్దతుతో సంతకాలను సేకరించాలనుకున్నాం. ఇప్పటివరకూ 4.1మిలియన్ల వరకూ పూర్తి అయ్యాయి. త్వరలోనే మిగతావి సేకరించి పూర్తి స్థాయిలో ఐరాసకు అందజేస్తామని భారత బాడీ షాప్ మార్కెటింగ్ అధినేత ఆరాధికా మెహతా తెలిపారు. ఒకవైపు శునకాలు ఎంతో విశ్వాసం ఉన్న జంతువులంటూ వాటి పట్ల ప్రేమను చూపిస్తున్నాం. మరోవైపు మాత్రం వాటిపై ఇలాంటి క్రూరమైన చర్యలకు పాల్పడుతున్నామంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మానవులతో అత్యంత సన్నిహితంగా ఉండే జంతువులు శునకాలు మాత్రమే. వాటికి కావాల్సిన శిక్షణ అందించి వాటితోనే నిరసనకు దిగామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు మాత్రమే ఈ కాస్మోటిక్ ప్రయోగాలను నిషేధించాయి. కానీ సుమారు 80శాతం వరకు దేశాలు ఈ ప్రయోగాల గురించి ఎలాంటి చట్టాలు చేయలేదు. భారత్‌లో మాత్రం వీటిని పూర్తిగా నిషేధించారు. మానవ సంబంధిత లేపనాలు(సబ్బులు, శాంపులు, సుగంధలేపనాలు) తయారీ అనంతరం వాటిని ముందుగా జంతువులపై ప్రయోగిస్తారు. వాటి పనితీరు సజావుగా ఉంటే అనంతరం మార్కెట్‌లోకి విడుదల చేస్తారు. ముఖ్యంగా చర్మం, కళ్లకు సంబంధించిన లేపనాల విషయంలో వీటి ప్రయోగాలు ఎక్కువగా ఉంటాయి.

రాహుల్ సీటుపై బీజేపీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఆరో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన అభ్యంతరాలను బీజేపీ తోసిపుచ్చింది. అవన్నీ పసలేని వాదనలేనని కొట్టివేసింది. ప్రజాస్వామ్యం నిబంధనలకు లోబడి ఉంటుందే కానీ వ్యక్తులకు లోబడి కాదని పేర్కొంది. ప్రోటోకాల్ ప్రకారమే రిపబ్లిక్ డే పరేడ్‌లో రాహుల్‌కు సీటు కేటాయింపు జరిగింది. కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన అభ్యంతరాల్లో ఏమాత్రం పసలేదు. ఆ పార్టీ చౌకబారు రాజకీయాలకు ఇది ఓ ఉదాహరణ. దీనిని బట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ ప్రజాస్వామ్యాన్ని కాకుండా దొరలపాలనకే మొగ్గుచూపుతున్నట్టు కనిపిస్తోంది అని బీజేపీ ప్రతినిధి జీవీఎల్ఎన్ రావు అన్నారు. కేంద్రంలోని దురహంకారపూరిత ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీ అధ్యక్షుడిని ఉద్దేశపూర్వకంగానే చిన్నబుచ్చిందంటూ రాహుల్‌కు ఆరో వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. రాహుల్‌కు మొదటి వరుసలో సీటు నిరాకరించడం ద్వారా మోదీ సర్కార్ చౌకబారు రాజకీయాలకు పాల్పడిందని ఆ పార్టీ ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలే ఘాటు విమర్శలు చేశారు. ఆయన వాదనను ఆ పార్టీ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్ సైతం సమర్థించారు. రాహుల్ గాంధీని ఇంకెంతమాత్రం కాంగ్రెస్ ఎంపీగా చూడరాదని, దేశంలోనే అతిపెద్ద విపక్ష పార్టీకి ఆయన అధ్యక్షుడనే విషయం మరువరాదని అన్నారు. రాహుల్ హోదాను అధికార పార్టీ గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు.

నెట్ వినియోగంలోనూ పురుషాధిక్యత

- ఇంటర్నెట్ వాడకంలో స్త్రీల సంఖ్య మూడో వంతు
- డిజిటల్ రంగంలో స్త్రీ, పురుష అసమానత్వం
- మహిళలను బహిష్కరిస్తే తీవ్ర పర్యవసానాలు
- చాలా మందికి ఇంటర్నెట్ అందుబాటులో లేదు

న్యూఢిల్లీ: దేశంలో ఇంటర్నెట్ ఇంకా పురుషాధిక్యతలోనే ఉంది. మొత్తం ఇంటర్నెట్ వాడకందార్లలో స్త్రీలసంఖ్య మూడోవంతు మాత్రమే. డిజిటల్ రంగంలోని ఈ స్త్రీ, పురుష ఎడం బాలికలకు చాలా తీవ్ర సమస్య కాగలదని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల విద్యానిధి సంస్థ (యునిసెఫ్) తాజా నివేదికలో హెచ్చరించింది. డిజిటల్ ప్రపంచంలో బాలల సంక్షేమం గురించిన అధ్యయన నివేదిక అది. డిజిటల్ సాంకేతిక విజ్ఞానానికి బాలికలు దూరమైన పక్షంలో దేశ సామాజిక సాంస్కృతిక రంగంలో వారు వెలివేయబడినట్లు అవుతారని యునిసెఫ్ నివేదిక హెచ్చరించింది. డిజిటల్ యుగం నుంచి బాలికలను బహిష్కరిస్తే తీవ్ర పర్యవసానాలు తప్పవని కూడా నివేదిక తెలిపింది. చాలా దేశాల్లో బాలికలను స్వేచ్ఛగా సంచరించకుండా ఆంక్షలు అమలులో ఉండడంతో వారి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కార్యకలాపాలు పరిమితికి గురవుతున్నాయి. దీనివల్ల ఆరోగ్య రక్షణ విద్యలో ప్రపంచ స్థాయిని అందుకోవడంవంటి విషయాల్లో వారు వెనుకబడుతున్నారని, ఈ ప్రమాదం మునుముందు మరింత తీవ్రమవుతుందని యునిసెఫ్ హెచ్చరించింది. వారిలో చాలా మందికి ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో 21వ శతాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బాలికలు పాలుపంచుకొనే అవకాశం తగ్గిపోతోందని నివేదిక పేర్కొంది. ఇదిలావుండగా డిజిటల్ ప్రపంచంలో బాలలు పేరిట ఈ నివేదిక వెలువడింది. భారతదేశంలో డిజిటలైజేషన్‌కు ఇస్తున్న గట్టి ప్రోత్సాహాన్ని నివేదిక ఉదహరించింది. కేవలం ప్రోత్సహిస్తే చాలదని, ఈ రంగంలో లింగభేదాలను నిర్మూలించడం కూడా ముఖ్యమని నివేదికలో యునిసెఫ్ సూచించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ నివేదికను సోమవారం విడుదల చేశారు. దేశంలో డిజిటలైజేషన్ నుంచి మినహాయింపబడుతున్న వర్గాలపై దృష్టిపెట్టాలని ఈ నివేదిక విడుదల తర్వాత యునిసెఫ్ భారత ప్రతినిధి యాస్మిన్ అలీ విలేకరులతో అన్నారు. బాలలను డిజిటల్ ప్రపంచంలోకి ప్రవేశపెట్టడంవల్ల ఎదురయ్యే సవాళ్లను కూడా విధానకర్తలు దృష్టిలోపెట్టుకోవాలని అలీ సూచించారు. ఎందుకంటే ప్రపంచంలో ఇప్పుడు ఇంటర్నెట్ వాడకం దార్లు ప్రతి ముగ్గురిలో ఒకరు బాలురు లేదా బాలిక. దేశంలో 71 శాతం మంది పిల్లలు ఇంటర్నెట్ వాడుతున్నారు. మొత్తం జనాభాలో ఇది సగటున 48శాతం.



అయితే డిజిటల్ ప్రపంచం నుంచి ఎదురయ్యే సవాళ్ల విషయంలో వారికి సరియైన మార్గదర్శకత్వం లేదని నివేదిక తెలిపింది.

అమిత్ షాకు బ్రెయిన్ లేదు: సీఎం సిద్ధరామయ్య



బెంగళూరు : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కర్ణాటక సీఎం సిద్దరామయ్యపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసిన నేపథ్యంలో సిద్ద రామయ్య కూడా గట్టిగానే స్పందించారు. అమిత్ షా ఒక బ్రెయిన్ లెస్ మనిషని, ఒకప్పటి జైలు పక్షి అని ఎద్దేవా చేశారు. ఒకప్పటి జైలు పక్షి మరో జైలు పక్షిని కర్నాటక ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసుకుంది అని ట్విటర్‌లో పరోక్షంగా అమిత్ షాను కర్ణాటక మాజీ సీఎం యెద్యూరప్పను ఉద్దేశించి విమర్శించారు. అంతేకాకుండా తనపై చేసిన ఆరోపణలు బీజేపీ నేతలు నిరూపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. సోహ్రాబుద్దీన్ హత్య కేసు విషయంలో 2010లో అమిత్ షా మూడు నెలలపాటు జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, సిద్దరామయ్య వ్యాఖ్యలకు బీజేపీ నేతలు కూడా గట్టి కౌంటరే ఇచ్చారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ బెయిల్‌పై బయట ఉన్నారనే విషయం మర్చిపోవద్దన్నారు. ఇక కేంద్ర మంత్రి సదానంద గౌడ స్పందిస్తూ ఇందిరాగాంధీ 1977లో జైలుకు వెళ్లారు.. ఆమె కుమారుడు బోఫోర్స్ కుంభకోణంలో జైలు కెళ్లారు.. ఇది చాలా ఇంకా జాబితా కావాలా సార్ అంటూ గౌడ విమర్శించారు.

ట్రంప్‌తో అఫైర్‌పై నిక్కీ హేలీ ఆగ్రహం



న్యూయార్క్: ఐరాస, యునైటెడ్‌నేషన్స్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఐక్యరాజ్యసమి తిలో అమెరికా రాయబారి నిక్కీహే లీకి అఫైర్ ఉందని వచ్చిన వదంతుల నేపథ్యంలో ఆమె ఫైర్ అయ్యారు.ఆ వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. ట్రంప్‌తో అఫైర్ అని వ్యాఖ్యలు చేయడం చాలా అసహ్యంగా ఉందని అన్నారు. మైకేల్ ఊల్ఫ్ రాసిన ఫైర్ అండ్ ఫ్యూరీ పుస్త కంలో ట్రంప్‌తో నిక్కీకి అఫైర్ ఉందని రాయడంతో ఈ వదంతులు వ్యాపించాయి. ట్రంప్‌తో ప్రెసిడెన్షియల్ విమానంలో, ఓవల్ కార్యాలయంలో నిక్కీ చాలా సేపు ఒంటరిగా గడిపారని ఊల్ఫ్ పుస్తకంలో రాశారు. ఇది పూర్తిగా అబద్ధమని, చాలా అసహ్యంగా, అసభ్యంగా రాశారని నిక్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో తాను ఉన్నప్పుడు అక్కడ చాలా మంది ఉన్నారని తెలిపారు. అలాగే ఓవల్ కార్యాలయంలో కూడా ట్రంప్‌తో తన రాజ కీయ భవిష్యత్తు గురించే మాట్లాడానని, ఎప్పుడూ వ్యక్తిగత విషయాలు మాట్లాడలేదని, అలాగే తాను ఎప్పుడూ అధ్యక్షుడితో ఒంటరిగా లేనని స్పష్టంచేశారు. ఎక్కువ శాతం మంది పురుషులు మహిళల్ని గౌరవిస్తు న్నారు.. కొంతమందే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారని హేలీ అన్నారు. బలమైన వ్యక్తిత్వమున్న మహిళలను హేళన చేయడం అంత సులువు కాదని పేర్కొన్నారు.

భద్రతా సిబ్బందిపై వైమానిక దాడి



బాగ్దాద్: ఇరాక్‌లో అమెరికా దళాలు పొరపాటుగా చేసిన వైమానిక దాడిలో ఎనిమిది మంది మరణించారు. వారిలో ఎక్కువ మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. పశ్చిమ ఇరాక్‌లోని అల్-బాగ్దాది నగరంలో అమెరికా దళాలు పొరపాటుగా ఈ దాడులు చేశారని ప్రావిన్స్ అధికారి ఒకరు వెల్లడించారు. మరణించిన వారిలో సీనియర్ ఇంటెలిజన్స్ అధికారి, అయిదుగురు పోలీసులు, ఓ మహిళ ఉన్నట్లు తెలిపారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆపరేషన్‌కు సహకరించడానికి వెళ్తున్న కాన్వాయ్‌పై ఈ దాడి జరిగింది. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. నగర పోలీస్ చీఫ్ సహా 20 మంది గాయాలపాలయ్యారు.

జైపూర్ ఫెస్టివల్‌కు ప్రసూన్ జోషి గైర్హాజరు?



న్యూఢిల్లీ: 'పద్మావతి' వివాదం, కర్ణిసేన బెదిరింపులు నేపథ్యంలో జైపూర్ లిటరరీ ఫెస్టివల్ (జేఎల్ఎఫ్)కు దూరంగా ఉండాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ చైర్‌పర్సన్ ప్రసూన్ జోషి నిర్ణయం తీసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం జరిగే ఫెస్టివల్ సెషన్‌లో జోషి ప్రసంగించాల్సి ఉంది. సంజయ్ లీలా బన్సాలీ వివాదాస్పద 'పద్మావతి' చిత్రానికి సెన్సార్ బోర్డు క్లియరన్స్ తర్వాత రాజ్‌పుత్ కర్ణిసేన ప్రసూన్ జోషికి హెచ్చరికలు జారీ చేసింది. జైపూర్ లిటరరీ ఫెస్టివల్‌లో ఆయనను అడుగుపెట్టనీయమని కర్ణిసేన పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో తాను లిటరరీ ఫెస్టివల్‌కు వెళ్లడం లేదని ఒక ప్రకటనలో ప్రసూన్ జోషి పేర్కొన్నారు. 'ఈ ఏడాది జేఎల్ఎఫ్‌కు వెళ్లడం లేదు. ఎందరెందరో సాహితీప్రియులను కలుసుకునే మహదవకాశాన్ని కోల్పోతున్నాను. సదస్సుకు హాజరైన సహచర సాహితీప్రియులు, రచయితలు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకారాదనే ఈ నిర్ణయం తీసుకున్నాను. క్రియేటివిటీని వెలికితీసే ఈ కార్యక్రమం కాంట్రవర్సీ కారాదన్నదే నా అభిమతం' అని జోషి తెలిపారు. 'మై ఔర్ వో: కన్వర్సేషన్స్ విత్ మై సెల్ఫ్' అనే అంశంపై ఆదివారంనాడు జోషి ప్రసంగించాల్సి ఉంది. 'తారేజమీన్ పర్' (2007), 'చిట్టగాంగ్' (2013) చిత్రాలకు గాను ఉత్తమ గేయ రచయితగా జాతీయ అవార్డులు అందుకున్నారు. కళలు, సాహిత్యం, అడ్వర్‌టైజింగ్ రంగాల్లో సేవలకు గాను దేశ నాల్గవ ఉత్తమ పౌర పురస్కారమైన 'పద్మశ్రీ'ని 2015లో జోషిని వరిం చింది. ఇదిలావుండగా తమిళనాడుతోని సేలం జిల్లాలో పద్మావత్ చిత్రాన్ని ప్రదర్శిస్తున్న థియేటర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబు విసిరారు. స్థానిక కొత్త బస్టాండు సమీపంలో ఉన్న గ్రూవు థియేటర్లలో ఓ హాల్లో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు థియేటర్‌పై పెట్రోల్ బాంబు విసిరారు. వెంటనే అప్రమత్తమైన థియేటర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ వ్యవహారంపై స్థానిక పోలీసులకు థియేటర్ యాజమాన్యం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ బాంబు దాడితో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

ప్రమాదాల నివారణకు టోల్‌ఫ్రీ నంబర్



న్యూఢిల్లీ: అతివేగం, మద్యం, నిద్ర మత్తులో ప్రయాణాల వల్ల జాతీయ రహదారిపై ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే ఈ ప్రమాదాల గురించి పోలీసులకు, అంబులెన్స్‌లకు చేరేలోపే చాలా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇలాంటి వాటిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఓ ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌రు తీసుకురానుంది. హైవేలపై ప్రమాదాల గురించి చెప్పేందుకు జాతీయ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) 1033 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫిబ్రవరి చివరి వారంతో దీన్ని అందుబాటు లోకి తీసుకురానుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే అన్ని పనులు పూర్తయ్యాయి. హైవేలపై ప్రమాదానికి గురయ్యే బాధితులకు త్వరిత సాయం అందించేందుకు, వారిని త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఈ హెల్ప్‌లైన్‌ను తీసుకొస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నాం అని ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ దీపక్ కుమార్ ఓ మీడియాకు తెలిపారు. అంతేగాక.. ఈ టోల్‌ఫ్రీ నంబర్ గురించి అందరికి తెలియజేసేలా ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రమాదాలే గాక.. రోడ్ల నిర్వహణ గురించి కూడా ఈ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చట. దేశ రహదారి నెట్‌వర్క్‌లో కేవలం 2శా తం మాత్రమే జాతీయ రహదారులు. అయితే వీటిపై జరిగే ప్రమాదాలు మాత్రం చాలా ఎక్కువ. 2016లో ఈ జాతీయ రహదారులపై జరిగిన ప్రమాదాల్లో 52వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షన్నర మంది గాయపడ్డారు.

యూపీలో ఆగని అల్లర్లు

కాస్‌గంజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లో గణతంత్ర దినోత్సవం రోజున చెలరేగిన అల్లర్లు తీవ్ర రూపం దాల్చాయి. ఆందోళనకారులు కాస్‌గంజ్ ప్రాంతంలోని పలు దుకాణాలకు, బస్సులకు నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. శుక్రవారం అక్కడ జరిగిన తిరంగా యాత్రలో భాగంగా మథుర-బరేలీ మార్గంలో వీహెచ్‌పీ, ఏబీవీపీ కార్యకర్తలు మోటారు సైకిళ్ల ర్యాలీ చేపట్టగా.. వారిపై కొంతమంది రాళ్లు రువ్వడంతో ఘర్షణలు చెలరేగాయి. ఈ అల్లర్ల కారణంగా చందన్ గుప్తా అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో నిన్నటి నుంచి కాస్‌గంజ్‌లో కర్ఫ్యూ విధించారు. శనివారం ఆందోళనకారులు మరింత రెచ్చిపోయారు. కాస్‌గంజ్ ప్రాంతంలోని పలు దుకాణాలకు, బస్సులకు నిప్పు పెట్టారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఆర్ఏఎఫ్, పీఏసీ బలగాలు రంగంలోకి దిగాయి. ఘంటాఘర్, నద్రై గేటు సమీపంలో కొందరు ఆందోళనకారులు పెట్రోల్ బాటిల్స్‌తో దాడులకు దిగినట్లు పోలీసులు వెల్లడించారు. రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది పరిస్థితి అదువులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. 26 మందికి వ్యతిరేకంగా రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు కాస్‌గంజ్ పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ఈ అల్లర్లలో చని పోయిన చందన్‌గుప్తాకు భాజపా ఎంపీ రాజ్‌వీర్‌సింగ్ నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యులను పరామర్శించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ మృతుడి కుటుంబానికి రూ.5లక్షలు పరిహారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు.



మూడు అంతర్జాతీయ కోర్టుల ఏర్పాటు



బీజింగ్ : బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియే టివ్ (బిఆర్ఐ) ప్రాజెక్టుకు సంబంధించిన వివాదాలను పరిష్క రించుకునేందుకు మూడు అంతర్జాతీయ కోర్టులను ఏర్పాటు చేయాలని చైనా నిర్ణయించింది. చైనాకు చెందిన సుప్రీం పీపుల్స్ కోర్టు బీజింగ్, గ్జియాన్, షెన్‌జె న్‌ల్లో అంతర్జాతీయ కోర్టులను నెలకొల్పుతుందని ప్రభుత్వ మీడియా గ్లోబల్ టైమ్స్ తెలిపింది. వాయవ్య చైనాలో ఏర్పాటు చేసే గ్జియాన్ కోర్టు సిల్క్ రోడ్‌కు సంబంధించిన కేసులను చేపడుతుంది. దక్షిణచైనాలోని షెంజెన్ కోర్టు మారి టైమ్ సిల్క్ రోడ్ వివాదాలకు సంబంధించిన కేసులను చూస్తుంది. బీజింగ్ కోర్టు వీటికి ప్రధాన కార్యాలయంగా వుంటుంది. లిటిగేషన్లను, మధ్యవరిత్వపు కేసులను ఈ కోర్టులు చూస్తాయి. న్యాయపరమైన తోడ్పాటును అందచేస్తాయి. వివాదాలను పరిష్కరిస్తాయి. ఈ ప్రాజెక్టు అమల్లో తలెత్తే వాణిజ్య, పెట్టుబడుల వివాదాలను న్యాయపరంగా పరిష్కరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. 60కి పైగా దేశాలు బిఆర్ఐలో పెట్టుబడులు పెట్టేం దుకు సంతకాలు చేశాయని చైనా చెబుతోంది.

ట్రంప్‌పై కార్మిక ఉద్యమ సంస్థల తిరుగుబాటు

- ఎన్నికల్లో విజేతలుగా నిలవాలని నిర్ణయం
- ట్రంప్ కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట
- ఎన్నికల ఏడాది కావడంతో అనేక సమావేశాలు
- అధికార హెూదాల్లోకి ప్రవేశించాల్సిందిగా మహిళలకు ఆహ్వానం

న్యూయార్క్: అమెరికాలో ఈ ఏడాది జరగనున్న ఎన్నికల్లో విజేతలుగా నిలవాలని కార్మిక ఉద్యమ సంస్థలు నిర్ణయించుకున్నాయి. హూస్టన్‌లో గత వారం జరిపిన సమావేశంలో ఈ నిశ్చయం బలంగా వ్యక్తమయింది. ఎఎఫ్ఎల్ సిఐఒ (స్వేచ్ఛకోసం ఉద్యమిస్తున్న మహిళల వేదిక) మార్టిన్ లూథర్ కింగ్ పేరిట జరిగిన మహా సభ అది. ట్రంప్ పాలనా యంత్రాంగం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయడం కోసం మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వ అన్ని స్థాయిలలో ఎన్నికలు గెలవాలని కార్మిక సంఘాల నేతలు 2018 సంవత్సరానికి వ్యూహాలు పన్నుతున్నారు. ఇది ఎన్నికల ఏడాది కావడంతో వారు అనేక సమావేశాలు జరువుతున్నారు. ఈ నెల 14న జరిగిన ఒక సదస్సులో ఎన్నికల ద్వారా భర్తీ అయ్యే అధికార హోదాల్లోకి ప్రవేశించాల్సిందిగా మహిళలను కార్మిక నేతలు కోరారు. అలా ఎన్నికవడానికి మౌలిక సూత్రాలను సయితం సూచించారు. ఎన్నికల ప్రచారాలకు, సదస్సుల నిర్వహణకు వ్యూహాలను రచించడంలో మరో బృాఎందం మునిగిపోయింది. రానున్న ఎన్నికలలో మహిళలు విరివిగా పాల్గొనాలని ఇద్దరు ప్రముఖ మహిళా కార్మిక నేతలు పిలువునిచ్చారు. థెరెసా మస్కెడా అనే మహిళ సియాటెల్ సిటీ కౌన్సిల్ సీటుకు ప్రతినిధిగా ఉన్నారు. మరో మహిళ కాలిఫోర్నియా స్టేట్ సెనేట్ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. చాలా కాలంగా తమకు ప్రాతినిథ్యం లేకుండా ఉందని, ఎన్నికల్లో పోటీ చేయక తమకు ఇప్పుడు గత్యంతరం లేదని వాషింగ్టన్ స్టేట్ కార్మిక సమాఖ్య మాజీ రాజకీయ డైరెక్టర్ కూడా అయిన మాస్కెడా అన్నారు. రియల్ ఎస్టేట్ మొగుల్ ట్రంప్ అధ్యక్ష భవనాన్ని ఆక్రమించినప్పటి నుంచి కార్మిక నేతలు, మహిళా నాయకులు, మైనారిటీలు హక్కులు కోల్పోతుండడంతో వాటి రక్షణ కోసం బాహాటంగా బయటకు వస్తున్నారు. ట్రంప్‌తోపాటు ఆయన రిపబ్లికన్ సహచరుల నుంచి కూడా తమ హక్కులకు భంగం కలుగుతున్నట్లు వారు భావిస్తున్నారు. రాజకీయ వాదులను తమ గుప్పెట్లో ఉంచుకునే ఒక్క శాతం కార్పొరేట్ సంస్థల నుంచి కూడా ప్రమాదం ఉన్నట్లు వారు ఆందోళన చెందుతున్నారు. వాషింగ్టన్‌లో ట్రంప్ అధ్యక్ష పదవీ స్వీకారం రోజున మహిళల భారీ యాత్ర జరిగినప్పటి నుంచి ఎన్నికల్లో పోటీకి సానుకూలత వ్యక్త చేస్తూ 26,000మంది మహిళల నుంచి తమకు కాల్స్ వచ్చినట్లు మహిళా కార్మిక నేతలు తెలిపారు. వారిలో 2400మందికి తాము శిక్షణ ఇచ్చామని కూడా వారు తెలిపారు. కార్మిక మహిళలు కూడా ఎన్నికలలో పోటీకి ముందుకు వస్తున్నారని తెలిపారు. వాషింగ్టన్ రాష్ట్రంలో 30 మంది మహిళలు ఎఎఫ్ఎల్ సిఐఒ రాజకీయ ప్రచార శిక్షణను పొందారు. గత ఎన్నికల్లో 12 మంది గెలుపొందారు. వారి లో సగం మంది మైనారిటీలు. రాజకీయ చర్చలలో పురుష ప్రతినిధులు మహిళల వాణిని అణగద్రొక్కే సాంప్రదాయాన్ని తరిమి వేయాలని సమావేశాల్లో వక్తలు పిలువునిస్తున్నారు. ఆ ఆనవాయితీలను మహిళలు అధిగమించాలంటే రాజకీయ చర్చల్లోకి తమ అంశాలను తీసుకు రావాలని, కార్యాచరణకు పట్టుపట్టాలని హక్కుల కార్యకర్తలు పిలువునిస్తున్నారు.



ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం



ముంబయి: ముంబయిలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోరేగావ్ తూర్పు ప్రాంతంలోని ఓ ఫ్యాక్టరీలో శనివారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి,. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయకచర్యలు చేపట్టారు. 15 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు.కాగా.. ఇప్పటివరకు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదని తెలుస్తోంది. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా.. గత నెలలో ముంబయిలోని కమలా మిల్స్ భవన సముదాయంలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. రూఫ్‌టాప్‌లో ఉన్న పబ్‌లో మంటలు చేలరేగి 14 మంది మృతిచెందారు.

అసోంలో రైళ్ల దిగ్బంధం

గువహతి : అస్సాంలో రెండు రోజులుగా రైళ్ళు తిరగడం లేదు. ప్రధానంగా సిలిచార్-గువహతి మార్గంలో రైళ్ళు నిలిచి పోయాయి. దీంతో దాదావు 2 వేల మంది ప్రయాణికులు గమ్య స్థానాలు చేరలేక మధ్యలోనే చిక్కుకు పోయారు. డిమా హసోవ్ జిల్లాలోని మైబాంగ్ ప్రాంతంలో గురువారం పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మృతి చెందడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ నేపథ్యంలో అధికారులు నిరవధిక కర్ఫ్యూ విధించారు. గ్రేటర్ నాగాలాండ్‌లో దిమాస జిల్లాను చేర్చడాన్ని నిరసిస్తూ ఆ ప్రాంతంలోని వందలాది మంది దిమాస గిరిజనులు నిరసన ఆందోళన చేపట్టారు. నిరసన చేస్తున్న గిరిజనులను చెదరగొట్టేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
28 జనవరి 2018

సొంత గడ్డకే గంభీర్, యువరాజ్

బెంగళూరు : ఐపీఎల్ 11వ సీజన్ కోసం నిర్వహించిన వేలం ఆసక్తికరంగా కొనసాగుతోంది. ఏ ఆటగాడి కోసం ఎక్కువ వెచ్చించాలన్న పక్కా ప్రణాళికతో వచ్చిన ఫ్రాంఛైజీలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. సిక్సర్ల హీరో యువరాజ్ సింగ్‌ను హైదరాబాద్ వదిలేసింది. కనీస ధర రూ.2కోట్లతో యువీని పంజాబ్ దక్కించుకుంది. ప్లేయర్ రిటెన్షన్‌లో గౌతం గంభీర్‌ను అట్టిపెట్టుకోకపోవడంతో కోల్‌కతా అతడ్ని వదిలేస్తుందనే వార్తలొచ్చాయి. అదే నిజం చేస్తూ ఈ రోజు వేలంలో కోల్‌కతా అతడి కోసం ఆర్‌టీఎం వాడలేదు. దీంతో రూ.2.8కోట్లకు ఢిల్లీ డేర్‌డెవిల్స్ గంభీర్‌ను సొంతం చేసుకుంది. మ్యాక్స్‌వెల్, రవిచంద్రన్ అశ్విన్, స్టోక్స్, మిచెల్ స్టార్క్ కోసం ఫ్రాంఛైజీలు పోటీ పడ్డాయి. గత ఏడాది కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌కు ఆడిన మ్యాక్స్‌వెల్ కోసం ఢిల్లీ -హైదరాబాద్ నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. రూ.9కోట్ల వద్ద హైదరాబాద్ వేలం నుంచి తప్పుకుంది. అలాగే రైట్ టు మ్యాచ్ కార్డును పంజాబ్ మ్యాక్స్‌వెల్ కోసం ఉపయోగించలేదు. దీంతో రూ.9కోట్లకు ఢిల్లీ డేర్‌డెవిల్స్ అతన్ని సొంతం చేసుకుంది.



ఐపీఎల్ తొలి రోజు వేలం పూర్తి

అంచనాలు తారుమారు





బెన్ స్టోక్‌కు రూ.12.5 కోట్లు

- యువతకు ఫ్రాంచైజీల పెద్దపీట
- గతం ఖరీదైన ఆటగాళ్లకు నిరాశ
- కనీస ధరకే ఒకప్పటి మ్యాచ్ విన్నర్లు
- గేల్, గప్టిల్ వంటి స్టార్లుకు చుక్కెదురు
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన ఫ్రాంచైజీలు
- అత్యధిక ధర బెన్ స్టోక్‌కు రూ.12.5 కోట్లు

బెంగళూరు : ఆటగాళ్లు.. అభిమానులు ఎప్పుడెప్పుడా..? అని ఎదురు చూసిన ఐపీఎల్ సరికొత్త సీజన్ వేలం తొలిరోజు (శనివారం) ముగిసింది. వేలం ఆద్యంతం అత్యంత ఆసక్తికరంగా సాగింది. కుర్రాళ్లు అంచనాలను మించి అధిక ధరకు అమ్ముడుపోగా ఒకప్పటి మ్యాచ్ విన్నర్లు కనీస ధరను కూడా దాటిపోలేదు! ఓ రకంగా చెప్పాలంటే ఈ సారి ఐపీఎల్‌కు కూడా దూరమయ్యారని చెప్పుకోవాలి. ప్రతి బంతికీ సిక్సర్ బాదే బ్యాట్స్‌మెన్... అవసరమైన సమయంలో వికెట్లు తీసే బౌలర్లు... అటు బ్యాటుతో ఇటు బంతితో రాణించే ఆల్‌రౌండర్లు.. ప్రతి బంతినీ ఒడిసిపట్టే చురుకైన కీపర్లకు మాత్రం మంచి ధరనే దక్కింది.

మొత్తం ఖర్చు రూ.321 కోట్లు

పదకొండో సీజన్‌లో వేలానికి 580 మంది ఆటగాళ్లను ఎంపిక చేయగా అందులో 361 మంది భారతీయులు. తొలి రోజు ఫ్రాంఛైజీలు అన్నీ కలిపి రూ.321.10 కోట్లు ఖర్చుచేసి 78 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. అందులో 29 మంది విదేశీయులే ఉండటం గమనార్హం. వేలంలో ప్రీతిజింతా నేతృత్వంలోని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ పోటాపోటీగా ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఉత్సాహం ప్రదర్శించింది.

రాజస్థాన్ అందరికంటే ఎక్కువ

రాజస్థాన్ రాయల్స్ అత్యధికంగా రూ.23.50 కోట్లు వెచ్చించి 9 మందిని కొనుగోలు చేసింది. అందులో ఐదుగురు విదేశీయులే ఉన్నారు. ఇక కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.21.90 కోట్లతో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు సహా 10 మందిని తీసుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ రూ.17 కోట్లు వెచ్చించి నలుగురు విదేశీయులు సహా 11 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ముంబయి ఇండియన్స్ రూ.15.80 కోట్లతో 9, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.15.85 కోట్లతో 14, ఢిల్లీ డేర్ డెవిల్స్ రూ.12.30 కోట్లతో 15, కోల్‌కతా నైట్ రైడర్స్ రూ.7.60 కోట్లతో 12, సన్‌రైజర్స్ రూ.7.95 కోట్లతో 16 మందిని కొనుగోలు చేశాయి.





అత్యధిక ధర పలికిన వీరులు

తాజా ఐపీఎల్ వేలంలో అనుకున్నట్టుగానే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్‌స్టోక్స్ అత్యధికంగా రూ.12.50 కోట్ల ధర పలికాడు. అతడిని రాజస్థాన్ రాయల్స్ తీసుకుంది. గతేడాది 14 కోట్లు పలికిన అతడు ఈసారి 2 కోట్లు తక్కువకే దొరికాడు. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ మనీశ్ పాండేను సన్‌రైజర్స్ రూ.11 కోట్లు, ఓపెనర్ కేఎల్ రాహుల్‌ను కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.11 కోట్లు, హిట్టర్ క్రిస్‌లిన్‌ను రూ.9.60 కోట్లు, మిచెల్ స్టార్క్ రూ.9.40 కోట్లకు కోల్‌కతా దక్కించుకున్నాయి. గతేడాది పంజాబ్‌కు ఆడిన ఆసీస్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌ను ఢిల్లీ రూ.9 కోట్లు, మిస్టరీ స్పిన్నర్, అఫ్గాన్ సంచలనం రషీద్ ఖాన్‌ను సన్‌రైజర్స్ రూ.9 కోట్లు, కృనాల్ పాండ్యను ముంబయి ఇండియన్స్ రూ.8.80 కోట్లు పెట్టి కొనుగోలు చేశాయి.

కనీస ధరకు ఒకప్పటి మ్యాచ్ విన్నర్లు

ఒక్కప్పటి మ్యాచ్ విన్నర్లు యువీ, గంభీర్, హర్భజన్ కనీస ధరకే అమ్ముడుపోయారు. వీరిని కొనుగోలు చేసేందుకు ఫ్రాంఛైజీలు అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. లోకల్ బాయ్ యువీని రూ.2 కోట్లకు పంజాబ్ సొంతం చేసుకుంది. హర్భజన్‌ను రూ.2 కోట్లకు చెన్నై దక్కించుకుంది. గంభీర్‌ను రూ.2.8 కోట్లకు ఢిల్లీ డేర్ డేవిల్స్ దక్కించుకుంది.

సెహ్వాగ్‌కు చుక్కెదురు

చాలాకాలం తమను అట్టిపెట్టుకున్న కొందరు స్టార్లకు ఈ సారి ఫ్రాంఛైజీలు మొండిచేయి చూపించాయి. తనను తాను యూనివర్స్ బాస్‌గా చెప్పుకునే క్రిస్‌గేల్, టాప్ ఆటగాళ్లు జేమ్స్ ఫాల్క్‌నర్, హేజిల్‌వుడ్, మిచెల్ జాన్సన్, మురళీ విజయ్, ఆమ్లా , జోరూట్, ఆడమ్ జంపా, పార్థివ్ పటేల్, టిమ్ సౌథీ, మెక్లెనగన్, లసిత్ మలింగ, మార్టిన్ గప్టిల్, నమన్ ఓజా, ఈ మధ్య విదర్భను రంజీ విజేతగా నిలిపిన రజనీష్ గుర్బానీ వైపు ఎవ్వరూ కన్నెత్తి చూడలేదు!

సన్‌రైజర్స్ ఆచితూచి

వేలంలో సన్‌రైజర్స్ ఆచితూచి ఆటగాళ్లను కొనుగోలు చేసింది. మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ మనీశ్ పాండేను రూ.11 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. అలాగే రైట్ టు మ్యాచ్ ద్వారా అఫ్గాన్ సంచలన స్పిన్నర్ రషీద్ ఖాను రూ.9 కోట్లకు తీసుకుంది. అతడు గత వేలంలో రూ.4 కోట్ల ధర పలికాడు. శిఖర్ ధావన్‌ను రూ.5.20 కోట్లకు, కీపర్ వృద్ధిమాన్ సాహాను రూ.5 కోట్లకు కొనుగోలు చేసింది. సిద్ధార్ కౌల్ (3.80), దీపక్ హుడా (3.60), సయ్యద్ ఖలీల్ అహ్మద్ (3), కేన్ విలియమ్సన్ (3), కార్లోస్ బ్రాత్‌వైట్ (2), షకిబ్ అల్ హసన్ (2), యుసుఫ్ పఠాన్ (1.90), బసిల్ థంపి (0.95), టీ నటరాజన్ (0.40), రికీ భుయ్ (0.20) ను తీసుకుంది.

చెన్నై సూపర్ కింగ్స్ జేబులో భజ్జీ

దాదావు ముంబయిని సొంతగడ్డగా భావించే హర్భజన్‌ను ఈ సారి చెన్నై దక్కించుకుంది. బెంగళూరు ఆటగాడు కేదార్‌జాదవ్‌ను రూ.7.8 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది సూపర్ కింగ్స్. డ్వేన్ బ్రావో (6.4 కోట్లు), కర్ణశర్మ (5), షేన్ వాట్సన్ (4), అంబటి రాయుడు (2.20), డుప్లెసిస్ (1.60), ఇమ్రాన్ తాహిర్ (1)ని దక్కించుకుంది.



గంభీర్, మాక్స్‌వెల్ ఢిల్లీకి

పంజాబ్ వీరుడు మ్యాక్స్‌వెల్ (9 కోట్లు)ను భారీ ధరకు కొనుగోలు చేసింది ఢిల్లీ. కోల్‌కతాను విజేతగా నిలిపిన గంభీర్ (2.80) ఇంకా రబాడ (4.20), అమిత్ మిశ్రా (4), విజయ్ శంకర్ (3.20), రాహుల్ తెవతియా (3), షమి (3), కొలిన్ మన్రో (1.90), జేసన్ రాయ్ (1.50), పృథ్వీషా (1.20), అవీశ్ ఖాన్ (0.7), హర్షల్ పటేల్ (.2)ను కొన్నది.



యువీ ఇక పంజాబ్‌లో

టీమిండియా ప్రపంచకప్‌ల హీరో యువరాజ్‌ను అనుకున్నట్టుగానే కింగ్స్ ఎలెవన్ పంజాబ్ కొనుగోలు చేసింది. అదీ కనీస ధర 2 కోట్లకు. చెన్నై అశ్విన్‌ను రూ.7.60 కోట్లకు, కేఎల్ రాహుల్‌ను రూ.11 కోట్లకు, ఆరోన్ పింఛ్, మార్కస్ స్టొయినిస్‌ను రూ.6.20 కోట్లకు, కరుణ్ నాయర్‌ను రూ.5.60 కోట్లకు కొనుగోలు చేసింది. అంకిత్ రాజ్‌పుత్ (3), డేవిడ్ మిల్లర్ (3), మయాంక్ అగర్వాల్ (1) ఆ జట్టుకే దక్కారు.

క్రిస్‌లిన్‌పై కోల్‌కతా మోజు

ఆస్ట్రేలియా హిట్టర్ క్రిస్‌లిన్‌ను కోల్‌కతా రూ.9.60 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. ఇంకా మిచెల్ స్టార్క్ (9.40), దినేశ్ కార్తీక్ (7.40), రాబిన్ ఉతప్ప (6.40), కుల్‌దీప్ యాదవ్ (5.80), పియూష్ చావ్లా (4.20), నితీశ్ రాణా (3.40), కమలేశ్ నాగర్ కోటి (3.20), శుభ్‌మన్ గిల్ (1.80), ఇషాంక్ జట్టి (.20)కు దక్కించుకుంది.

తొలిరోజు ఐపీఎల్ వేళంలో ఆటగాళ్లకు దక్కిన ధర

- ★ బెన్ స్టోక్స్ - రాజస్థాన్ రాయల్స్ - రూ.12.5 కోట్లు
- ★ మనీశ్ పాండే - సన్‌రైజర్స్ హైదరాబాద్ - రూ. 11 కోట్లు
- ★ కేఎల్ రాహుల్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - రూ.11 కోట్లు
- ★ క్రిస్ లిన్ - కోల్‌కతా నైట్‌రైడర్స్ - రూ.9.6 కోట్లు
- ★ మిచెల్ స్టార్క్ - కోల్‌కతా నైట్ రైడర్స్ - రూ.9.4 కోట్లు
- ★ కేదార్ జాదవ్ - చెన్నై సూపర్ కింగ్స్ - రూ.7.8కోట్లు
- ★ రవిచంద్రన్ అశ్విన్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - కూ.7.6 కోట్లు
- ★ క్రిస్ వోక్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - రూ.7.4కోట్లు
- ★ అరోన్ ఫించ్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - రూ.6.2 కోట్లు
- ★ మార్కస్ స్టొయినిస్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - రూ.6.2కోట్లు
- ★ కరుణ్ నాయర్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్- రూ.5.6కోట్లు
- ★ కీరన్ పొలార్డ్ - ముంబయి ఇండియన్స్ - రూ.5.4 కోట్లు
- ★ శిఖర్ ధావన్ - సన్‌రైజర్స్ హైదరాబాద్-రూ.5.2 కోట్లు
- ★ అజింక్య రహానె - రాజస్థాన్ రాయల్స్ - రూ.4 కోట్లు
- ★ షేన్ వాట్సన్ - చెన్నై సూపర్‌కింగ్స్- రూ.4కోట్లు
- ★ మెకల్లమ్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - రూ.3.6కోట్లు
- ★ డేవిడ్ మిల్లర్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - రూ.3 కోట్లు
- ★ అంకిత్ రాజ్‌పుత్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - రూ. 3 కోట్లు
- ★ డిగ్రాండ్‌హోమ్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - రూ.2.2 కోట్లు
- ★ హర్భజన్ సింగ్ - చెన్నై సూపర్ కింగ్స్ - రూ.2 కోట్లు
- ★ షకీబ్ అల్ హసన్ - సన్‌రైజర్స్ హైదరాబాద్ - రూ.2 కోట్లు
- ★ డుప్లిసిస్ - చెన్నై సూపర్ కింగ్స్ - రూ.1.6కోట్లు
- ★ కార్లోస్ బ్రాత్‌వైట్ - సన్‌రైజర్స్ హైదరాబాద్ - రూ.2కోట్లు
- ★ యువరాజ్ సింగ్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - 2 కోట్లు
- ★ మయాంక్ అగర్వాల్ - కింగ్స్ ఎలెవన్ పంజాబ్ - రూ. కోటి
- ★ యూసుఫ్ పఠాన్ - సన్‌రైజర్స్ హైదరాబాద్ - రూ.1.9కోట్లు
- ★ కాలిన్ మున్రో - ఢిల్లీ డేర్‌డెవిల్స్ - రూ.1.9కోట్లు
- ★ మొయిన్ అలీ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు - రూ.1.7 కోట్లు
- ★ జేసన్ రాయ్ - ఢిల్లీ డేర్‌డెవిల్స్ - రూ.1.5 కోట్లు
- ★ స్టువర్ట్ బిన్నీ - రాజస్థాన్ రాయల్స్ - రూ.50లక్షలు

బెంగళూరుకు ఉమేశ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ క్రిస్‌వోక్స్‌ను అధిక ధర రూ.7.40 కోట్లకు కొనుగోలు చేసింది. యుజువేంద్ర చాహల్ (6), ఉమేశ్ యాదవ్ (4.20), బ్రెండన్ మెక్‌కలమ్ (3.60), నవ్‌దీప్ సైనీ (3), డికాక్ (2.80), కొలిన్ డీ గ్రాండ్‌హోమ్ (2.20), మొయిన్ అలీ (1.70), మనన్ వోహ్రా (1.10), కుల్వంత్ (0.85), అనికేత్ చౌదరి (0.30)ను తీసుకుంది.

భారత యువ ఆటగాళ్లకు భలే గిరాకీ

బెంగళూరు: అండర్-19 ప్రపంచకప్‌లో ఆడుతున్న భారత యువ ఆటగాళ్లు కొందరు ఈ రోజు ఐపీఎల్ వేలంలో రికార్డు ధరలకే అమ్ముడుపోయారు. ప్రస్తుత ప్రపంచకప్‌లో నిప్పులు చెరిగే బంతు లేస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోన్న బౌలర్ నాగర్‌కోటి అత్యధికంగా రూ.3.2కోట్లు పలికాడు. అతన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతం చేసుకుంది. పృథ్వీ షాను ముంబై ఇండియన్స్ సొంతం చేసుకుంటుందేమో అని అందరూ అనుకున్నారు. కానీ అతడ్ని ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ.1.2 కోట్లు వెచ్చించి దక్కించుకుంది. షా కనీస ధర రూ.20 లక్షలుగా నిర్ణయించగా.. 1.2 కోట్లకు అమ్ముడు పోయాడు.

ఎట్టకేలకు ఒక విజయం

- మూడో టెస్టులో కోహ్లీ సేనకు ఊరట
- ఒక రోజు మ్యాచ్ ఉండగానే గెలుపు
- 63 పరుగుల తేడాతో సౌతాఫ్రికా చిత్తు
- సిరీస్ చేజారినా పరువు దక్కింది
- ఆఖరు వరకు పోరాడిన ఎల్గర్, ఆమ్లా
- ఐదు వికెట్లతో షమి విజృంభణ
- సఫారీల ఆధిక్యం 2-1కి తగ్గింపు

జొహానెస్‌బర్గ్ : ఓటమెరుగని వాండరర్స్‌లో కోహ్లీసేన చిరస్మరణీయ విజయం అందుకుంది. బౌలర్లు సమష్టిగా విజృంభించిన వేళ ఆతిథ్య దక్షిణాఫ్రికాను 63 పరుగుల తేడాతో చిత్తుచేసింది. 241 పరుగుల లక్ష్యం ఛేదనకు దిగిన ఆ జట్టును 177 పరుగులకే కంగుతినిపించింది. చివరి టెస్టులో గెలుపుపై ఆశలే లేని స్థితిలోంచి విజయ శిఖరాలు అధిరోహించింది. మూడు టెస్టుల సిరీస్‌లో డుప్లెసిస్ సేన ఆధిక్యాన్ని 1-2కి తగ్గించింది. త్వరలో ప్రారంభమయ్యే వన్డే సిరీస్‌కు ప్రమాద ఘంటికలు మోగించింది. అటు బంతితో.. ఇటు బ్యాటుతో రాణించిన భువనేశ్వర్ కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. మొత్తంగా అజింక్య రహానె రాక అదృష్టాన్నే కలిగించింది.

నిరాశలో నుంచి..

నాలుగో రోజు, శనివారం ఆట గంట ఆలస్యంగా ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం వర్షం రావడంతో మైదానం తడిగా ఉండటమే ఇందుకు కారణం. నెర్రలు చాచి బ్యాట్స్‌మెన్‌ను తీవ్ర ఇబ్బంది పెట్టిన పిచ్ నేడు అలా లేదు! అంతా సర్దుకున్నట్టే కనిపించింది. ఇలాంటి స్థితిలో ఓవర్‌నైట్ స్కోరు 17/1తో ఆట ఆరంభించిన ఆతిథ్య జట్టు సునాయాసంగా పరుగులు సాధించింది. భోజన విరామానికి 69/1తో నిలిచింది. ఓపెనర్ డీన్ ఎల్గర్ (86 నాటౌట్; 240 బంతుల్లో 9x4, 1x6), హషీమ్ ఆమ్లా (52; 140 బంతుల్లో 5x4) అర్ధశతకాలు సాధించేసి మంచి ఊపుమీద కనిపించారు. నిలకడైన వారి బ్యాటింగ్.. వికెట్లు తీయలేక ఇబ్బందులు పడుతున్న భారత బౌలింగ్ చూస్తుంటే ఆతిథ్య జట్టు విజయం నల్లేరుపై నడకలా కనిపించింది. పిచ్ మార్పుతో ఇషాంత్, భువి, బుమ్రా, షమి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేయలేక కష్టపడ్డారు. ఈ క్రమంలో తేనీటి విరామానికి ముందు 124 పరుగుల వద్ద ఆమ్లాను ఇషాంత్ పెవిలియన్‌కు పంపించి షాకిచ్చాడు. మరో 7 పరుగులకే మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్‌ను బుమ్రా ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరుగుతుందేమో అనిపించినా... పరిస్థితిలో ఒక్కసారిగా మార్పులు చేటు చేసుకున్నాయి.

బౌలర్ల మెరుపు దాడి

తేనీటి విరామం తర్వాత టీమిండియా బౌలింగ్ దాడిని మరింత తీవ్రతరం చేసింది. షమి (5/28), బుమ్రా (2/57), ఇషాంత్ (2/31), భువి (1/39) విజృంభించి వెంటవెంటనే వికెట్లు తీశారు. జట్టు స్కోరు 144 వద్ద డుప్లెసిస్ (2)ను ఇషాంత్, 145 వద్ద డికాక్ (0)ను బుమ్రా అద్భుతమైన బంతులతో పెవిలియన్ పంపించారు. అయితే అప్పటికీ ఓపెనర్ డీన్ ఎల్గర్ బ్యాటింగ్‌లో తీవ్రత తగ్గలేదు. టెయిలెండర్లతో కలిసి అతడు పోరాడుతూనే ఉన్నాడు. చక్కని బౌండరీలు బాదుతున్నాడు. ఈ క్రమంలో 157 వద్ద ఫిలాండర్ (10)ను, ఫెహ్లుక్‌వాయో (0)ను షమి బౌల్డ్ చేసి మ్యాచ్ గమనాన్ని ఒక్కసారిగా మార్చేశాడు. మరో 3 పరుగులకే రబాడ (0)ను భువి ఔట్ చేయడం దక్షిణాఫ్రికా 160/8తో నిలిచింది. ఇక చివరి ఇద్దరు బ్యాట్స్‌మెన్ మోర్కెల్ (0)ను, లుంగి ఎంగిడి (4)ని షమి పెవిలియన్‌కు పంపించి జట్టుకు విజయాన్ని అందించాడు.



ఇండోనేసియా మాస్టర్స్ ఫైనల్లో సైనా



జకార్తా : ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో పీవీ సింధుపై రెండు వరుస గేమ్‌ల్లో విజయం సాధించి సెమీస్ చేరిన సైనా అదే జోరును కొనసాగించింది. థాయిలాండ్ క్రీడాకారిణి, నాలుగో సీడ్ రచనోక్‌తో సెమీస్‌లో తలపడిన సైనా రెండు వరుస సెట్లలో విజయం సాధించింది. 49 నిమిషాల పాటు హోరాహోరీగా జరిగిన ఈ పోరు ఆద్యంతం నువ్వా నేనా అన్నట్లు సాగింది. గాయం నుంచి కోలుకుని ఇటీవలే కోర్టులో అడుగుపెట్టిన సైనా ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా ఏమాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. చివరకు సైనా 21-19, 21-19తో మ్యాచ్‌ను గెలుచుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో ఈ ఏడాది పాల్గొన్న తొలి టోర్నమెంట్‌లోనే సైనా ఫైనల్ చేరడంతో భారత అభిమానుల్లో సంతోషం వ్యక్తమైంది. తైజు యింగ్-బింగ్ జియావో మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో సైనా ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో తలపడనుంది.

యువ క్రికెటర్ హఠాన్మరణం

- బౌలింగ్ వేస్తూ కుప్పకూలిన ఆంథోని
- ఆసుపత్రికి తరలించినా ఫలితం శూన్యం



హైదరాబాద్ : నగరంలోని బంజారాహిల్స్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్ నం.10లో ఓ యువకుడు క్రికెట్ ఆడుతూ హఠాన్మరణం చెందాడు. జహీరానగర్‌లోని ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆంథోని (23) అనే యువకుడు బౌలింగ్ వేస్తుండగా ఛాతిలో నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే సహచర ఆటగాళ్లు అతన్ని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం రాత్రి బంజారాహిల్స్ టోర్నమెంట్‌లో భాగంగా ఈ క్రికెట్ మ్యాచ్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఓ హోటల్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

వోజ్నియాకీదే ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల టైటిల్



మెల్‌బోర్న్ : ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను డెన్మార్క్‌కు చెందిన రెండో సీడ్ కరోలినా వోజ్నియాకి దక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సిమోనా హలెప్(రుమేనియా)తో హోరాహోరీగా తలపడి విజయం దక్కించుకుంది. ఫైనల్లో వోజ్నియాకి 7-6, 3-6, 6-4తో గెలుపొందింది. తొలి సెట్‌లో ఇరువురి మధ్య గట్టి పోటీ జరిగింది. ఒక దశలో ఇద్దరు 6-6తో సమంగా నిలిచా రు. సెట్ బ్రేక్‌లో వోజ్నియాకి హలెప్‌పై పైచేయి సాధించింది. అయితే రెండో సెట్‌లో మాత్రం హలెప్ ఎదురుదాడికి దిగడం తో వోజ్నియాకి తేలిపోయింది. దీంతో 3-6తో సెట్ కోల్పో యింది. ఇక విన్నర్‌ను నిర్ణయించే మూడో సెట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. 72 నిమిషాల పాటు సాగిన చివరి సెట్లో 6-4తో వోజ్నియాకి సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకుంది. వోజ్నియాకి ఇదే తొలి గ్రాండ్‌స్లామ్.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.